KR TV

# మన క్రాంతి

ఇది వాస్తవ పత్రిక...

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి:1 సంచిక:11 మంగళవారం, డిసెంబర్ 10, 2024 ఎడిటర్ : సందెపల్లి క్రాంతికుమార్ పేజీలు : 8 వెల : 3 రూ/-


**నేటి మాట**

మండిన కొవ్వొత్తి
మనది కానట్లే
గడిచిన
కాలమూ
తిరిగిరాదు



## తెలంగాణ తల్లి విగ్రహాన్ని
# ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ క్రాంతిన్యూస్:** తెలంగాణ తల్లి విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. సచివాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన 20 అడుగుల తెలంగాణ తల్లి కాంస్య విగ్రహాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. గుండుపూసలు, హారం, ముక్కుపుడక, ఆకుపచ్చ చీర, కడియాలు, మెట్టెలతో పాటు చాకలి ఐలమ్మ, సమ్మక్క సారలమ్మ పోరాట స్ఫూర్తితో ఈ విగ్రహాన్ని రూపొందించినట్లు ప్రభుత్వం పేర్కొంది. వరి, మొక్కజొన్నలు, సజ్జలు, జొన్నలు తెలంగాణ తల్లి చేతిలో కనిపించేలా విగ్రహం రూపొందించారు. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తిస్తూ జీవో జారీ చేసింది. ఈ మేరకు సీఎస్ శాంతి కుమారి సోమవారం

2లో..



## తల్లిన మార్చిన మూర్ఖుడు
# ఎవడూ లేడు: కేటీఆర్

**రాబోయే రోజుల్లో తెలంగాణ ఆడబిడ్డలకు ప్రత్యేకమైన బతుకమ్మ కనపడొద్దని.. తెలంగాణను మాయం చేయాలనే కుట్ర కనిపిస్తుందని కేటీఆర్ అన్నారు. మేడ్చల్ జిల్లాలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు.**



**హైదరాబాద్ క్రాంతిన్యూస్:** మేడ్చల్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ .. 15 ఏండ్ల క్రితం తెలంగాణ కోసం ఉక్కు సంకల్పంతో బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ దీక్షకు దిగారని చెప్పారు. దీక్ష సఫలమైన ఈ రోజును విజయ్ దివస్‌గా జరుపుకుంటున్నామని చెప్పారు. తెలంగాణ సాధకుడిగా కేసీఆర్ పేరు చిరస్థాయిలో నిలిచి పోతుందన్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ద్రోహిగా మిగిలిపోవడం ఖాయం అని పేర్కొన్నారు. ఇవాళ తెలంగాణ అస్తిత్వంపై దాడి జరుగుతున్నదన్నారు. రేవంత్ రెడ్డి ఏర్పాటు చేసింది తెలంగాణ తల్లి విగ్రహం కాదని, కాంగ్రెస్ తల్లి విగ్రహం అని పేర్కొన్నారు. కాంగ్రెస్ రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. ఉద్యమ కడలి మధనంలో తెలంగాణ తల్లి ఉద్భవించిందని చెప్పారు. స్వాతంత్ర్య పోరాటంలో భారత మాత విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నామని గుర్తు చేశారు. నా తెలంగాణ కోటి రతనాల వీణ అని కాళోజీ నారాయణ రావు పొగిడారని చెప్పారు. దేవతా రూపంలో ఉన్న తల్లిని చిన్నగా చూపే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పుట్టిన గడ్డను మాతృమూర్తిగా చూసుకునే సంస్కృతి తెలంగాణదన్నారు.కేసీఆర్ నాయకత్వంలో కవులు, కళాకారులు, శిల్పుల సారధ్యంలో సమిష్టిగా ఆవిర్భవించింది తెలంగాణ తల్లి అని కేటీఆర్ పేర్కొన్నారు. చూడగానే చెయ్యెత్తి దండం పెట్టేలా తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసుకున్నాం అని తెలిపారు. తెలంగాణ సంస్కృతిని అవమానించిన వారికి ధీటుగా సమాధానమిస్తాం అని తెలిపారు. తెలంగాణకు ప్రత్యేకంగా చేతిలో బతుకమ్మతో తెలంగాణ తల్లిని ఏర్పాటు చేసుకున్నాం అని చెప్పారు. అంత గొప్ప తల్లిని ఈనాడు కాంగ్రెస్ పార్టీ సర్కార్ పేదరాలిని చేసిందన్నారు. తల్లులను మార్చే దుర్మార్గులు ప్రపంచంలో ఎక్కడా ఉండరని వ్యాఖ్యానించారు.

2లో..



## కరిగిన మంచు

- మోహన్ బాబు వర్సెస్ మంచు మనోజ్

2లో..



## రాజ్యసభ చైర్మన్‌పై అవిశ్వాసం

- ఇండియా కూటమి సంచలన నిర్ణయం

2లో..



బీజేపీ రాజ్యసభ ఎంపీ అభ్యర్థిగా
## ఆర్ కృష్ణయ్య

2లో..

## ఈ సెషన్‌లోనే పార్లమెంట్ ముందుకు
# 'వన్ నేషన్.. వన్ ఎలక్షన్' బిల్లు



'వన్ నేషన్.. వన్ ఎలక్షన్' బిల్లును పార్లమెంట్ ముందుకు తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలను వేగవంతం చేసింది. ఈ పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని సర్కారు యోచిస్తోంది. ఒకవేళ అది సాధ్యం కాకపోతే వచ్చే పార్లమెంట్ సెషన్‌లో బిల్లును కచ్చితంగా ఉభయసభల ముందుకు తీసుకురావాలని భావిస్తోంది. లోక్‌సభ ఎన్నికలతోపాటే వివిధ రాష్ట్రాల అసెంబ్లీలకు కూడా ఒకే దఫా ఎన్నికలు నిర్వహించడం కోసం కేంద్రం ఈ బిల్లును తీసుకొచ్చింది. భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ప్రభుత్వం నియమించిన కమిటీ ఈ బిల్లుకు సంబంధించి పలు సిఫారసులు చేసింది. అనంతరం బిల్లుకు కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఇక బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందడమే తరువాయిగా ఉంది. ఈ బిల్లుకు పార్లమెంట్ ఆమోదముద్ర పడితే వివిధ రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్‌సభకు ఒకేసారి ఎన్నికలు జరగనున్నాయి. పార్లమెంట్లో ప్రవేశపెట్టడానికి ముందు బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) పంపాలని ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. జేపీసీ అన్ని పార్టీల ప్రతినిధులతో ఈ బిల్లుపై చర్చించి అందరి అంగీకారాన్ని తీసుకోనుంది. అంతేగాక అన్ని రాష్ట్రాల అసెంబ్లీల స్పీకర్ల నుంచి ప్రభుత్వం ఈ బిల్లుపై అభిప్రాయాలు కోరింది. మేధావులు, నిపుణులు, పౌర సమాజ సభ్యులు తదితరులను కూడా ఈ బిల్లుపై చర్చలో భాగస్వాములను చేయనున్నట్లు కేంద్రం తెలిపింది. ఆ తర్వాత సాధారణ ప్రజానీకం నుంచి కూడా ఈ బిల్లుపై అభిప్రాయాలను కోరనున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెప్పాయి.

## జీఓ 46పై రాష్ట్ర ప్రభుత్వానికి
# సుప్రీంకోర్టు నోటీసులు

**ఢిల్లీ :** జీవో 46 బాధితులు తమకు న్యాయం చెయ్యాలని సుప్రీం కోర్టును ఆశ్రయించగా ఈ రోజు జీవో 46 అంశం లో రాష్ట్ర ప్రభుత్వం తమ వైఖరి స్పష్టం చెయ్యాలని నోటీసులు జారీ చేయడం జరిగింది. తదుపరి విచారణ ఈ నెల 27 నా విచారణ వాయిదా వేయడం జరిగింది. బాధితుల తరుపున వాదించిన బృందం లో సుప్రీం కోర్టు సీనియర్ లాయర్ ఆదిత్య సొంది, జీ విద్యాసాగర్, మిథున్ శశాంక్ లు ఈ సందర్భంగా సుప్రీం కోర్టులో కేసు విచారణ కు హాజరైన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దాసోజు శ్రవణ్ కుమార్, ఏనుగుల రాకేష్ రెడ్డి లు, సుప్రీం కోర్టు వద్ద నుండి మాట్లాడుతూ ప్రజా పాలన ఉత్సవాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 46 బాదితులను ఏడ్పించుకుంటుంది. ఈ బిడ్డలను కూడా మీ ఉత్సవాల్లో భాగస్వాములను చేసుకోవాలి. బీఆర్ఎస్ పార్టీ అండతో, కేటీఆర్ గారి సహకారం తో ఈ కేసులో జీవో 46 బాధితులు విజయం సాధిస్తారు.రాష్ట్ర ప్రభుత్వాన్ని బాధితుల పక్షాన దండం పెట్టి ప్రాదేయపడుతున్నాం.. దయచేసి ఈ నిరుద్యోగ యువత గురించి సానుకూలంగా స్పందించండి.జనవరి 27 జరిగే విచారణ లో

2లో..





## కోఠిలో ఆశావర్కర్ల ఆందోళన

- సీఐపై చేయిచేసుకున్న ఆశావర్కర్
- ఎగిరెగిరి కొట్టిన పోలీసులు
- చీరపట్టి, చేయిపట్టి లాగుతూ ఏసీపీ అత్యుత్సాహం

2లో..

# అసెంబ్లీ వద్ద ఉద్రిక్తత

**- అసెంబ్లీ వద్ద కేటీఆర్, హరీష్ రావు సహా నేతల అరెస్ట్**

**హైదరాబాద్** తెలంగాణ అసెంబ్లీ వద్ద సోమవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సీఎం రేవంత్ – అదానీ ఫోటో ముద్రించిన టీషర్టులను ధరించి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు, భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీ గేట్ వద్దే నిరసన తెలిపారు. టీషర్టులతోనే లోపలికి వెళ్తామని తేల్చిచెప్పగా పోలీసులకు, వారికి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో కేటీఆర్, హరీష్ రావు సహా నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా వారు నినాదాలు చేశారు. ప్రభుత్వ తీరుపై కేటీఆర్, హరీష్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, గన్ పార్క్ వద్ద నివాళి

2లో..





## చంపేస్తామంటూ పవన్ పేషీకి బెదిరింపులు

2లో..

# అసెంబ్లీ వద్ద ఉద్రిక్తత

అర్పించి 'అదానీ, రేవంత్ భాయ్ భాయ్' అంటూ ముద్రించిన టీషర్టులు ధరించి బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీకి వచ్చారు. దీంతో వారిని పోలీసులు అడ్డుకున్నారు. టీషర్టులు ధరిస్తే లోపలికి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. దీంతో కేటీఆర్ పోలీసులతో వాగ్వాదానికి దిగారు.
పార్లమెంటుకు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఎంపీలు అదానీ ఫోటో ఉన్న టీషర్టులు ధరించి వెళ్లారని కేటీఆర్ తెలిపారు. 'లగచర్ల ప్రజల తరపున నిరసన తెలిపేందుకు సభకు వెళ్తున్నాం. బలవంతపు భూసేకరణను వ్యతిరేకంగా రైతుల తరపున పోరాడతాం. నడిరోడ్డుపైనే ఎమ్మెల్యేలను అడ్డుకోవడం సమంజసమా.?. అదానీకి కాంగ్రెస్ నేతలు దాసోహం అంటున్నారు. అదానీ – రేవంత్ బంధాన్ని బయటపెడతాం. పోలీసులను అడ్డు పెట్టుకుని సభకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో కుస్తీ గల్లీలో దోస్తీ కడుతున్నారు. ఆ పార్టీ దుర్మార్గ వైఖరికి వ్యతిరేకంగా అసెంబ్లీలో నిరసన తెలుపుతాం.' అని పేర్కొన్నారు.అటు, శాసనసభలోకి వెళ్లకుండా ప్రతిపక్ష నాయకులను అడ్డుకొని అరెస్టులు చేయడం పట్ల మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. 'అదానీ దొంగ అని, అవినీతి చేశాడని రాహుల్ గాంధీ తిడితే, రేవంత్ రెడ్డి ఇక్కడ చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నారు. వివిధ మార్గాల్లో ప్రతిపక్షాలు నిరసనలు తెలియచేస్తుంటాయి. అడ్డుకోవడం దుర్మార్గం. చీకటి ఒప్పందాలు బయట పడుతాయనే ప్రతిపక్షాన్ని సభలోకి రాకుండా అడ్డుకుంటున్నారు. మేము ప్రశ్నిస్తామని భయపడుతున్నారు. తెలంగాణ తల్లి విగ్రహంలో మార్పులు చేయాలని ఎవరైనా ఉద్యమించారా.?. కొత్తగా రూపొందించిన విగ్రహంలో బతుకమ్మను తొలగించి చెయ్యి గుర్తు పెట్టారు. అలా చేయడం తెలంగాణ మహిళలను కించపరచడమే. ఇది రాష్ట్ర ప్రజలకు అవమానం.' అని మండిపడ్డారు.

# కోఠిలో ఆశావర్కర్ల ఆందోళన

**హైదరాబాద్** హైదరాబాద్‌లో రాజకీయ పరిస్థితులు గందరగోళంగా మారాయి. ఓవైపు అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభం కాగా మరోవైపు బీఆర్ఎస్ నేతల ఆందోళనలు, ఇదే క్రమంలోనే ఆశావర్కర్ల నిరసనలతో హైదరాబాద్ నగరంలో ఒక్కసారిగా పరిస్థితి వేడెక్కింది. కోఠిలోని డీఎంఈ కార్యాలయం గేటు ముందు ఆశావర్కర్లు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం రూ.18 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆశావర్కర్లు పెద్ద ఎత్తున రోడ్డుపై బైఠాయించారు. రంగంలోకి దిగిన పోలీసులు ఆశావర్కర్లను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, ఆశావర్కర్లకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించిన ఆశాలను పోలీసులు అడ్డుకున్నారు. పరిస్థితి విషమించడంతో పోలీసులు వారిని బలవంతంగా అరెస్ట్ చేశారు. దీంతో డీఎంఈ కార్యాలయం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది.ఈ క్రమంలోనే ఆశావర్కర్ల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. మహిళా పోలీసులతో పాటు మగ పోలీసులు కూడా చేరి ఆశాలను వ్యాన్లలోకి లాగి పడేశారు. అందులోనూ ఏసీపీ శంకర్ మరీ ఎక్కువ అత్యుత్సాహం ప్రదర్శించారు. అక్కడ మహిళా కానిస్టేబుళ్లు ఉన్నప్పటికీ ఆశావర్కర్లను లాగేసేందుకు ఎక్కువ ఉత్సాహం కనబరిచారు ఏసీపీ శంకర్. మహిళను చేతులు పట్టి లాగటం, పట్టిలాగేయ్యాడంటూ మహిళా కానిస్టేబుళ్లను ఆదేశించటం ఈ క్రమంలో ఆ కానిస్టేబుళ్లను కూడా ఇష్టమున్నట్టు మోచేతులతో తోసేయ్యటం, ఎక్కడెక్కడో తాకటం లాంటి పనులు చేసిన వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ క్రమంలోనే ఏసీపీ శంకర్ మీదికి ఆశావర్కర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు ఓ ఆశావర్కర్‌ను వ్యాన్ ఎక్కించి డోర్ వేస్తున్న సమయంలో ఆమె సుల్తాన్ బజార్ సీఐ శ్రీనివాస్ చారిపై చేయి చేసుకుంది. సీఐ చెంప చెల్లుమనిపించాటాన్ని గుర్తించిన.. పోలీసులు ఆశావర్కర్‌పైన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదట మహిళా కానిస్టేబుళ్లు ఎగిరి మరీ ఆమెపై చేయి చేసుకోగా పురుష కానిస్టేబుళ్లు కూడా ఆమెను కొట్టేందుకు ఉత్సాహం చూపించారు. ఇదే గ్యాప్‌లో ఏసీపీ శంకర్ సైతం మరింత ఉత్సాహం చూపించారు. ఎగిరి మరీ ఆ ఆశావర్కర్ చీరపట్టి లాగారు. దీంతో వ్యాన్‌లో ఉన్న ఓ మహిళా కానిస్టేబుల్ వారించి చీరను సరి చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇంతకూ ఆ ఆశావర్కర్ ఎందుకు చేయి చేసుకుందని ఆరా తీస్తే వ్యాన్‌లో ఎక్కించినప్పుడు పురుష పోలీసులు తనను అసభ్యకరంగా తాకారని పైగా వ్యాన్‌లోకి తోసేసి డోర్ వేస్తున్న సమయంలో తన కాలు అందులో ఇరుక్కుందని ఎంత చెప్పినా వినిపించుకోలేదని అందుకే కోపంతో తాను చేయి లేపానని ఆ ఆశావర్కర్ వివరణ ఇచ్చారు. అంతేకాకుండా సీఐ శ్రీనివాస్ చారీ పరుష పదజాలంతో తిట్టారంటూ ఆశావర్కర్లు ఆరోపిస్తున్నారు.ఇదిలా ఉంటే ఈ తోపులాటలో ఓ ఆశావర్కర్ స్పృహతప్పి పడిపోయింది. అయినా సరే ఆమెను ఏమాత్రం పట్టించుకోకుండా మహిళా కానిస్టేబుళ్లు, పురుషకానిస్టేబుళ్లు, ఉన్నత స్థాయి పోలీసులు కూడా ఆమె పక్కనుంచే వెళ్తూ మిగతా ఆశావర్కర్లపైన తమ ప్రతాపం చూపించే ప్రయత్నం చేయటం శోచనీయమని పలువురు మహిళలు వాపోతున్నారు. చాలాసేపటివరకు ఆమెను పట్టించుకోకుండానే ఉన్నారని ఎంతసేపటికీ కళ్లు తెరవకపోవటంతో మిగతా మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయగా అప్పుడు అంబులెన్సులో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

# ఆమెరికాలోనే వున్న మంచు విష్ణు

**హైదరాబాద్** మంచు విష్ణు ప్రస్తుతం అమెరికాలోనే ఉన్నారు . ఆయను ఈరోజు హైదరాబాదు వస్తున్నారన్న వార్తల్లో నిజం లేదు. మంచు విష్ణు స్వయనా వివరాలను అధికారికంగా ప్రకటించేవరకు ఎలాంటి వార్తలను నమ్మవద్దని మంచు విష్ణు టీమ్ పేర్కొంది

## కాంగ్రెస్ పార్టీ అగ్రనేత

# సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

**గోదావరిఖని** కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ జన్మదిన వేడుకలు గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో సోమవారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు, ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ కొలిపాక సుజాత, నాయకులు దిటి బాలరాజు, గట్ల రమేష్, హాజరై సోనియా గాంధీ జన్మదిన కేకును వారి చేతుల మీద కట్ చేసి జన్మదిన వేడుకల్లో ఘనంగా నిర్వహించారు అనంతరం వారు మాట్లాడుతూ..... నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన సోనియా గాంధీ తెలంగాణకు దేవత అని కొనియాడారు. తెలంగాణ సాధన కోసం జరుగుతున్న పోరాటంలో అనేక మంది త్యాగాలు, ప్రాణ త్యాగాలు గమనించి, చలించిపోయి, తెలంగాణ రాష్ట్రం ఇస్తానని ప్రకటించి, ఇచ్చిన మాట ప్రకారం ప్రత్యేక రాష్ట్రాన్ని సోనియా గాంధీ ఇచ్చి మాట నిలబెట్టుకున్న దేవత అని తెలిపారు. ఆమెకు ప్రధాన మంత్రి పదవి అవకాశం వచ్చినా పదవి త్యాగం చేసి ప్రధాన మంత్రిగా మన్మోహన్ సింగ్ కు అవకాశం ఇచ్చి గొప్ప నేత్రి సోనియా గాంధీ అని అన్నారు.గత సంవత్సరం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీ పథకాల హామి నెరవేర్చడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, దాని అనుబంధ సంఘాల నాయకులు ఎండి ముస్తఫా, సుతారి లక్ష్మన్ బాబు, నాయిని ఓదెలు, కొప్పుల శంకర్, బొమ్మక రాజేష్, రాచకొండా కోటేష్, తాళ్లపెల్లి యుగేందర్, సాంబ మూర్తి, దూళికట్ట సతీష్, కౌటమ్ సతీష్, ఆడెపు రవి, సన్నీ, గడ్డం శేఖర్, పంజా శ్రీనివాస్, బొంతల లచ్చన్న, మీసాల సతీష్, రాజి రెడ్డి, భూషణ్, ఇండ్ల ఓదెలు, కుంట సది, పరుపాక శంకర్, మద్దెల శ్రీనివాస్, చొప్పరి శ్రీనివాస్, రాము, తిరుపతి రెడ్డి, బెంద్రెమ్ రాజిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గడ్డం సతీష్, అరిఫ్, రామ స్వామి, అశోక్ లతోపాటు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెండింగ్ ధరణి దరఖాస్తుల

# పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

### – జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి** జిల్లాలో పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ధరణి పెండింగ్ దరఖాస్తులు, జాతీయ రహదారుల భూ సేకరణ చెల్లింపుల పై జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష డివిజన్ వారిగా పెండింగ్ ధరణి దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహించా రు. ధరణి వెబ్ సైట్ లో నూతనంగా పెండింగ్ మ్యూటేషన్, పెండింగ్ సక్సెషన్ మొదలగు మాడ్యుల్స్ ను ప్రభుత్వం జిల్లా కలెక్టర్ నుంచి అదనపు కలెక్టర్, రెవెన్యూ డివిజన్ అధికారులకు బదలాయించ డం జరిగిందని, వీటిని వేగవంతంగా క్లియర్ చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. మంచిర్యాల వరంగల్ గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ ఆర్బిట్రేషన్ సంబంధిత రైతులకు వేగవంతంగా చెల్లింపులు చేయాలని, జాతీయ రహదారి నిర్మాణ పనులు త్వరగా గ్రౌండ్ అయ్యే విధంగా అధికారులు నేషనల్ హైవే అథారిటీకి పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు బి.గంగయ్య, సురేష్ , గోదావరిఖని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీరాములు , అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కరిగిన మంచు

### – మోహన్ బాబు వర్సెస్ మంచు మనోజ్

హైదరాబాద్ కలెక్షన్ కింగ్, నట ప్రపూర్ణ, పద్మశ్రీ అవార్డీ డా.ఎం. మోహన్ బాబు ఇంట్లో వివాదం ముదిరింది. తండ్రీ కొడుకుల మధ్య గత కొన్నేళ్లుగా మొదలైన ఆస్తి వివాదం ఇప్పుడు పెరిగి పెద్దదై వీధికెక్కింది. పరస్పరం పోలీసులకు కంప్లైంట్ లు ఇచ్చుకుంటూ ఈ వివాదాన్ని బయటపెట్టుకున్నారు మంచు మోహన్ బాబు, ఆయన చిన్న కొడుకు మంచు మనోజ్. ముందు మంచు మనోజ్ పై దాడి జరిగిందని ఆదివారం ఆయన ఆసుపత్రి కి కుంటుంకుంటూ వచ్చి ట్రీట్మెంట్ తీసుకున్నారు. సోమవారం పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్ లో తనపై గుర్తు తెలియని వ్యక్తులు ఎవరో దాడి చేశారని పోలీస్ కంప్లైంట్ ఇచ్చారు. కానీ ఆయన తండ్రి మోహన్ బాబు నేరుగా రంగంలోకి దిగేశారు. తన చిన్న కుమారుడు మంచు మనోజ్, ఆయన భార్య మౌనికా రెడ్డి తో తనకు ప్రాణ హాని ఉందని తన ఆస్తులకు రక్షణ లేదని చిన్నకొడుకు, కోడలు, వాళ్ల మనుషుల నుంచి తనకు రక్షణ కల్పించాలని కోరుతూ రాచకొండ పోలీస్ కమీషనర్ కు లేఖ రాసేశారు మోహన్ బాబు. గత కొంత కాలంగా ఆస్తి కోసం తన కుమారుడు వేధిస్తున్నాడని సంఘ విద్రోహశక్తులను తన ఇంటి మీదకు పురమాస్తున్నాడని ఫిర్యాదు చేసిన మోహన్ బాబు వారి నుంచి తనకు రక్షణ కల్పించాలని కోరారు. కొడుకు ఏమో ఎవరో దాడి చేశారని చెబుతుంటే తండ్రి ఏమో తన కొడుకే తన ఇంటి మీదకు దాడి వచ్చాడని చెప్పటంతో ఈ ఇష్యూ ఇంకెన్ని మలుపులు తీసుకోనుందో చూడాలి.

# చంపేస్తామంటూ పవన్ పేషీకి బెదిరింపులు

అమరావతి ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కార్యాలయానికి బెదిరింపు కాల్స్ రావటం కలకలం రేపుతోంది. డిప్యూటీ సీఎం కార్యాలయ సిబ్బందికి ఆగంతకుడి నుంచి బెదిరింపు కాల్స్ వచ్చినట్లు సమాచారం. ఫోన్ చేసిన అజ్ఞాత వ్యక్తి చంపేస్తామని హెచ్చరించినట్లు తెలిసింది. అలాగే అభ్యంతకర భాషను ఉపయోగిస్తూ సందేశాలు పంపినట్లు సమాచారం. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం పేషీ అధికారులు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే బెదిరింపు కాల్స్, మెసేజ్‌ల విషయాన్ని పోలీసు ఉన్నతాధికారులకు తెలిపారు. దీనిపై పోలీసులు కూడా దృష్టి సారించినట్లు సమాచారం. ఫోన్ చేసిన ఆగంతకుడు ఎవరు ఆకతాయిల పనా లేదంటే ఏదైనా కుట్ర కోణం ఉందా అనే విషయమై దర్యాప్తు జరుపుతున్నట్లు సమాచారం. మరోవైపు డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత పవన్ కళ్యాణ్ దూకుడైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. సనాతన ధర్మ పరిరక్షణ కోసం ఉద్యమిస్తున్నారు. వీటికి తోడు తన మంత్రిత్వశాఖల పరిధిలో జరిగిన అక్రమాలపైనా చర్యలు తీసుకుంటున్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల బాధ్యతలను పవన్ కళ్యాణ్ పర్యవేక్షిస్తున్నారు. ఈ శాఖల పరిధిలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు.
ఇటీవలే కాకినాడ పోర్టును సందర్శించిన పవన్ కళ్యాణ్ రేషన్ బియ్యం అక్రమ రవాణాను కూడా బయటపెట్టిన సంగతి తెలిసిందే. అయితే దూకుడైన నిర్ణయాల మీద ఉన్న పవన్ కళ్యాణ్‌ను బెదిరించే ప్రయత్నం కూడా కావొచ్చని కొంతమంది అభిప్రాయపడుతున్నారు. మరోవైపు పవన్ కళ్యాణ్ పేషీకి బెదిరింపు కాల్స్ రావడంపై ఆంధ్రప్రదేశ్ హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత స్పందించారు. ఈ విషయం గురించి వెంటనే ఆంధ్రప్రదేశ్ డీజీపీ ద్వారకా తిరుమలరావుతో మాట్లాడారు. డిప్యూటీ సీఎం పేషీకి రెండుసార్లు బెదిరింపు కాల్స్ వచ్చాయని ఈ సందర్భంగా డీజీపీ ద్వారకా తిరుమలరావు, హోంమంత్రి వంగలపూడి అనితకు వివరించారు. ఈ నేపథ్యంలో ఫోన్ కాల్స్ ద్వారా బెదిరించిన ఆగంతుకుడు ఎవరనే దానిపై దర్యాప్తు జరపాలని ఆగంతకుణ్ని అదుపులోకి తీసుకుని కఠిన చర్యలు తీసుకోవాలని వంగలపూడి అనిత డీజీపీ ద్వారకా తిరుమలరావును ఆదేశించారు. అయితే డిప్యూటీ సీఎం పేషీకి బెదిరింపు కాల్స్ రావటం ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# బీజేపీ రాజ్యసభ ఎంపీ అభ్యర్థిగా ఆర్ కృష్ణయ్య

అమరావతి త్వరలో జరిగే రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసే ముగ్గురు అభ్యర్థుల జాబితాను బీజేపీ విడుదల చేసింది. ఇందులో వైసీపీ మాజీ ఎంపీ, బీసీ నేత ఆర్ కృష్ణయ్యకు ఏపీ నుంచి పోటీ చేసే అవకాశం కల్పించారు. అలాగే హర్యానా నుంచి రేఖా శర్మ, ఒడిషా నుంచి సుజీత్ కుమార్ ను అభ్యర్థులుగా ఎంపిక చేశారు. వీరు త్వరలో రాజ్యసభకు జరిగే ఉపఎన్నికల్లో ఆయా రాష్ట్రాల నుంచి పోటీ చేయబోతున్నారు. వాస్తవానికి ఏపీలో వైసీపీలో రాజ్యసభ సభ్యులుగా ఉన్న మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్ రావు, ఆర్ కృష్ణయ్య ఈ మధ్యే ఆ పార్టీకి, తమ పదవులకు రాజీనామా చేశారు. దీంతో వీరి రాజీనామాల్ని రాజ్యసభ ఛైర్మన్ ఆమోదించారు. ఈ నేపథ్యంలో ఏపీలో కూటమి నుంచి ముగ్గురు అభ్యర్థుల్ని గెలిపించుకునే అవకాశం ఉండటంతో ఆర్ కృష్ణయ్యకు బీజేపీ నుంచి అవకాశం కల్పించారు. అలాగే మిగిలిన రెండు సీట్లకు టీడీపీ అభ్యర్థుల్ని నిలబెట్టబోతోంది. వైసీపీకి, ఎంపీ పదవులకు రాజీనామాలు చేసిన ముగ్గురు నేతల్లో ఆర్ కృష్ణయ్యకు బీజేపీ తిరిగి అవకాశం కల్పిస్తుండగా బీద మస్తాన్ రావుకు టీడీపీ అవకాశం ఇస్తోంది. మూడో సీటుకు మాత్రం మోపిదేవి వెంకటరమణకు బదులుగా సానా సతీష్ కు అవకాశ దక్కనుంది. వీరిద్దరి పేర్లను టీడీపీ ప్రకటించబోతోంది. అనంతరం నేడు వీరు ఎంపీ అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేస్తారు. నేటితో రాజ్యసభ ఎన్నికల అభ్యర్థుల నామినేషన్ల గడువు ముగియనుంది.

# ఆర్బీఐ కొత్త గవర్నర్ గా సంజయ్ మల్హోత్రా

న్యూఢిల్లీ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నూతన గవర్నర్ గా సంజయ్ మల్హోత్రా నియమితులయ్యారు. ఇప్పటివరకు ఆర్బీఐ గవర్నర్ గా బాధ్యతలు నిర్వర్తించిన శక్తికాంత దాస్ స్థానాన్ని సంజయ్ మల్హోత్రా భర్తీ చేయనున్నారు. శక్తికాంత దాస్ ఆర్బీఐ గవర్నర్ గా 2018 డిసెంబరు 12న బాధ్యతలు చేపట్టారు. ఆయన మూడేళ్ల పదవీకాలం పూర్తయినప్పటికీ, మరికొన్నాళ్ల పాటు పదవీకాలం పొడిగించారు. పొడిగించిన పదవీకాలం నేటితో ముగియనుంది.శక్తికాంత దాస్ స్థానంలో ఆర్బీఐ పగ్గాలు అందుకోబోతున్న సంజయ్ మల్హోత్రా పదవీకాలం బుధవారం ప్రారంభం కానుంది. ఆయన ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగుతారు. కేంద్ర క్యాబినెట్ నియామకాల కమిటీ ఈ మేరకు ఆమోద ముద్ర వేసింది. సంజయ్ మల్హోత్రా రిజర్వ్ బ్యాంకుకు 26వ గవర్నర్ గా సేవలు అందించనున్నారు.సంజయ్ మల్హోత్రా ప్రస్తుతం కేంద్ర ఆర్థిక శాఖలో రెవెన్యూ కార్యదర్శిగా ఉన్నారు. ఆయన 1990 బ్యాచ్ రాజస్థాన్ క్యాడర్ ఐఏఎస్ అధికారి. ఆయన ఐఐటీ కాన్పూర్ నుంచి కంప్యూటర్ సైన్స్ లో ఇంజినీరింగ్ పట్టా పుచ్చుకున్నారు. అమెరికాలోని ప్రఖ్యాత ప్రిన్స్ టన్ యూనివర్సిటీ నుంచి పబ్లిక్ పాలసీ సబ్జెక్టులో మాస్టర్స్ డిగ్రీ అందుకున్నారు. సివిల్స్ రాసి ఐఏఎస్ అయిన సంజయ్ మల్హోత్రా తన 33 ఏళ్ల కెరీర్ లో విద్యుత్, ఆర్థిక, పన్నులు, సమాచార సాంకేతికత, గనుల శాఖలో విధులు నిర్వరించారు.

# రాజ్యసభ ఛైర్మన్ పై అవిశ్వాసం

### – ఇండియా కూటమి సంచలన నిర్ణయం

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పార్లమెంటు సమావేశాల్లో అధికార ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో వరుసగా సమావేశాలు వాయిదా పడుతూ వస్తున్నాయి. అయితే ఇప్పుడే కాకుండా గత కొన్నేళ్లుగా పార్లమెంటు సమావేశాల్లో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొనడంతో వాయిదాలతోనే కాలం గడుస్తోంది. సభల్లో గందరగోళం మధ్యే కీలక బిల్లులను అధికార కూటమి ఆమోదం కల్పించుకుంటోంది. ఇక దేశంలోని వివిధ సమస్యలపై అటు లోక్‌సభ, ఇటు రాజ్యసభ అట్టుడుకుతూనే ఉన్నాయి. ఇక లోక్‌సభ విషయం పక్కన పెడితే రాజ్యసభలో ఛైర్మన్ తీరు పట్ల ప్రతిపక్షాలు ఎప్పటినుంచో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. కొన్నిసార్లు జగదీప్ ధన్‌ఖడ్‌తో పలువురు విపక్ష సభ్యులకు తీవ్ర వాగ్వాదం చోటు చేసుకోవడం గమనార్హం. ఇలాంటి పరిస్థితుల మధ్య తాజాగా రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే ఈ అవిశ్వాస తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టేందుకు హస్తం పార్టీ అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటోంది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ పెట్టే అవిశ్వాస తీర్మానానికి ఇండియా కూటమిలోని మిగిలిన పార్టీలు కూడా మద్దతు పలుకుతున్నాయి. రాజ్యసభలో ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశం ఛైర్మన్ ఇవ్వడం లేదని ప్రతిపక్షాలు తీవ్ర ఆరోపణలు చేస్తున్న వేళ ఈ పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం. సభలో ప్రతిపక్షాలపై జగదీప్ ధన్‌ఖడ్ పక్షపాతం చూపిస్తున్నారని గత కొంత కాలంగా ప్రతిపక్ష పార్టీలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఈ అవిశ్వాస తీర్మానంపై ఇప్పటికే 70 మంది ప్రతిపక్ష పార్టీల ఎంపీలు సంతకాలు చేశారు

ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఉభయ సభలు ప్రారంభం అయిన దగ్గర నుంచి అదానీ వ్యవహారం, మణిపూర్ హింస, సంభల్ అల్లర్ల ఘటనలు అటు లోక్‌సభ, ఇటు రాజ్యసభలను తీవ్రంగా కుదిపేస్తున్నాయి. దీంతో నిత్యం సభలు ప్రారంభం కావడం ఆ వెంటనే వాయిదాలు పడటం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే జార్జ్ సోరోస్‌తో సోనియా గాంధీకి సంబంధాలు ఉన్నాయంటూ అధికార కూటమి తీవ్ర విమర్శలు గుప్పించింది. ఈ అంశం కాస్తా రెండు సభల్లో తీవ్ర రగడ సృష్టిస్తోంది. ఇక రాజ్యసభలో ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ అధికార ఎన్డీఏ కూటమికి మద్దతు పలుకుతూ ప్రతిపక్ష ఇండియా కూటమి పట్ల చిన్నచూపు చూస్తున్నారని విపక్ష ఎంపీలు తీవ్ర ఆరోపణలు గుప్పిస్తున్నారు.

# తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి

ఉత్తర్వులు జారీ చేశారు. బంగారు అంచు కలిగిన ఆకుపచ్చ చీరను ధరించి, ప్రశాంతమైన నడవడికతో సంప్రదాయ మహిళా మూర్తిగా ఉన్న విగ్రహాన్ని తెలంగాణ తల్లి విగ్రహంగా ప్రభుత్వం ఆమోదించింది. ఇక నుంచి తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాలను ప్రతి సంవత్సరం డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించాలని ప్రభుత్వం జీవోలో పేర్కొంది. దీంతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, కలెక్టరేట్ లలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని పేర్కొంది. తెలంగాణ తల్లి విగ్రహం ఆత్మగౌరవానికి ప్రతీక అని, తెలంగాణ తల్లి విగ్రహం, రూపురేఖలను వక్రీకరించడం, మరో విధంగా చూపించడం నిషేధమని జీవోలో పేర్కొన్నారు. తెలంగాణ తల్లి విగ్రహ చిత్రాలను బహిరంగంగా లేదా సోషల్ మీడియాలో అగౌరవపరచడం, నాశనం చేయడం, కాల్చడం, అవహేళన చేయడం, అవమానించడం లేదా కించపరచడం నేరమని జీవోలో పేర్కొంది. 'తెలంగాణ తల్లి అంటే ఒక భావన మాత్రమే కాదు. 4 కోట్ల బిడ్డల భావోద్వేగం. ఆ భావోద్వేగానికి నిండైన రూపం మన తెలంగాణ తల్లి. ప్రజల మనోఫలకాలపై నిలిచిన తెలంగాణ తల్లి రూపాన్ని సచివాలయం సాక్షిగా ఆవిష్కరించేందుకు ప్రజా ప్రభుత్వం సిద్ధమైంది' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ తల్లి రూపకల్పనలో మన సంప్రదాయాలు, సంస్కృతులు చారిత్రక నేపథ్యాలను పరిగణలోకి తీసుకొని ఒక నిండైన రూపాన్ని తీర్చిదిద్దామని సీఎం తెలిపారు.

## తెలంగాణ తల్లి విగ్రహం ప్రత్యేకతలు

తెలంగాణ సంస్కృతికి అద్దం పడుతూ ప్రశాంత వదనంతో సంప్రదాయ కట్టుబొట్టుతో మెడకు కంటె.. గుండు పూసల ఆహారంతో, చెవులకు బుట్ట కమ్మలతో, ముక్కు పుడకతో, బంగారు అంచు కలిగిన ఆకుపచ్చ చీరలో, చేతికి గాజులు, కాళ్లకు కడియాలు మెట్టలతో, చాకలి ఐలమ్మ, సమ్మక్క సారలమ్మ పోరాట స్ఫూర్తితో ఎంతో హుందాతో కూడిన ఆహార్యంతో మన తెలంగాణ తల్లి రూపొందించారు.కుడి చేతితో జాతికి అభయాన్నిస్తూ ఎడమ చేతిలో తెలంగాణ మాగాణంలో పండే సంప్రదాయ పంటలైన వరి జొన్నలు, సజ్జలు, మొక్కజొన్న పంటలతో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి నిలువెత్తు రూపంగా తీర్చిదిద్దారు. తెలంగాణ తల్లి నిలుచున్న పీఠం చరిత్రకు దర్పణంగా రూపొందించారు. తెలంగాణ చిరునామానే ఉద్యమాలు పోరాటాలు, అమరుల ఆత్మ బలిదానాలు, దానికి సంకేతంగా పీఠంలో బిగించిన పిడికిళ్లను పొందుపరిచారు.పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచంలోనే సమున్నతంగా నిలబెట్టాలన్న లక్ష్యాన్ని గుర్తు చేస్తూ చేతులన్నీ కలిపి పీఠాన్ని మోస్తున్న తీరు తెలంగాణ పునర్నిర్మాణ రీతిని తెలియజేస్తుంది. తెలంగాణ తల్లి రూపకల్పనలో ఉపయోగించిన వర్ణాలకు కూడా ప్రత్యేకత ఉంది. గొప్ప తాత్వికత ఉంది. పీఠంలో, నీలి వర్ణం గోదావరి, కృష్ణమ్మలు తల్లీ నిన్ను తడపంగా... అన్న అందెశ్రీ గీతంలోని తెలంగాణ జలదృశ్యానికి ప్రతీకగా నిలుస్తుంది. ఆకుపచ్చ వర్ణం పచ్చని నేలలో పసిడి సిరులు పండంగా.. అన్న తెలంగాణ సస్యశ్యామల వ్యవసాయ కీర్తికి సంకేతంగా కనిపిస్తుంది. ఎరుపు వర్ణం మార్పుకు ప్రగతికి చైతన్యానికి ప్రతీక. బంగారు వర్ణం శుభానికి ఐశ్వర్యానికి సమృద్ధికి నిదర్శనంగా నిలబడుతుంది.

# తల్లిన మార్చిన మూర్ఖుడు ఎవడూ లేడు: కేటీఆర్

ప్రభుత్వాలు మారితే తలరాతలు మారాలి గానీ తల్లులు కాదన్నారు. తెలంగాణ తల్లిలో బతుకమ్మను మాయం చేయడం అంటే తెలంగాణ అస్తిత్వాన్ని మాయం చేయడమే అని అన్నారు.సమిష్టిగా సాధించిన తెలంగాణను పదేండ్లలో దేశంలోనే అగ్రపథాన నిలిపిన ఘనత కేసీఆర్‌దేనని కేటీఆర్ పేర్కొన్నారు. సీఎంగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేసిన రోజే కాంగ్రెస్ తల్లిని సకల మర్యాదలతో గాంధీభవన్'కు తరలిస్తామని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ చేసిన అపచారానికి ఖచ్చితంగా బదులు తీర్చుకుంటాం అని చెప్పారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ తల్లికి పాలాభిషేకాలు చేద్దాం అని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో తెలంగాణ ఆడబిడ్డలకు ప్రత్యేకమైన బతుకమ్మ కనపడొద్దని.. తెలంగాణను మాయం చేయాలనే కుట్ర కనిపిస్తుందని కేటీఆర్ అన్నారు. మేడ్చల్ జిల్లాలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఒకనాడు మహాకవి దాశరథి 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అన్నారు. దాంతో పాటు నా తెలంగాణ తల్లి కంజాతవల్లి అని 70 సంవత్సరాల కిందట దాశరథి గారు అన్నమాట. రావెళ్ల వెంకటరామారావు అనే కవి అద్భుతంగా చెప్పారు. 'వెలలేని నందనోద్యానమురా.. నా తల్లి తెలంగాణ' అని గొప్పగా తల్లి తెలంగాణ గురించి చెప్పారు. ఉద్యమం గురించి మీకు తెలుసు. ధూంధాంలు.. బతుకమ్మలు.. బోనాలు.. ఆటపాటలతో ఇదీ మన సంస్కృతి.. ఇది మనగొప్పదనం అని చెప్పుకున్నాం. ఆనాడు ఉద్యమంలో కేసీఆర్ నాయకత్వంలో కవులు, కళాకారులు, రచయితలు, సాహితీవేత్తలు.. ఎంతోమంది మహానుభావులు.. సాహితీవేత్తలు కలిసి తెలంగాణకు ఒక అస్థిత్వాన్ని, ఒక రూపాన్ని కల్పించారు. 2006లో ఆనాడు సమైక్యపాలకులు మనపై పగబట్టి.. వెంటాడి వేటాడుతుంటే.. ఆరోజు రోజు ప్రతిష్టించింది తెలంగాణ తల్లి' అన్నారు.

## బతుకమ్మ ఆడబిడ్డలకు గౌరవం

'బ్రహ్మాండంగా ఆ తల్లి ఎంత గొప్పగా ఆ రోజు ఎంతో గొప్పగా ఆలోచనతో రూపకల్పన చేయడం జరిగింది. తెలంగాణలోని ప్రతి ఆడబిడ్డ అలంపూర్ నుంచి ఆదిలాబాద్ దాకా, సూర్యాపేట నుంచి నారాయణఖేడ్ దాకా మొత్తంగా ఎక్కడికక్కడ దసరా పండగా వచ్చిందంటే.. దానికంటే ముందుండే సద్దుల బతుకమ్మ కోసం ఎదురుచూసే రోజులు తెలుసు. బతుకమ్మ తెలంగాణ ఆడబిడ్డలకు గౌరవం. ఆడబిడ్డలకు ప్రత్యేకమైన బతుకమ్మ పండుగను వారికి స్థానం కల్పిస్తూ.. తెలంగాణతల్లి విగ్రహంలో బతుకమ్మను ఏర్పాటు చేశారు. గద్వాల, పోచంపల్లి నేతన్నలు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధికెక్కారు. ఆ పట్టుచీరను ధరిస్తూ ఆ దేవతా మూర్తి మన గద్వాల, పోచంపల్లి నేతన్నల కళానైపుణ్యానికి ప్రతీకగా ధరించింది. కరీంనగర్ నుంచి వచ్చిన వెండి మట్టెలు.. మన ప్రాంతంలో పండే మెట్టపంటలకు నిదర్శనంగా జొన్న కంకులు. చూడంగానే దండంపెట్టేలానిపించేలా విధంగా బ్రహ్మాండంగా.. భరతమాత ముద్దుబిడ్డగా.. రాజమాతగా అందమైన కిరీటం. ఆ కిరీటంలో మన తెలంగాణ ప్రాంతానికి సంబంధించిన సుప్రసిద్ధ కోహినూర్ వజ్రాన్ని కూడా పెట్టి ఆ తల్లికి రూపం ఇచ్చింది మన తెలంగాణ ఉద్యమం. కానీ, ఇప్పుడున్న పాలకులు.. హంతకులే సంతాపం చెప్పినట్లు.. ఎవరైతే 1952 నుంచి 2014 దాకా తెలంగాణలో వందలవేల చావులకు కారణమయ్యారో.. తెలంగాణ ఉద్యమాన్ని అడుగడుగున కర్కషంగా తొక్కే ప్రయత్నం చేశారో.. వాళ్లు ఇవాళ ముందువరుసలో నిలబడి.. తెలంగాణ అంత గొప్పగా ఉండడానికి వీల్లేదు. బీదగా ఉండాలి. తెలుగుతల్లి గొప్పగా ఉన్నా పర్వాలేదు. భరతమాత నెత్తిన కిరీటం ఉన్నా పర్వాలేదు.. కన్నడమాత నెత్తిన కిరీటం ఉన్నా పర్వాలేదు. తమిళమత నిండా ఆభరణాలు వేసుకున్నా పర్వాలేదు.. తెలంగాణ తల్లి మాత్రం ఒక బీదరాలులా ఉండాలి.. రాష్ట్రం దివాళా తీసినట్లు కనబడాలని చెప్పి ఇవాళ ఉన్న దివాళాకోరు పాలకులు వాళ్ల భావదారిద్రానికి ప్రతీకగా తల్లి రూపం మార్చారు' అంటూ మండిపడ్డారు. 'ఈ మాట నేనంటే కొందరు తప్పు అనుకోవచ్చు. దయచేసి తప్పుగా అనుకోవద్దు. ఆవేశంతో ఉద్వేగంలో అంటున్నట మాటలు.. ప్రపంచంలో ఆలిని మార్చిన మగాళ్లు ఉండొచ్చు.. కానీ తల్లిని మార్చిన మూరు?లు ప్రపంచంలో ఎక్కడా లేరు. ఉండబోరు అనేమాట చెబుతున్న. ఇవాళ తెలంగాణ ఆ దౌర్భాగ్యపు పరిస్థితిని చూస్తున్నాం. కేవలం తెలంగాణ తల్లి విగ్రహం ఒక్కటే ఉన్నదా? ఉద్యమ సమయంలో ఊరూరా వేలకోద్దీ విగ్రహాలు.. ఏ ఊరికి వెళ్తే.. ఆ ఊరిలో బ్రహ్మాండంగా చందాలు వేసుకొని ఈమె మా తెలంగాణ తల్లి అని గౌరవించుకునేలా.. ప్రణమిల్లే విధంగా అద్భుతమైన ఆకృతి ఇచ్చి.. సాష్టాంగ నమస్కరాలు చేసి స్ఫూర్తి పొంది ఉద్యమంలో పాల్గొన్న వారు ఉన్నారు. ఈ ప్రభుత్వాన్ని ఒక్కటే అడుగుతున్న. తెలంగాణ తల్లి రూపు మార్చుమని మిమ్మల్ని. ఎవరికి ఉండే అభ్యంతరం ? ప్రభుత్వాలు మారినప్పుడల్లా తల్లులు మారాలా? ప్రభుత్వాలు మారితే తలరాతలు మారాలి తప్ప.. తల్లులు మారడం తప్పు తప్పు తప్పు అనేమాట నొక్కి చెబుతున్న. ప్రభుత్వం మారితే తెలుగు తల్లి మారిందా? కాంగ్రెస్ నుంచి బీజేపీ వస్తే భరతమాత మారిందా? నేను మా ఆడబిడ్డల తరఫున అడుగుతున్న. సిగ్గున్నదా మీకు అసలు. తెలంగాణ తల్లి చేతిలో తెలంగాణ ఆడబిడ్డలకు ప్రత్యేకమైన బతుకమ్మను మాయం చేస్తరా? ఒక వైపు బతుకు నాశనం చేస్తున్నరు. మరో వైపు బతుకమ్మను మాయం చేయడమంటే.. ఇది తెలంగాణ అస్థిత్వంపై జరుగుతున్న దాడికి పరాకాష్టగా చెప్పక తప్పదు. తెలంగాణ తల్లి అంటే కేవలం ఒక పార్టీకి.. ఒక వ్యక్తికి.. సంస్థకు సంబంధించింది కాదు. మొత్తం సమస్త తెలంగాణ జాతిని జాగృత పరిచిన తల్లి తెలంగాణ తల్లి. ఈ ప్రభుత్వం వ్యవహారం ఎలా ఉందంటే.. బతుకమ్మ చీరెలు వద్దు.. బతుకమ్మ పండుగకు ఏర్పాట్లు వద్దు.. అసలు బతుకమ్మనే కనపడొద్దు.. రానున్న రోజుల్లో.. తెలంగాణ కనబడవద్దు.. అవసరమైతే తెలంగాణను మాయం చేయాలనే కుట్ర కనబడుతున్నది' అంటూ ఆందోళన వ్యక్తం చేశారు.

# జీఓ 46పై రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు

రాష్ట్ర ప్రభుత్వం జీవో 46 బాధితుల పక్షాన నిలపడాలని కోరుతున్నాం. ప్రజా పాలన కాబట్టి పంతానికి పోకుండా తెలంగాణ గ్రామీణ విద్యార్థి, నిరుద్యోగ యువత పక్షాన నిలవాలి. బీఆర్ఎస్ పార్టీ, మాజీ మంత్రి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారు ఇచ్చిన మాట ప్రకారం జీవో 46 బాధితులకు అండగా ఈ భారత దేశ అత్యున్నత న్యాయ స్థానం తలుపులు తట్టడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు ఇస్తూ జీవో 46 బాధితుల పక్షాన సుప్రీం కోర్టు నిలవడం శుభపరిణామం. తల్లి ఎన్నడూ తన పిల్లలను ఏడ్పించదు. కాబట్టి, తల్లి పాత్రలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం మానవీయతతో ఆలోచించి తమ వైఖరి స్పష్టం చెయ్యాలి. వచ్చే నెల 27 జరిగే విచారణ లో కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 46 బాధితుల పక్షాన నిలిచి మీ ప్రభుత్వాన్ని గెలిపించినందుకు వాళ్ల రుణం తీర్చుకోవాలి. జీవో 46 వల్ల నష్టపోయిన విద్యార్థి నిరుద్యోగులు న్యాయం జరిగే వరకూ బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది. జీవో తెచ్చిన వాళ్ళే తీసెయ్యాలని పోరాడుతుంటే జీవో ను అడ్డుపెట్టుకొని లబ్ధి పొంది అధికార లోకి వచ్చిన కాంగ్రెస్ కు ఏ తెగులు పట్టుకుందో స్పష్టం చెయ్యాలి.

# కనిపించని...నామా నాగేశ్వరరావు

## – ఖేల్ ఖతం.. దుకాణం బంద్.

**ఖమ్మం :** ఆ జిల్లాను చూస్తుంటే.. ప్రతిపక్షనేతలు అస్త్ర సన్యాసం చేశారా అన్నట్లుగా పరిస్థితి మారిందట. గత ప్రభుత్వం హయాంలో ఓ వెలుగు వెలిగిన నేతలంతా.. ప్రస్తుతం సైలెంట్ మోడ్‌లో వెళ్లిపోవటంతో.. పార్టీ శ్రేణులు అయోమయంలో పడ్డారట. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలో కారు పార్టీ నేతలు మౌనం.. దేనికి సంకేతమేనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ మాట ఃఖీా నేతలకు అచ్చుగుద్దినట్లు సరిపోతుందంటే అతిశయోక్తి కాదేమో. గులాబీ అధినేత కేసీఆర్ సహా చాలా మంది నేతలూ ఎన్నికల ఫలితాలు తర్వాత జనంలోకి రావటం లేదట. చాలాకాలంగా కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితం కాగా.. ఇతరకీలక నేతలూ.. నియోజకవర్గాల్లో ఉండని పరిస్థితి నెలకొంది. నమ్ముకున్న నేతలు తమను దూరం పెడుతున్నారంటూ గులాబీ శ్రేణులు, కార్యకర్తలూ ఆందోళనలో ఉన్నట్లు టాక్ నడుస్తోంది.ఒకరిద్దరు ఃఖీా మాజీలు.. అప్పుడప్పుడు నియోజకవర్గాలకు వస్తున్నా.. తూతూమంత్రంగా వచ్చి వెళ్లిపోతున్నారనే వాదనలు ఉన్నాయి. ఆ విషయాన్ని సొంత పార్టీ నేతలే చర్చించుకుంటున్నారట. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పరిస్థితి అయితే మరీ దారుణం అంటున్నారు రాజకీయ నిపుణులు. పదేళ్లపాటు అధికారంలో ఉండగా ఓ వెలుగు వెలిగిన ప్రజాప్రతినిధులు.. అధికారం చేజారాక.. జిల్లా వైపు కనీసం చూడటం లేదని టాక్ నడుస్తోంది. మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు అయితే.. అసలు సొంత నియోజకవర్గంలో తిరిగిన సందర్భాలు లేవనేది స్థానికులు వాదనగా తెలుస్తోంది. తాము గెలిపించి ఆయన్ను పార్లమెంటుకు పంపించామని.. గెలుపు ఓటములు సహజం అని తెలిసినా.. నామా నాగేశ్వరరావు తమకు అందుబాటులో లేరంటూ కొందరు గులాబీబాస్‌కు కంప్లైంట్ చేసే పరిస్థితి వచ్చిందట.నామా నాగేశ్వరరావు పదవిలో ఉన్నా? లేకున్నా జిల్లాలో కనిపించేది తక్కువేనని ఖమ్మం వాసులే చర్చించుకుంటున్నారట. పార్టీ సముచిత స్థానం కల్పించినా.. జిల్లా ప్రజలను సమస్యలు పక్కన పెట్టి.. సొంత ప్రయోజనాలే లక్ష్యంగా ఆయన పనిచేస్తుంటారని.. సొంత పార్టీ నేతలే చర్చించుకుంటున్నారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసి.. ఆరు నెలలు కావొస్తున్నా.. పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో నామా పర్యటించిన దాఖలాలు లేవట. ఎప్పుడో ఒకసారి కొత్తగూడెం నియోజకవర్గంలో ఆయన పర్యటించారు తప్ప.. తమను పట్టించుకోవటం లేదనేది ఓటర్ల మాటగా తెలుస్తోంది. విపక్షంలో ఉన్నా.. తమ సమస్యలపై వినిపించాల్సిన వ్యక్తి.. కనీసం కంటికి కనిపించటం లేదనే వార్తలు గుప్పుమంటున్నాయిఖమ్మం పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాల్లోని సమస్యలపై నాడు గళమెత్తిన నేత.. ఇప్పుడు ఎందుకు సైలెంట్ అయ్యారన్నది కార్యకర్తల ప్రశ్నగా తెలుస్తోంది. కనీసం పార్టీ కార్యక్రమాలకు హాజరుకాలేనంత బిజీగా మారిపోయారా లేక మొహం చెల్లక సొంత ఇలాఖాలో ఉండలేకపోతున్నారా అనే చర్చ సాగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి కార్యక్రమాల్లో దూసుకుపోవటంతో పాటు గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలపై దృష్టి సారించింది. దీంతో నామా తనకు అవినీతి మరక అంటుకుంటుందనే భయంతోనే జిల్లాలో అడుగుపెట్టడం లేదనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎలాంటి తప్పూ చేయనప్పుడు ఆయన ఎందుకు భయపడుతున్నారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

ఎప్పుడు ఏ కేసు తనపై నమోదవుతుందనే భావనలోనే నామా తమకు దూరం అయ్యారని సొంత పార్టీలోని కొందరు చర్చించుకుంటున్నారట.మరోవైపు.. నామా నాగేశ్వరరావు కూడా పార్టీ మారతారనే వార్తలూ గుప్పుమంటున్నాయి. దీనికోసం అనుచరులతో మాజీ ఎంపీ చర్చలు జరిపినట్లు సమాచారం. మూడుసార్లు ఎంపీగా గెలిపొందినా.. నామా నాగేశ్వరరావు సొంత క్యాడర్‌ను కానీ.. అనుచరగణాన్ని గానీ సమకూర్చుకోలేకపోయారనే అపవాదు మూటగట్టుకున్నారు. అధికారం ఉన్నప్పుడే అడపాదడపా పర్యటనలు మినహా చేసిన అభివృద్ధి లేదనేది మరికొందరి మాటగా తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. గతంలో ఎమ్మెల్యేలకు తెలియకుండా నియోజకవర్గాల్లో తిరగవద్దని మాజీ సీఎం కేసీఆర్.. ఆనాడు ఆదేశించారట. కాబట్టి దీనికి లోబడే నామా ప్రవర్తిస్తున్నారనే వాదనలూ తెరపైకి వస్తున్నాయి.అంతకుముందు టీడీపీలో ఉన్న సమయంలో కానీ.. తర్వాత బీఆర్ఎస్ గూటికి చేరినప్పుడు కానీ.. నామాకు.. నా అనే వాళ్లు లేరనేది కార్యకర్తల్లో సాగుతున్న చర్చ. తనకంటూ ప్రత్యేక సైన్యాన్ని సమకూర్చుకోవటంలో ఆయన విఫలం అయ్యారనే పొలిటికల్ వర్గాల్లోనూ టాక్ నడుస్తోంది. ఈ ఘటనలు పరిశీలిస్తే.. నామా సొంత జిల్లాలో పర్యటిస్తే పట్టుమని పదిమంది కూడా రారని కాంగ్రెస్ ఆరోపణలకు మరింత బలం చేకూరినట్లు అవుతోందని పొలిటికల్ వర్గాల్లో టాక్.గత ఎన్నికల్లో గులాబీపార్టీ జిల్లాలో భారీగా ఓటమి చెందడానికి నామా నాగేశ్వరరావు ఒంటెద్దు పోకడలు కూడా కారణమనే వార్తలు గుప్పుమంటున్నాయి. అధికారంలో ఉండగా.. తమను పట్టించుకోని మాజీఎంపీకి వ్యతిరేకంగా.. ఓ వర్గం నేతలు పనిచేశారనే వాదనలూ ఉన్నాయి. కారు పార్టీ జెండాను కష్టపడి మోసిన తమకు.. నామా ఎప్పుడూ సహకరించలేదనే కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారట. జనంలోంచి వస్తున్న వార్తలతో మాజీ ఎంపీ మరింత సతమతం అవుతున్నట్లు సమాచారం. ఎన్నికల సమయంలో సామాజిక, ఆర్థికబలాన్ని ముందుకు తెస్తూ.. వాటినే ఆయన నమ్ముకున్నారు తప్ప..

ప్రత్యేక బలం లేదనేది కాంగ్రెస్ ఆరోపణ. మరోవైపు.. జిల్లాలోని గులాబీ నేతల మధ్య ఉన్న గ్రూపు రాజకీయాలు నామాకు కలిసిరావటం లేదనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.గతంలో ఎంపీగా గెలిచినా ఓ మాజీమంత్రి అనుమతి లేకుండా నామా పర్యటనలు చేసిన దాఖలాలు లేవనేది ఇతరపార్టీల ఆరోపణగా తెలుస్తోంది. అప్పట్లోనే నామా నాగేశ్వరరావు.. ఈ విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారని.. గులాబీ బాస్ కూడా ఆ విషయంలో ఏమీ చేయలేదనే వాదనలు ఉన్నాయి. మాజీమంత్రి పువ్వాడ అజయ్, జిల్లా పార్టీ అధ్యక్షుడు తాతా మధు మధ్య ఉన్న విభేదాలే.. నామా ఓటమికి కారణమనే వాదనలూ ఉన్నాయి. దీనివల్లే ఆనాడు కేసీఆర్.. నామాకు కొన్ని షరతులు విధించినట్లు తెలుస్తోంది. త్వరలో స్థానిక సంస్థలు జరగనున్న నేపథ్యంలో యాక్టివ్ కావాల్సిన గులాబీనేతలంతా ఇంకా సైలెంట్‌లో ఉండటంతో తమ భవిష్యత్ ఏంటనే యోచనలో కారుపార్టీ శ్రేణులు ఉన్నాయట. ఇకనైనా మాజీలంతా ఏకతాటిపైకి వచ్చి దిద్దుబాటు చర్యలు చేపట్టాలని.. లేకుండా వచ్చే ఎన్నికల్లో మరిన్ని చిక్కులు తప్పవని రాజకీయ వర్గాలూ హెచ్చరిస్తున్నట్లు తెలుస్తోంది.పదేళ్లుగా తమకున్న అధికారాన్ని అడ్డం పెట్టుకుని కొందరు నేతలు జిల్లాలో అరాచకాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. వారంతా యదేచ్ఛగా భూమాఫియా, కుంభకోణాలకు పాల్పడిన విషయాలను జనంలోకి తీసుకెళ్లటంతో కాంగ్రెస్ సక్సెస్ అయ్యింది. ఈ నేపథ్యంలో రేవంత్ సర్కార్.. తమపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందో తెలియకే చాలామందీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారనే పుకార్లు బలంగా వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే నామా నాగేశ్వరరావు కనిపించటం లేదనేది ఇతర పార్టీల నేతలు ఆరోపణగా తెలుస్తోంది. ఇదే కంటిన్యూ అయితే.. జిల్లాలో పార్టీ పరిస్థితి.. ఖేల్ ఖతం..దుకాణం బంద్ అన్నట్లుగా ఉంటుందనే వాదనలు తెరపైకి వస్తున్నాయి.

# బాలికతో అసభ్యంగా ప్రవర్తన

## – వ్యక్తిపై పోక్సో కేసు నమోదు




**విజయవాడ** బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన కుటుంబ సభ్యుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. సత్యనారాయణపురం పోలీసుల వివరాల మేరకు.. ఓ బాలిక ఇంటి వద్ద ఆడుకుంటుంది. వరుసకు బాబాయ్ కొడుకు అయిన కార్తీక్ అనే యువకుడు తన ఇంట్లోకి తీసుకెళ్లి బాలికపై అసభ్యంగా ప్రవర్తించాడని ఆ బాలిక తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళ్లింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# బాలికపై పేట్రోల్ దాడి : బాలిక మృతి..

**నంద్యాల** నంద్యాల జిల్లా నందికొట్కూరులో దారుణం చోటుచేసుకుంది. ప్రేమించలేదనే కారణంతో ఇంటర్ చదువుతున్న బాలికపై మైనర్ బాలుడు పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ ఘటనలో బాలిక మృతిచెందింది. ఘటనలో బాలుడికి మంటలు అంటుకోవడంతో గాయాలయ్యాయి. నందికొట్కూరులో బాలికపై పెట్రోల్ దాడి ఘటనపై హోంమంత్రి అనిత ఆగ్రహం వ్యక్తం చేసారు. .ప్రేమించలేదనే కారణంతో ఇంటర్ విద్యార్థినిపై బాలుడు పెట్రోల్ పోసి నిప్పటించిన ఘటనపై సమగ్ర విచారణ సత్వరమే జరపాలని ఆదేశించారు. పెట్రోల్ దాడి ఘటనలో బాలిక మృతి అత్యంత బాధాకరమని అన్నారు. నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాతో ఫోన్ లో మాట్లాడి ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## అదాని రేవంత్ దోస్తీపైన

# బీఆర్ఎస్ పార్టీ వినూత్న నిరసన

**హైదరాబాద్** అదాని, సీఎం రేవంత్ దోస్తీపై బీఆర్ఎస్ నేతలు వినూత్నంగా నిరసన తెలిపారు. ఆదాని రేవంత్ భాయి భాయి అంటూ టీ షర్టులతో గన్ పార్క్ నుంచి అసెంబ్లీకి బయలుదేరారు. ఢిల్లీలో అదానితో కుస్తీ గల్లీలో దోస్తీ అంటూ నినాదాలు చేసారు. రేవంత్ రెడ్డికి ఎంత చెప్పినా వినడం లేదు అని మాకు టి షర్టు ఇచ్చి అసెంబ్లీలో నిరసన తెలియజేయమన్నారటూ కేటీఆర్ చురకలు అంటించారు. తెలంగాణ తల్లి మాది కాంగ్రెస్ తల్లి నీది, బతకమ్మ తీసి చేయి గుర్తు పెట్టిందంటూ నినాదాలు చేసారు.

## మేడ్చెల్ జిల్లా మత్స్య కోపరేటివ్

# అధ్యక్షులు మన్నే రాజు హౌస్ అరెస్ట్




**మేడ్చల్** మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం లో అర్ధరాత్రి జిల్లా మత్స్య శాఖ కోపరేటివ్ అధ్యక్షులు మన్నే రాజు ను సూరారం పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. 32 జిల్లాలకు సోసైటీ చైర్మెన్ లను నియమించకుండా కాలయాపన చేస్తూ, తెలంగాణ వ్యాప్తంగా చెరువుల్లో 50% చేప పిల్లలను కుడా వదలకుండా మత్స్యకారులను మోసం చేస్తున్నారని అసెంబ్లీ ముట్టడికి అయన పిలుపునిచ్చారు. దాంతో పోలీసులు ముందస్తు హౌజ్ అరెస్ట్ చేసారు.

## చర్లపల్లి జైలుకు మాజీ ఎమ్మెల్యే

# పట్నం నరేందర్ రెడ్డి తరలింపు

**వికారాబాద్** లగచర్ల దాడి కేసులో ఏ1 నిందితుడుగా ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ని వికారాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో రెండు రోజుల విచారణ అనంతరం కోడంగల్ కోర్టుకు పోలీసులు తీసుకొచ్చారు. తరువాత చర్లపల్లి జైలుకు తరలించారు. తనని ఫాల్స్ కేసులో ఇరికించడమే కాకుండా ఫాల్స్ కస్టడీ కూడా తీసుకొని విచారించారని నరేందర్ రెడ్డి అంటున్నాడని ఆయన తరపు న్యాయవాది వెల్లడించారు.

# మండలంలో మల్లన్న బోనాల సందడి



**తాండూర్** తాండూర్ మండలం నగరం శివారులోని మల్లన్న గుట్ట వద్ద మల్లన్న బోనాలతో పండుగ వాతావరణం నెలకొంది.సంవత్సరానికి ఒకసారి వచ్చే డిసెంబర్ మాసంలో మల్లన్న బోనాలకు ఒక ప్రత్యేకత ఉంటుంది. ఆదివారం రోజున వివిధ ప్రాంతాల నుంచి చాలామంది ఈ ప్రాంతానికి చేరుకొని గుట్టపై ఉన్న మల్లన్న దేవాలయం వద్ద మొక్కులు చెల్లించుకుని గుట్ట కింద సాంప్రదాయ పద్ధతిలో బోనం పోసి ఈక్కడే వండుకొని కుటుంబ సభ్యులతో కలిసి అందరూ సహపంక్తి భోజనం చేసి వెళ్తుంటారు .సంవత్సరాని ఒక్కసారి వచ్చే ఈ పండుగ వేడుకలకు ఈ ప్రాంతంలో ఎంతో సంతోషంగా జరుపుకుంటారు .అటవీ ప్రాంతంలోని గుట్టపై ఉన్న మల్లన్న దేవున్ని చాలామంది భక్తులు దర్శించుకుంటారు. కానీ ఈ ప్రాంతంలో భక్తులకు ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో వారే తమఇంటి వద్ద నుంచి అన్ని రకాల వస్తువులను ఇక్కడకు తీసుకు వచ్చి వంటలు చేసుకొని వెళ్ళిపోతున్నారు. కనీసం త్రాగడానికి కూడా మంచి సౌకర్యం లేకపోవడం గుట్టపైకి కూడా వెళ్లడానికి సరైన దారి లేకపోవడంతో భక్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారు .ఇప్పటికైనా సంబంధిత అధికారులు కానీ ప్రజాప్రతిని కానిదృష్టి సారించి మల్లన్న గుట్ట వద్ద భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

# అలరించిన నేవీ బ్యాండ్ మ్యూజిక్

**విశాఖపట్నం** విశాఖ సాగరతీరంలో నేవీ బ్యాండ్ మ్యూజిక్ హోరెత్తింది.57వ సబ్ మెరైన్ దినోత్సవం సందర్భంగా నేవీ సిబ్బంది లైవ్ మ్యూజిక్ తో ప్రజలను అలరించారు.ఆకట్టుకునేలా నేవీ సిబ్బంది మ్యూజిక్ కు ప్రజలు మైమరిచిపోయారు.సాయంత్రం వెళ సాగరతీర అందాలను తిలకించేందుకు వచ్చే ప్రజలను నేవీ మ్యూజిక్ కట్టి పడేసింది.కెరటాలతో పోటీ పడుతూ నేవీ సిబ్బంది వాయిద్యాల నుంచి పుట్టుకొచ్చిన మ్యూజిక్ హైలేట్ గా నిలిచింది.ఈ మ్యూజిక్ ను నేవీ అదికారులు కూడా తిలకించారు.నేవీ సిబ్బంది మ్యూజిక్ కార్యక్రమంతో ఆర్కెబీచ్ వద్ద సందడి వాతావరణం నెలకొంది.

# రుషికొండ ప్యాలస్‌ను మ్యూజియంగా మార్చాలి

**విశాఖపట్నం** వందల కోట్ల ప్రజాధనం తో గత ప్రభుత్వ హయాంలో నిర్మిం చిన రుషికొండ ప్యాలెస్ భవనాల ను సద్వినియోగపరిచే చర్యలను కూటమి ప్రభుత్వం చేపట్టాలని విశాఖలో బుద్దిస్ట్ మాన్యుమెంట్స్ ప్రొటెక్షన్ కమిటీ కోరింది.ఈమేరకు విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మె ల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ ను కలిసి సభ్యులు వినతి పత్రాన్ని అందిం చారు.అనంతరం సభ్యులు వెంకట రమణ మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేకంగా మ్యూజియం లేదని, ఈ భవనాన్ని మ్యూజియంగా ఏర్పాటు చేయాలనీ కోరారు.

## 7వరోజు గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

# “మీకోసం మీ వేనిగండ్ల”ఉదయపు పర్యటన




**గుడివాడ** గుడివాడ పట్టణంలో పారిశుద్ధ్య మెరుగుకు ప్రతి ఒక్కరు తమ సహకారం అందించాలని, రోడ్లు వెంబడి దుకాణదారులు, చిరు వ్యాపారులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని...నిర్లక్ష్యం వహించే వారికి జరిమానాలు తప్పవని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హెచ్చరించారు. గుడివాడ పట్టణంలో పారిశుధ్య మెరుగుకు... ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నిర్వహిస్తున్న “మీకోసం మీ వెనిగండ్ల” ఉదయపు పర్యటనలు 7వ రోజుకు చేరుకున్నాయి. సోమవారం ఉదయం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనంపై పర్యటించిన ఎమ్మెల్యే రాము.. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలపై ఎక్కడికక్కడ రోడ్ల వెంబడి చిరు వ్యాపారులు, స్థానిక ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడారు.ప్రధాన రహదారులు వెంబడి పలు దుకాణాల వద్ద అపరిశుభ్ర వాతావరణం ఉండడంతో.. సంబంధిత దుకాణదారులు, చిరు వ్యాపారులను ఎమ్మెల్యే రాము సున్నితంగా హెచ్చరించారు.మన పరిసరాలను మనం పరిశుభ్రంగా ఉంచుకుంటేనే పారిశుధ్య మెరుగుకు.. పురపాలక సంఘం చేస్తున్న కృషికి ఫలితం ఉంటుందని వ్యాపారులస్తులతో ఎమ్మెల్యే రాము అన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మీడియాతో మాట్లాడుతూ గుడివాడ పట్టణ అభివృద్ధి, పారిశుధ్య మెరుగు కోసం ఉదయపు పర్యటనలు నిర్వహిస్తున్నానని పేర్కొన్నారు. కొందరి నిర్లక్ష్యం వల్ల ఎంత కష్టపడిన ప్రయోజనం లేకుండా పోతుందన్నారు. ఇక ఉపేక్షించేది లేదని పారిశుధ్య సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై జరిమానాలు విధిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము హెచ్చరించారు.ఎమ్మెల్యే రాము పర్యటనలో టిడిపి నాయకులు చేకూరు జగన్ మోహన్ రావు, ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్‌కు

# కోర్టులో చెక్కెదురు

**హైదరాబాద్** పౌర సత్వంపై వేములవాడ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ కు హై కోర్టులో చుక్కెదురయింది. కోర్టును తప్పు దోవ పట్టించినందుకు ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టుకు పేక్ డాక్యుమెంట్స్ సమర్పించారని మండిపడింది. రమేష్ కు 30 లక్షల జరిమానా విధించింది. పిటీషనర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు 25 లక్షలు చెల్లించాలి. మిగిలిన 5 లక్షలు లీగల్ సర్వీ సెస్ అథారిటీ కి చెల్లించాలనిఆదేశించింది.నెల రోజుల్లో చెల్లింపులు చేయాలని ఆదేశించింది.

# ప్రజా సమస్యలపై వైకాపా పోరాటాలు

**విశాఖపట్నం** తాజాగా ప్రభుత్వం నిర్వ హించిన మెగా పేరెంట్ టీచర్ మీ టింగ్ను ఉద్దేశిస్తూ ఎమ్మెల్సీ బొత్స సత్యానారాయణ పలు వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. వైసీపీ హయాంలో నాడు- నేడు కార్యక్రమంలో చేపట్టిన అభివృద్ధి పనులు పేరెంట్ టీచర్స్ మీటింగ్లో కనిపించాయంటూ కామెంట్స్ చేశారు. విశాఖలో డ్రగ్స్ వ్యవహా రంపై తాను మళ్ళీ కేంద్రానికి లేఖ రాస్తున్నట్లు తెలిపారు.డ్రగ్స్కు సంబంధించి విష ప్రచారం చేసి ఎన్నికల్లో లబ్ధి పొందారని విరుచు కుపడ్డారు. ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజా ప్రతినిధులు పార్టీల నాయకు లతో సమావేశం నిర్వహించామని తెలిపారు. ప్రజల సమస్యలపై పోరా టం చేయాలని పార్టీ నిర్ణయించిందన్నారు. వర్షాల నేపథ్యంలో రైతాంగం ఇబ్బందులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల13 వ తేదీన అన్ని కలక్టరేట్లో వినతిపత్రలు అందజేస్తామన్నారు. ఈనెల 27వ తేదీన విద్యత్ చార్జీలు పెంపుపై విద్యుత్ కార్యాలయాలలో వినతిపత్రలు అందజేయనున్నట్లు వెల్లడించారు. విద్యుత్ భారాలను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు.

# చెట్ల పొదల్లోకి దూసుకుపోయిన బస్సు

## – ప్రయాణికులు సురక్షితం

**నల్గొండ** నల్గొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుండి విజయవాడకు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు అదుపుతప్పి డివైడర్ ను ఢీ కొట్టి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ కు తీవ్రగాయాలు,, ప్రయాణికులకు స్వల్ప గాయాలు అయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 42 మంది ప్రయాణిస్తున్నాట్లు సమాచారం. ఘటనలో బస్సు స్వల్ప ప్రమాదం నుండి బయటపడడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

# కంట తడి పెట్టిన ఉషా దాసరి

**మేడ్చల్** బీఆర్ఎస్ నాయకురాలు ఉషా దాసరి కంట తడిపెట్టారు. తన తండ్రి దాసరి హనుమయ్య పై తన అనుచరులతో కలిసి ఆర్కే పురం బీజేపీ కార్పొరేటర్ ధీరజ్ రెడ్డి హత్యాయత్నం చేసాడని ఆరోపించారు. తనకు ఇవ్వాల్సిన డబ్బులు ఇస్తానని బీజేపీ ఆఫీసుకు పిలిపించుకొని రక్తం వచ్చేలా కొట్టాడని అన్నారు. దాంతో దాసరి హనుమయ్య ధీరజ్ రెడ్డి కాళ్లపై పడి చంపవద్దని ప్రాధేయపడ్డడని అన్నారు. డబ్బులు అడిగితే చంపుతానని ధీరజ్ రెడ్డి బెదిరించి వదిలివేసాడని అన్నారు. దాడిని ఖండిస్తూ.. తన తండ్రి పరిస్థితి చూసి బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష కంటతడిపెట్టుకున్నారు.

# ఆశా వర్కర్ల అందోళన..అరెస్టు

**హైదరాబాద్** హైదరాబాద్లోని కోఠిలోని డీఎంఈ కార్యాలయం గేటు ముందు ఆశావర్కర్లు ఆందోళన చేపట్టారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం 18వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆశావర్కర్లు పెద్ద ఎత్తున రోడ్డుపై బైటాయించారు. దీంతో డీఎంఈ ఆఫీస్ వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. రంగంలోకి దిగిన పోలీసులు, ఆశాలకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కార్యాలయం లోనికి తోసుకొని వెళ్లేందుకు ఆశాలు యత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. పరిస్థితి విషమించడంతో పోలీసులు వారిని బలవంతంగా అరెస్ట్ చేశారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

ఆశాలకు లెప్రెసీ, పల్స్ పోలియో పెండింగ్ డబ్బులు చెల్లించిన తర్వాతనే కొత్త సర్వేలు చేయించాలని ఆశలు కోరారు. వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ కార్యాలయం ముందు అనేక సార్లు నిరసన చేపట్టినా పట్టించుకోవడం లేదని ఆశలు ఆరోపించారు. డిసెంబర్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో లేప్రసి సర్వే చేయాలని ఆశాలకు జిల్లా అధికారులు చెప్తున్నారని వెంటనే లెప్రసీ సర్వే కోసం ట్రైనింగ్ కూడా ప్రారంభించారని తెలిపారు. ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు.

## మహిళ వసతి గృహాన్ని

# ప్రారంభించిన మంత్రి జూపల్లి

**వనపర్తి** వనపర్తి పట్టణంలోని మెడికల్ కాలేజీ సమీపంలో నూతనంగా నిర్మించిన ఉమెన్స్ వసతి గృహాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పార్లమెంటు సభ్యుడు డాక్టర్ మల్లు రవి , వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి , డిసిసిబి ః చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి , జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి తదితరులు హాజరయ్యారు.మున్సిపల్ చైర్మన్ పుట్టపాక మహేష్ మరియు వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య మున్సిపల్ కౌన్సిలర్స్ బి వెంకటేశ్వర్లు విభూతి నారాయణ మున్సిపల్ కౌన్సిలర్స్ బ్రహ్మం చారి నక్క రాములు జంపన్న వినోద్ భువనేశ్వరి శ్యామ్ సత్యమ్మ శరవంద సుమిత్ర యాదగిరి జయసుధ మధు గౌడ్ జంపన్న చంద్రకళ ఎల్ఐసి కృష్ణ భాష నాయక్ వనపర్తి నియోజకవర్గం సమన్వయకర్త లక్కాకుల సతీష్ గోపాల్పేట్ మండల్ ఇన్చార్జి సత్య శిలా రెడ్డి తిరుపతిరెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆదిత్య కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇంకెన్నాళ్లు...

## - బీజేపీకి కొత్త రథసారధి కోసం నిరీక్షణ

## - యువమోర్చా, మహిళా మోర్చా నేతల్లో ఆందోళన

**హైదరాబాద్ :** తెలంగాణ బీజేపీలో నేతల తీరు చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఆ పార్టీ అధ్యక్షుడిగా ఉన్న కిషన్‌రెడ్డి.. ఓ వైపు కేంద్రమంత్రిగా.. ఇంకోవైపు పార్టీ రథసారధిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మొన్నటి వరకూ కశ్మీర్ ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించి.. బిజీబిజీగా గడిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణలోని పార్టీ నేతలపై ఆయన సరైన ఫోకస్ పెట్టడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయట. దీంతో? ఇటు క్యాడర్‌తో పాటు.. అటు.. లీడర్స్ కూడా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని లైట్ తీసుకొంటున్నారనే చర్చ జోరుగా సాగుతోంది. అందుకే రాష్ట్ర నాయకత్వ నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలు.. ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు డుమ్మా కొడుతున్నారనే వార్తలు గుప్పుమంటున్నాయి.అధ్యక్షుడిగా కిషన్ రెడ్డి నేతృత్వంలో కొన్ని కార్యక్రమాలు నిర్వహించినా.. అందులో పాల్గొనే వారి సంఖ్య తక్కువగా ఉండటం కమలనాథుల్లో ఆందోళన కలిగిస్తోందట. కేసీఆర్ పాలన వైఫల్యాలను ఎండగడుతూనే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల వైఫల్యాలపై పోరాటాలు చేస్తున్నా.. కిషన్ వెంట వచ్చేవారు నానాటికీ తక్కువ అవుతున్నారనే వార్తలు గుప్పుమంటున్నాయి. హైడ్రా, మూసీ ప్రక్షాళనతోపాటు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత వంటి అంశాలపై కీలక సమావేశాల్లో పార్టీ నేతలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా పార్టీ అధ్యక్షులు డుమ్మా కొడుతున్న తీరు.. కమలం పార్టీ చర్చనీయాంశంగా మారిందట.అధ్యక్షుడు కిషన్ రెడ్డికి మరో గౌరవం కూడా ఉందట. తప్పు చేసిన నేతలను ఆయన కనీసం మందలించే స్వభావి కాదనే పొగడ్తలూ ఉన్నాయి. కానీ.. గ్రౌండ్‌లెవల్‌లో మాత్రం.. చేసేవి చేస్తుంటారనే విమర్శలూ ఉన్నాయి. పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలనే క్రమశిక్షణ కమిటీ నివేదికలనూ అందరి ముందు పక్కన పెట్టేస్తారట. కానీ.. చేసేవి తెలియకుండా చేసేస్తారనే టాక్ ఉంది. అలా అని.. పని చేసిన కార్యకర్తలను ప్రశంసించి వెన్నుతట్టి ప్రోత్సహించిన సందర్భాలు కూడా తక్కువేనని చర్చ.. కింది స్థాయి క్యాడర్‌లో ఉందట. తెలంగాణ బీజేపీ సారథిగా కిషన్ రెడ్డి.. నేతలను, క్యాడర్‌ను సర్దిచెప్పి పనిచేయించుకుని వదిలించుకుంటారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. దూకుడుగా ముందుకు వెళ్తున్న యువమోర్చా, మహిళా మోర్చా నేతలను సైతం తన అనుమతి లేకుండా ఎలాంటి కార్యక్రమాలు చేయవద్దని సూచించినట్టుగా పార్టీలోనే చర్చ సాగుతోంది. దీంతో అధ్యక్షుడి తీరుపై కొందరు బహిరంగంగానే చర్చించుకుంటున్నారనే టాక్ నడుస్తోంది.ముఖ్యంగా కిషన్‌రెడ్డి వ్యవహారంలో యువనేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజల్లో పేరు తెచ్చుకోవాలంటూ వివిధ కార్యక్రమాలు, పార్టీ తరపున పోరాటం చేయాల్సిన సమయంలో తమను ఎదగనివ్వటం లేదనే కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారట. మొన్నటి వరకూ తెలంగాణలో బలంగా ఉన్న పార్టీ.. వీక్ కావడానికి ఇలాంటి నిర్ణయాలే కారణమనే వాదనలూ వినిపిస్తున్నాయి. దక్షిణాదిలో తెలంగాణపై కేంద్ర నాయకత్వం దృష్టి సారించినా.. జనంలోకి వెళ్లే అవకాశం రావటం లేదని కొందరు భావిస్తున్నారట. ఈ నేపథ్యంలో పార్టీ క్యాడర్‌ను ఉత్సాహపరిచేందుకు ప్రధాని మోడీ కూడా రంగంలోకి దిగారు. తెలంగాణలోని కీలక నేతలతో సమావేశమై.. దిశానిర్దేశం చేశారు. ఇక్కడ వరకూ బాగానే ఉన్నా.. టీబీజేపీ చీఫ్ సరైన గౌడైన్స్ ఇవ్వటం లేదని కొందరు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారట.లోకల్ బాడీ ఎన్నికల్లో సత్తా చాటాలని.. క్యాడర్‌లో జోష్ ఉన్నా, అందుకు రాష్ట్ర నాయకత్వ తీరు నిరుత్సాహ పరుస్తోందని కొందరు ఆరోపిస్తున్నారట. గతంలో బండి సంజయ్‌ను అధ్యక్ష పదవి నుంచి ఉన్న ఫలంగా తప్పించి కిషన్ రెడ్డికి బాధ్యతలు అప్పగించడంపైనా సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. అందులో భాగంగానే రాష్ట్ర బీజేపీకి కొత్త బాస్ రాబోతున్న తరుణంలో.. కిషన్‌రెడ్డిని, ఆయన లీడర్ షిప్‌ను పార్టీ నేతలతో పాటు, క్యాడర్ కూడా లైట్ తీసుకుంటుందనే చర్చ జరుగుతోంది.

మరికొన్ని రోజుల్లో రాష్ట్ర బీజేపీకి కొత్త రథసారథి రానున్నారు. ఇప్పటికే సంస్థాగత ఎన్నికల ప్రక్రియా మొదలైంది. వచ్చే నెలాఖరు లేదా కొత్త సంవత్సరం మొదటి వారానికి కొత్త అధ్యక్షుడు ఎవరనే స్పష్టత రానుంది. అతికొద్ది సమయంలో కిషన్ రెడ్డి నేతల పట్ల కఠినంగా వ్యవహరించి.. పార్టీని గాడిలో పెడతారా.. క్రమశిక్షణ కమిటీ సిఫార్సులను అమలు చేస్తారా..? పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు ఇచ్చి తన మార్క్ చూపించుకుంటారా లేదా అనే అంశం ఉత్కంఠగా మారింది. లేకుంటే మౌనంగానే ఉండి.. కొత్త అధ్యక్షుడికి మరింత బాధ్యతలు అప్పగిస్తారా అనేది రాష్ట్రరాజకీయల్లో ఆసక్తిగా మారింది.తెలంగాణ పరివార్ క్యాడర్ అంతా.. త్వరలోనే వచ్చే కొత్తసారథిపైనే ఆశలు పెంచుకుంటుందట. పార్టీని ఉరకలు పెట్టించే సారథి కోసం బీజేపీ హైకమాండ్ అన్వేషణ కొనసాగిస్తోందట. పార్లమెంట్ సమావేశాలు ముగిసిన వెంటనే అధ్యక్షుడి ఎన్నికకు సందిగ్ధతకు తెర దించుతూ.. కొత్త కమలఅధిపతిని ప్రకటించే ఛాన్స్ ఉందనే చర్చ సాగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటి.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలని భావిస్తున్న పరివార్ పార్టీ లక్ష్యాలు.. ఏ మేరకు నెరవేరతాయో చూడాలి. దీంతో పాటు కొత్త బాధ్యతలు తీసుకునే వ్యక్తికి ఇద్దరు కేంద్రమంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, క్యాడర్.. ఏ మేరకు సహకరిస్తారో చూడాలి.

# జగిత్యాలలో కల్తీ పాల కలకలం

**కరీంనగర్ :** జగిత్యాల జిల్లాలో కల్తీ ఆహార పదార్థాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇటీవల ఓ హోటల్ లో ఇడ్లీ లో జెర్రిరాగ తాజాగా కల్తీ పాలు వెలుగులోకి వచ్చింది. జగిత్యాల బృందావనం కాలనీలో కర్బూజ లావణ్య కుటుంబ సభ్యులు అనారోగ్యం పాలు కావడంతో ఏ డాక్టర్ వద్దకు వెళ్ళిన నయం కాలేదు. వాడే పాల వల్ల అలా అవుతుందని అనుమానించారు.అందుకు అనుగుణంగా పాలు డెటాల్ వాసన రావడంతోపాటు పాల అడుగుబాగంలో పిండిలా ఉండడంతో పాలు పోసే మేడిపల్లి మండలం వెంకట్రావుపేట్ కు చెందిన మైదం మల్లయ్య ను నిలదీశారు. పాలు పగిలిపోకుండా ఉండేందుకు బేగింగ్ సోడా కలిపానని స్పష్టం చేశాడు. వెంటనే స్థానికులు ఆయన పోసే పాలను టెస్ట్ చేయడంతో పది శాతం పాలు కూడా లేవని తేలింది. మల్లయ్యను పట్టుకుని పోలీసులకు అప్పగించగా పాలను మున్సిపల్ అధికారులు సీజ్ చేసి ఫుడ్ సేఫ్టీ అధికారులకు పిర్యాదు చేశారుస్థానికుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఫుడ్ ఇన్స్పెక్టర్ అనూష తనిఖీలు చేపట్టారు. వెంకట్రావు మల్లయ్య స్వగ్రామం వెంకట్రావుపేటకు వెళ్లి ఆయన పాలు సేకరించే వారిని విచారించి పాలల్లో కలిపే పదార్థాలను పరిశీలించారు. ఇంటి వద్ద ఎలాంటి ఆనవాళ్లు లభించలేకపోయినప్పటికీ పాలు తీసుకొచ్చేటప్పుడు పాలు పగిలిపోకుండా ఉండేందుకు బేకింగ్ సోడా కలుపుతున్నట్టు విచారణలో తేలిందని అనూష తెలిపారు.పాల శాంపిల్ సేకరించి ల్యాబ్ పంపించి మల్లయ్య పై కేసు నమోదు చేశామని స్పష్టం చేశారు.

మల్లయ్య తో పాటు ఆ గ్రామం నుంచి పాలు సేకరించి పట్టణానికి తీసుకువచ్చే పలువురి పాలను కూడా పరీక్షించామని అందులో ఎలాంటి కల్తి అవశేషాలు లేవని స్పష్టం చేశారు.ప్రస్తుతం పాలల్లో బేకింగ్ సోడా కలిపినట్లు వెలుగులోకి వచ్చిన మల్లయ్య ఉదాంతాన్ని పరిశీలిస్తే పాల కంటే నీళ్లే అమ్ముతున్నట్లు వెలుగులోకి వచ్చింది. మల్లయ్యకు రెండు బర్రెలు ఉండగా అవి ఇచ్చే పాలతో పాటు గ్రామంలో పలువురి వద్ద పది లీటర్ల వరకు పాలు సేకరించి 40 లీటర్ల పాలు తయారుచేసి జగిత్యాల పట్టణంలో విక్రయిస్తాడు. ఆ పాలల్లో అసలు పాలకంటే నీళ్లు ఎక్కువ ఉన్నట్లు పరీక్షల్లో తేలింది. మల్లయ్య సైతం నిర్భయంగా తన తప్పును ఒప్పుకున్నాడు.తనకున్న రెండు గేదలు ఇచ్చే పాలతో పాటు పది లీటర్ల వరకు ప్యాకెట్ పాలు ఇతరుల నుండి సేకరించిన పాలు కలిపి మొత్తం 40 లీటర్ల వరకు తయారు చేసి జగిత్యాలలో అమ్ముతున్నట్టు తెలిపారు. బేకింగ్ సోడా నీళ్లు తప్ప కల్తీ ఏమి లేదని మల్లయ్య అమాయకంగా తన పని తనాన్ని చెప్పుకొచ్చారు.అధికారుల నిర్లక్ష్యం వల్లే కలిపి దందా సాగుతుందని సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఏదైనా సంఘటన జరిగినప్పుడే హడావిడి చేసే అధికారులు ఆ తర్వాత పట్టించుకోకపోవడం వల్లే కల్తీ రాయుళ్ళు రెచ్చిపోతున్నారని జనం ఆరోపిస్తున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకునేలా వ్యవహరించే అధికారులు అనునిత్యం తనిఖీలు నిర్వహిస్తే కల్తీ జరగదని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని కల్తీలపై తనిఖీలతో కొరఢా ఝుళిపించాలని జనం కోరుతున్నారు.

# బీఆర్ఎస్ పార్టీకి మాట్లాడే నైతికత లేదు

## - అసెంబ్లీ లాబీలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి చిట్ చాట్

**హైదరాబాద్** తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ పుట్టినరోజున అసెంబ్లీ కి వచ్చి ఆమెకు కృతజ్ఞత లు తెలపరా అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ప్రశ్నించారు. తెలంగాణ ఇచ్చాక 14 మంది కుటుంబం తో వెళ్లి కాళ్ళు మొక్కి గ్రూప్ ఫోటో దిగినవ్. అసెంబ్లీ లో తెలంగాణ ఇచ్చిన దేవత అని, సోనియాగాంధీ లేకపోతే తెలంగాణ రాదు అని అన్న కేసీఆర్ ఈరోజు అసెంబ్లీ కి ఎందుకు రాలేదు. బీఆర్ఎస్ పార్టీకి మాట్లాడే నైతికత లేదు. మేము ఇప్పటికి టిపీపీపీ అని చెప్పుకుంటాము. నువ్ నీ పార్టీ లో "టి" తీసేసి బీఆరెస్ అని పెట్టుకున్నావ్. నిజామాబాద్ జిల్లా కు వెళ్ళినపుడు రివ్యూ కి ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే రాలేదు. మా పార్టీ ఆర్మూర్ ఇంచార్జి వచ్చి రోడ్డు సమస్య ఉంది అని చెప్పారు. అందులో ఎం తప్పు ఉంది. నా కొడుకు మృతి ఎంత బాధ పడ్డానో బ్రాహ్మణ వెళ్ళాం ప్రాజెక్టు పూర్తి చేయాలని అంత బాధ పడ్డానని అన్నారు.


# గ్రూప్ 2 పరీక్షకు అంతా సిద్ధం

**హైదరాబాద్ :** తెలంగాణ గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు టీజీపీఎస్సీ సర్వం సిద్ధం చేస్తుంది. ఈ నెల 15, 16 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 1368 కేంద్రాల్లో గ్రూప్-2 పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు టీజీపీఎస్సీ ప్రకటన విడుదల చేసింది. గ్రూప్-2 హాల్ టికెట్లను టీజీపీఎస్సీ వెబ్ సైట్ లో అందుబాటులో ఉంచుతామని ప్రకటించింది. అభ్యర్థులు డౌన్ లోడ్ చేసుకోవచ్చని తెలిపింది. ఈ నెల 15, 16 తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లతో గ్రూప్-2 పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఉదయం సెషన్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులను 8.30 నుంచి 9.30 గంటల వరకు మాత్రమే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. మధ్యాహ్నం పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను 1.30 నుంచి 2.30 గంటల వరకు మాత్రమే అనుమతించనున్నారు. ఈ సమయం దాటిపోయిన తర్వాత వచ్చిన వారికి పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉండదని టీజీపీఎస్సీ ప్రకటించింది.టీజీపీఎస్సీ గ్రూప్-2లో మొత్తం నాలుగు పేపర్లు ఉంటాయి. టీజీపీఎస్సీ షెడ్యూల్ ప్రకారం... పేపర్-1 డిసెంబరు 15వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 ఉంటుంది. ఇక డిసెంబరు 16వ తేదీన పేపర్3, 4 పరీక్షలు నిర్వహించనున్నారు. గ్రూప్-2 ప్రతి పేపరులో 150 ప్రశ్నలు 150 మార్కులకు నిర్వహించనున్నారు. డిసెంబర్ 9వ తేదీ నుంచి అభ్యర్థులు హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవచ్చు. హాల్టికెట్లు డౌన్లోడ్ సమయంలో ఏవైనా సాంకేతిక ఇబ్బందులు వస్తే 040-23542185 లేదా 040-23542187 నంబర్లకు సంప్రదించాలని టీజీపీఎస్సీ తెలిపింది. లేదా ఊవశ్రీజూటవబఎఏబిబజూబఞ.ణనీల.తిని ఈ-మెయిల్ సందేహాలు పంపవచ్చని పేర్కొంది.

# నోబెల్ బహుమతి వ్యవస్థాపకుడు, స్వీడిష్ రసాయన శాస్త్రవేత్త ఆల్‌ఫ్రెడ్ నోబెల్

## - నేడుఆయన వర్ధంతి


## - నోబెల్ పురస్కారం ఈయన పేరుమీదన స్థాపించబడింది




ఆల్‌ఫ్రెడ్ బెర్నార్డ్ స్వీడిష్ రసాయన శాస్త్రవేత్త, ఇంజనీరు, ఆవిష్కారకుడు, మిలిటరీ ఆయుధాల తయారీదారు, డైనమైట్ ఆవిష్కారకుడు. ఒక పాత ఇనుము, స్టీల్ మిల్లును తీసుకొని బొఫోర్స్ అనే మిలిటరీ ఆయుధాలను తయారు చేసే కంపెనీ స్థాపించాడు. ఈయన ఆఖరి వీలునామాలో నోబెల్ బహుమతి స్థాపన కొరకు చాలా పెద్ద మొత్తంలో ధనాన్ని కూడగట్టాడు. కృత్రిమ మూలకము నోబెలియం ఇతని పేరు మీదుగా నామకరణం చేసారు. ఆల్‌ఫ్రెడ్ నోబెల్ మూడవ సంతానం. ఈయన స్వీడన్ దేశంలోని స్టాక్‌హోంలో అక్టోబర్ 21 1833లో జన్మించాడు.ల్ఫ్రెడ్ తండ్రి ఇమాన్యుయెల్ ఇంజనీరు. తరువాత ఇతని కుటుంబంతో 1842లో సెయింట్ పీటర్స్‌బర్గ్ చేరుకున్నాడు.ల్ఫ్రెడ్ రసాయన శాస్త్ర అధ్యయనం ప్రొఫెసర్ నికోలాయ్ నికోలవిచ్ జినిన్ వద్ద ప్రారంభించాడు. నేడు భౌతిక, రసాయన, వైద్య, శాంతి విభాగం శాస్త్రాలలోనే కాకుండా... సాహిత్యం, శాంతి రంగాల్లో విశేష కృషి చేసిన వారికి అందిస్తున్న ప్రపంచ ప్రఖ్యాత నోబెల్ పురస్కారం ఈయన పేరుమీదన స్థాపించబడింది. డిసెంబర్ 10, 1896, సన్రీమో, ఇటలీలో మరణించారు. ఆల్‌ఫ్రెడ్ నోబెల్ 1895 నాటి వీలునామా ప్రకారం 1901లో ఈ పురస్కారం ప్రారంభించబడింది (నోబెల్ మరణించిన 5 సంవత్సరాల తరువాత). ఆల్‌ఫ్రెడ్ నోబెల్ గౌరవార్ధం ఆర్థిక బహుమతి మటుకు 1969 నుండి బ్యాంక్ ఆఫ్ స్వీడన్ ద్వారా ఇవ్వడం జరుగుతోంది. నోబెల్ శాంతి బహుమతి ను మాత్రము నార్వే రాజదానీ ఓస్లో లో ప్రదానం చెస్తారు ఈ ఆరు బహుమతులు అత్యధిక పారితోషికంతో పాటు పేరు ప్రఖ్యాతలకు నిదర్శనం. ప్రతీ సంవత్సరం, ఒక్క శాంతి బహుమానం తప్ప మిగతా ఐదు బహుమతులు నోబెల్ వర్ధంతి అయిన డిసెంబరు 10 నాడు, స్టాక్‌హోంలో ఇవ్వబడతాయి. వివిధ రంగాలలో విశేషమైన కృషి, పరిశోధనలు చేసిన, విప్లవాత్మక విధానాలు, పరికరాలతో శాస్త్రాన్ని ముందంజ వేయించిన, మానవ సమాజానికి ఆ శాస్త్రంతో అత్యంత సహాయాన్ని అందించిన వ్యక్తులకు, సంస్థలకు శాంతి బహుమతి మాత్రమే ఇవ్వబడుతుంది.

## ఈరోజు అంతర్జాతీయ

# మానవ హక్కుల దినోత్సవం




ప్రతి మనిషి మనిషిగా జీవించడానికి కొన్ని హక్కులు ఉండాలి. ఇందులో జాతి, భాష, కుల, మతాలకతీతంగా మనిషిగా జీవించే హక్కు కలిగి ఉండడమే ప్రధాన ఉద్దేశ్యం.అలాంటి మానవ హక్కుల దినాన్ని 10 డిసెంబర్ 1948న ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. అప్పటినుండి ప్రతిసంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా డిసెంబరు 10వ తేదీ ని అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవంగా జరుపుకుంటున్నారు. వివక్షత లేనటువంటి మానవ సమాజ నిర్మాణమే ఈ అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవ లక్ష్యం.అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం డిసెంబరు 10న ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏట నిర్వహిస్తారు. ఐదేళ్ళకోసారి అమెరికా సంయుక్త రాష్ట్రాలు మానవ హక్కులకు సంబంధించినవారికి ఇచ్చే పురస్కారం, అలేగా అత్యున్నత నోబెల్ బహుమతి అందుకున్నవారిని ఈరోజున సత్కరిస్తారు.1948, డిసెంబరు 10న ఐక్యరాజ్య సమితి విశ్వమానవ హక్కుల ప్రకటన చేసింది. అందువల్ల డిసెంబర్ 10వ తేదీని అంతర్జాతీయ మానవహక్కుల దినంగా ప్రపంచవ్యాప్తంగా జరుపుకొంటారు. మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించడంకోసం కోర్టులతోపాటు మానవ హక్కుల కమిషన్‌లు ఏర్పాటుచేయబడ్డాయి. భారతదేశంలో ..క్రీ.శ.1215లో ఇంగ్లండ్ అప్పటి రాజు జాన్ విడుదల చేసిన 'మాగ్నా కార్టా' మొట్టమొదటి మానవ హక్కుల ప్రకటన నుండే భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు రూపొందాయి. 1993లో రూపొందిన మానవ హక్కుల పరిరక్షణ చట్టం 1994, జనవరి 8నుండి అమలులోకి వచ్చింది.

# చేనేత కార్మికుల అకౌంట్లలోకి డబ్బులు!

**హైదరాబాద్ :** తెలంగాణలో నేతన్నలు అప్పుల ఊబిలో చిక్కుకున్నారు. ఆర్థిక సమస్యలతో ఎంతోమంది తనువు చాలిస్తున్నారు. అటు ఆశించిన స్థాయిలో రాబడి లేదు. ఈ నేపథ్యంలో.. తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నేతన్నలకు ఆర్థికంగా అండగా నిలవాలని నిర్ణయించింది.సెప్టెంబరు 9న హైదరాబాద్‌లో జాతీయ చేనేత సాంకేతిక సంస్థ ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేనేత కార్మికులకు రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. దీంతో నేతన్నలు ఆశగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు సీఎం ఆదేశాలతో అధికారులు కదిలారు. చేనేత శాఖ రుణమాఫీపై కసరత్తు చేపట్టిందిరుణమాఫీ అమలుకు రూ.58 కోట్లు అవసరమని ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు చేనేత శాఖ ప్రతిపాదనలు రూపొందించి నిధుల విడుదల కోసం ఆర్థికశాఖకు దస్త్రం పంపింది.గత ప్రభుత్వం 2017 మార్చి 31 వరకు రుణమాఫీ అమలు చేసింది. దీంతో 2017 ఏప్రిల్ నుంచి 2024 మార్చి 31 వరకు ఉన్న రుణాలను మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.తెలంగాణలోని బ్యాంకులు, చేనేత కార్మికులు, సంఘాలు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల సమాచారాన్ని.. జిల్లాల నుంచి ప్రభుత్వం సేకరించింది.ఆ వివరాల ప్రకారం.. 7,250 మంది కార్మికులకు రూ.40.10 కోట్ల వ్యక్తిగత రుణాలు, 91 చేనేత సహకార సంఘాలపై రూ.18 కోట్ల మేరకు అప్పులున్నట్లు తేలింది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో.. రుణ మాఫీకి రూ.58.10 కోట్లు అవసరమని చేనేత శాఖ ప్రతిపాదనలు పంపింది. కార్మికులు, సంఘాల వారీగా రుణ జాబితాను ఆర్థికశాఖకు అందజేసింది.ఆర్థిక శాఖ నుంచి ఆమోదం లభిస్తే.. రుణమాఫీ ప్రక్రియను చేపట్టేందుకు చేనేత శాఖ సిద్ధంగా ఉంది.చేనేత రుణమాఫీ కార్యక్రమాన్ని కార్మికులతో భారీఎత్తున నిర్వహించాలని రేవంత్ సర్కారు భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఆ కార్యక్రమంలోనే రేవంత్ రుణ మాఫీ నిధులను విడుదల చేస్తారని సమాచారం.తెలంగాణలో వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది చేనేత రంగంలో జీవనోపాధి పొందుతున్నారని.. అధికారులు చెబుతున్నారు. వస్త్రాల తయారీలో వస్తున్న అధునాతన సాంకేతిక మార్పుల కారణంగా.. చేనేత రంగంలో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో నూతన డిజైన్లు, వైవిధ్యతతో వస్త్రాల తయారీలో ముందుకెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నేతన్నకు చేయూత ద్వారా.. చేనేత కార్మికుడు పొదుపు చేసుకున్న డబ్బుకు రెండింతలు ప్రభుత్వం వాటాగా వారి అకౌంట్లో జమచేస్తోందని అధికారులు వివరిస్తున్నారు.

# బీఆర్ఎస్‌లో ఏం జరుగుతోంది

**మెదక్ :** మొన్నటివరకు ఆ నియోజకవర్గం గులాబీ పార్టీలో అంతా ఆయనే చూసుకున్నారు. ఇప్పుడు ఆయన్ని కాదని కొత్త ముఖాన్ని తెరపైకి తెచ్చారు. దాంతో ఆ నియోజకవర్గంలో ఒక్కసారిగా గ్రూపు రాజకీయాలకు తెరలేచింది. మొన్నటివరకు సైలెంట్ గా ఉన్నవారు ఇప్పుడు వైలెంట్‌గా మారి సీనియర్ నేతను టార్గెట్ చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం. 2014లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన పట్లోళ్ల కిష్టారెడ్డి ఆకస్మిక మరణం తర్వాత 2016లో ఉప ఎన్నిక వచ్చింది. ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి భూపాల్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. దాంతో మొదటిసారి నారాయణఖేడ్ లో బీఆర్ఎస్ జెండా ఎగిరింది. ఆ తర్వాత 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనూ రెండోసారి బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించింది. అప్పుడు బీఆర్ఎస్ అధికారంలో ఉండటం ఎమ్మెల్యే కూడా అదే పార్టీ కావడంతో నారాయణఖేడ్ నియోజకవర్గంలో అభివృద్ధి బాగానే జరిగింది.అయితే 2023 అసెంబ్లీ ఎన్నికలకి వచ్చేసరికి ఎమ్మెల్యేపై స్థానికంగా వ్యతిరేకత పెరిగింది. సొంత పార్టీ నేతలు, కార్యకర్తల నుంచే అసమ్మతి పెరగడంతో అధిష్టానం నష్టనివారణ చర్యలు చేపట్టింది. అయినా కూడా కారు పార్టీ పరాజయం పాలైంది. కాంగ్రెస్ పార్టీ నుంచి దివంగత ఎమ్మెల్యే కిష్టారెడ్డి కుమారుడు పటోళ్ల సంజీవరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి ప్రధాన కారణం పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులను పట్టించుకోకపోవడమే కారణమన్న ప్రచారం అప్పట్లో జరిగింది. బీఆర్ఎస్ నుంచి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు భూపాల్ రెడ్డిపై కోపంతో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మరికొంతమంది భూపాల్‌రెడ్డిపై వ్యతిరేకత ఉన్నా పార్టీనే నమ్ముకుని సైలెంట్ గా ఉండిపోయారు. అయితే పార్టీలో మాజీ ఎమ్మెల్యేపై ఉన్న అసంతృప్తి ఇప్పటివరకు ఎక్కడ బయటపడలేదు.కానీ ఒక్కసారిగా ఇప్పుడు పార్టీలో ఉన్న అసమ్మతి తెరపైకి వచ్చింది. రైతు భరోసాపై రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ అన్ని మండల కేంద్రాల్లో నిరసనలకు పిలుపునిచ్చింది. నారాయణఖేడ్ లో బీఆర్ఎస్ ఆందోళన చేయగా ఒకటే పార్టీ జెండా వేసుకుని రెండు గ్రూపులు వచ్చాయి. మాజీ ఎమ్మెల్యే వర్గం ధర్నా చేసి వెళ్లిపోయాక.. మరో వర్గం బీఆర్ఎస్ కండువాలు వేసుకుని ధర్నా చేసి మాజీ ఎమ్మెల్యే వర్గానికి షాక్ ఇచ్చింది.మాజీ ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా ఉన్న వాళ్లు ఆ ధర్నా చేశారట. ఈ ధర్నాని పార్టీతో సంబంధం లేని మచ్చేందర్ అనే ఓ నాయకుడు చేయించారన్న ప్రచారం జరుగుతుంది. భూపాల్ రెడ్డి పక్కకు పెట్టిన వారితో గ్యాంగ్ ఏర్పాటు చేసుకుని తాను కూడా బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్టు మచ్చేందర్ ప్రచారం చేసుకుంటున్నారు. దానిపై మాజీ ఎమ్మెల్యే వర్గం మాత్రం పార్టీలో ఫేడ్ అవుట్ అయిన వాళ్లు, జనాదరణ లేని కొందరు ఇలా పార్టీని చెడగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఈ విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని అంటుంది. ఏది ఏమైనా ఒక్కసారిగా బీఆర్ఎస్ రెండు వర్గాలుగా విడిపోవడంతో పార్టీకి నష్టం జరిగే అవకాశముందని క్యాడర్ కలవరం చెందుతోంది. బీఆర్ఎస్ అగ్రనేతలు వెంటనే వర్గపోరుకి ఫుల్ స్టాప్ పెట్టాలని.. గోటితో పోయేదాన్ని గొడ్డలివరకు తెచ్చుకుంటే మాత్రం పార్టీ పరిస్థితి అగమ్యగోచరంగా మారే అవకాశముందని కేడర్ సూచిస్తోంది.

# మంత్రుల పనితీరుపై నివేదికలు

**హైదరాబాద్ :** ఏడాది పాలన పూర్తి చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డి.. ఇక నుంచి ప్రతి అంశంపై పట్టు సాధించే యోచనలో ఉన్నారు. అటు అధికారులు..ఇటు క్యాబినెట్ సహచరుల పనితీరు మీద ఇప్పటికే ఇంటెలిజెన్స్ రిపోర్ట్ తెప్పించుకున్న సీఎం మార్పులు, చేర్పులు చేయాలని భావిస్తున్నారట. తన దూకుడుకు తగ్గట్లుగా పనిచేయని అధికారుల తీరుపై ఇప్పటికే అసంతృప్తి వ్యక్తం చేశారట.త్వరలోనే కొందరు ఉన్నతస్థాయి అధికారుల బదిలీలు కూడా ఉంటాయని అంటున్నారు. అంతేకాదు ఏడాది పాలనలో అమాత్యుల పనితీరు ఎలా ఉందని కూడా రేవంత్ ఆరా తీసినట్లు తెలుస్తోంది. పలువురు మంత్రుల పనితీరుపై ప్రజల్లో నెగెటివ్ టాక్ ఉందని సీఎం దృష్టికి వచ్చిందంటున్నారు. ఒకరిద్దరు మంత్రుల అవినీతి ఆరోపణల వ్యవహారం ముఖ్యమంత్రి దగ్గరకు వెళ్లిందట.ఆయా శాఖల్లో మంత్రులు సాధించిన విజయాలు, ఫెయిల్యూర్స్‌పై ముఖ్యమంత్రి కార్యాలయం రిపోర్ట్ తయారు చేసిందని సచివాలయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కొందరు మంత్రుల పనితీరుపై సీఎం రేవంత్ రెడ్డి అసంతృప్తితో ఉన్నారని తెలుస్తోంది. పలువురు మినిస్టర్ల అవినీతి భాగోతంపై సీరియస్‌గా ఉన్న ముఖ్యమంత్రి..మంత్రివర్గ విస్తరణలో వారి శాఖలను మార్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఇద్దరు ముగ్గురు మంత్రులు పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతున్నారని ఇంటెలిజెన్స్ అధికారులు సీఎంకు రిపోర్టు ఇచ్చారట.ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి టేబుల్ మీద ఉన్న ఐబీ నివేదికలో మంత్రుల అక్రమాలు, అవినీతికి సంబంధించిన వివరాలు ఉన్నట్లు సచివాలయ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలోనే ఆయా మంత్రులపై ఎటువంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై రేవంత్ సమాలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అక్రమాలకు పాల్పడుతూ..అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న మంత్రుల అంశాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి సిద్ధమవుతున్నారని టాక్.త్వరలో మంత్రివర్గ విస్తరణ జరగనుంది. ఆరు బెర్తులను భర్తీ చేయబోతున్నారు. అదే సమయంలో పనితీరు సరిగా లేని మంత్రుల శాఖలను మార్చే అవకాశం ఉందంటున్నారు. కొందరిని అయితే తప్పించే అవకాశం కూడా లేకపోలేదన్న చర్చ జరుగుతోంది. దీంతో ఏ మంత్రి శాఖ మారబోతుంది.

కరప్షన్ అలిగేషన్స్ ఎదుర్కొంటున్న అమాత్యులు ఎవరనే దానిపై సెక్రటేరియట్‌లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. కొందరు మంత్రుల మీద వచ్చిన నెగెటివ్ ఫీడ్ బ్యాక్‌ను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లబోతున్నారట సీఎం రేవంత్. ఇవాల్టితో ప్రజావిజయోత్సవాలు ముగియడంతో తర్వాత సెక్రటేరియట్‌లో పూర్తిస్థాయి ప్రక్షాళనకు రెడీ అవుతున్నారట సీఎం. అధికార యంత్రాంగాన్ని తన గ్రిప్‌లోకి తెచ్చుకుని పాలనను పరుగులు పెట్టించాలని ఫిక్స్ అయ్యారట. అందులో భాగంగా మంత్రుల పనితీరు, వాళ్ల మీద వస్తున్న ఆరోపణలపై ఓ కన్నేసి పెట్టారని అంటున్నారు.అయితే పబ్లిక్ నుంచి నెగెటివ్ ఫీడ్ బ్యాక్ వచ్చిన మంత్రులు, కరప్షన్ అలిగేషన్స్ ఉన్న మినిస్టర్ల విషయంలో ఎలాంటి స్టెప్ తీసుకోవాలనే దానిపై సన్నిహితులతో చర్చిస్తున్నారట సీఎం. ప్రజా విజయోత్సవాలు ముగిశాక.. హైకమాండ్ పెద్దల దృష్టికి తీసుకెళ్లి మార్పులు, చేర్పులకు శ్రీకారం చుడుతారని అంటున్నారు. ఏ మంత్రి శాఖ మారబోతుందో..అధిష్టానం ఏం నిర్ణయం తీసుకుంటుందో చూడాలి మరి.

# కోమటిరెడ్డి జన్మ ధన్మమయింది

**హైదరాబాద్** బ్రాహ్మణ వెల్లల ప్రాజెక్టు కోసం కోమటిరెడ్డి 2004 నుంచి పోరాడుతున్నారు. ఇపుడు నిధులు ఇచ్చి పూర్తి చేసినం. వెంకన్న జన్మ ధన్యం అయిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. హైదరాబాద్ లో ఉన్న ఆయన సన్నిహితులు ను తీసుకెళ్లి ప్రాజెక్టును చూపించాలి. వైఎస్ ఆర్ తో కోట్లాడి కోమటిరెడ్డి ప్రాజెక్టు మంజూరు చేపించుకున్నారు. నల్గొండ జిల్లా కూడా గోదావరి తరహాలో నీళ్లు పారబోతున్నాయి. భూమి ధరలు భారీగా పెరగబోతున్నాయని అన్నారు. . నాకు, తలా ఒక ఎకరం ఇవ్వవా అని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అడిగారు.

# ఆ నోట్ల కట్టలు ఎక్కడవి...

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో అదానీ వివాదంపై విపక్షాలు రచ్చ రచ్చ చేస్తున్న వేళ ఉభయసభలు వరుసగా వాయిదా పడుతున్నాయి. ఇలాంటి తరుణంలో రాజ్యసభలో సంచలన పరిణామం చోటు చేసుకుంది. కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ కి కేటాయించిన సీటులో భారీగా 500 నోట్ల కట్టలు దొరికాయి.శీతాకాల సమావేశాల్లో భాగంగా రాజ్యసభలో సీటు నెంబర్ 222 వద్ద నోట్ల కట్ట దొరకడం దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీసింది. రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ నేత అభిషేక్ మను సింఘ్వీకి కేటాయించిన సీటు కావడంతో అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. రాజ్యసభ ఛైర్మన్ ఆ నోట్ల కట్ట వ్యవహారంపై విచారణకు ఆదేశించినట్లు ప్రకటించగా.. ఆ నోట్ల కట్టలు, తనకు సంబంధం లేదని ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ వివరణ కూడా ఇచ్చారు. ఇప్పుడు తాజాగా వెలుగుచూసిన 'నోట్ల కట్ట' ఉదంతం తర్వాత ఎలాంటి మార్పులు జరుగుతాయోనన్న చర్చ కూడా మొదలైంది.ఇటీవల కాలంలో పార్లమెంట్ లో సభ కార్యకలాపాలు ముగిసిన తర్వాత సీటు నంబర్ 222 నుండి నోట్ల కట్ట కనిపించింది. ఇది రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌కర్ ప్రకటన. డిసెంబర్ 6, శుక్రవారం, పార్లమెంట్ శీతాకాల సమావేశాల 10వ రోజు. కార్యక్రమాలు ప్రారంభమైన వెంటనే జగ్దీప్ ధన్‌ఖర్ చేసిన ఈ ప్రకటనతో పార్లమెంట్‌లో పెద్ద దుమారం చెలరేగింది. గందరగోళం ఎంతగా పెరిగిందంటే ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరిపించాలని రాజ్యసభ ఛైర్మన్ కోరారు.సభా కార్యకలాపాలు డిసెంబర్ 5న ముగియగానే సీటు నంబర్ 222 వద్ద నోట్ల కట్ట కనిపించిందని ఛైర్మన్ తెలిపారు. ఈ సీటును కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీకి కేటాయించారు. రూ.500 నోట్లు 100 నోట్లు ఉన్నట్లు తెలుస్తోందని రాజ్యసభ ఛైర్మన్ తెలిపారు. కాగా, తాను పార్లమెంటుకు రూ.500కు మించి తీసుకుని రానని సింఘ్వీ చెప్పారు. పార్లమెంట్ సభ్యులు తమ వెంట సభ లోపలికి డబ్బులు తీసుకెళ్లడంపై ఎలాంటి నిషేధం లేదు. అయితే ఆ డబ్బును సభలో ప్రదర్శించడంపై మాత్రం ఆంక్షలు, నిబంధనలు అమలవుతున్నాయి. ఇందుకు 2008లో జరిగిన "ఓటుకు నోటు" వివాదమే కారణం. కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (యూపీఏ) ప్రభుత్వం అమెరికాతో అణు ఒప్పందం కుదుర్చుకుంది. దీన్ని తీవ్రంగా వ్యతిరేకించిన సీపీఐ(ఎం) ఈ కూటమికి మద్దతును ఉపసంహరించుకుంది. దీంతో ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టగా.. దాన్నుంచి గట్టెక్కడం కోసం నాటి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ప్రత్యర్థి క్యాంపు ఎంపీలకు లంచం ఇచ్చి వ్యతిరేకంగా ఓటు వేయకుండా వ్యూహం రచించింది. ఈ ప్రయత్నాన్ని బీజేపీ ఎంపీలు బయటపెట్టారు.. సభలోకొందరు నోట్ల కట్టల సంచిని తీసుకొచ్చి సభ జరుగుతుండగానే వాటిని ప్రదర్శించారు. ఇది ప్రపంచవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీసింది. భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, రాజకీయ పార్టీల అవినీతి, నేతలు అమ్ముడుపోవడం వంటి పలు అంశాలపై అంతర్జాతీయ స్థాయిలో కథనాలు వెలువడ్డాయి. సభ లోపల జరిగే తంతు దేశ ప్రతిష్ఠకు భంగం కలిగించకుండా ఉండడం కోసం అప్పటి నుంచి పెద్ద మొత్తంలో డబ్బును సభ లోపలికి తీసుకెళ్లకుండా నిబంధనలు అమల్లోకి తీసుకొచ్చారు.ఇంత రచ్చకు కారణమైన నోట్ల కట్టకు సంబంధించి పార్లమెంట్‌లో ఎలాంటి నిబంధనలు ఉన్నాయో తెలుసుకుందాం.. ఎంపీలు తమ వెంట ఎంత డబ్బు తీసుకెళ్లవచ్చు, వారిని పార్లమెంటుకు తీసుకెళ్లకుండా నిషేధం ఎందుకు విధించారో కూడా చూద్దాం.నోట్ల కట్టలు తెచ్చుకుని రచ్చ సృష్టిస్తున్నారు.. దీనికి సంబంధించి ఎలాంటి నిబంధనలు లేవు. ఏ ఎంపీ అయినా ఎంత డబ్బుతో అయినా సభలోకి రావచ్చు. పార్లమెంట్ హౌస్ లోపల ఆహార దుకాణాలు, బ్యాంకులు కూడా ఉన్నాయి. చాలా మంది నాయకులు ఈ బ్యాంకు నుంచి డబ్బులు విత్‌డ్రా చేస్తూనే ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పార్లమెంటు లోపల నోట్లను తీసుకెళ్లడం నిబంధనలకు విరుద్ధం కాదు. అయితే, సభ లోపల పెద్ద మొత్తంలో డబ్బును ప్రదర్శించడం ఖచ్చితంగా నిషేధం. పార్లమెంటు లోపల డబ్బును ఉపయోగించడం లేదా ప్రదర్శించడం దాని గౌరవాన్ని దెబ్బతీస్తుంది. 2008లో బీజేపీ ఆ సంవత్సరం కరెన్సీ నోట్లను తీసుకుని పార్లమెంటుకు చేరుకున్నప్పుడు ఈ నిబంధన మరింత పటిష్టంగా అమలు చేయబడింది.ఎంపీలు చిన్న పర్సు లేదా అవసరమైన వ్యక్తిగత వస్తువులతో కూడిన బ్యాగ్ వంటి వ్యక్తిగత వస్తువులను తీసుకెళ్లడానికి అనుమతించబడతారు. సభ పనితీరుపై ప్రభావం చూపనంత కాలం. మహిళా ఎంపీలు హ్యాండ్‌బ్యాగ్‌లు తీసుకెళ్లేందుకు అనుమతించారు. కానీ అది వ్యక్తిగత అవసరాలకు మాత్రమే ఉపయోగించాలనే షరతుపైనే. వ్యాలెట్లు లేదా చిన్న బ్యాగ్‌లను తీసుకెళ్లడంపై ఎటువంటి పరిమితి లేదు, ఇవి ప్రొసీడింగ్‌లకు ఆటంకం కలిగించవు.శాసన ప్రయోజనాల కోసం అవసరమైన పత్రాలు, గమనికలు, నివేదికలు లేదా బిల్లులు తీసుకెళ్లడానికి అనుమతించబడతాయి.స్పీచ్ పేపర్: డిబేట్ లేదా డిస్కషన్‌లో పాల్గొనేందుకు సిద్ధం చేసిన స్పీచ్ పేపర్ఎలక్ట్రానిక్ పరికరాలు: ఎంపీలు ముందస్తు అనుమతి తర్వాత మొబైల్ ఫోన్లు, ట్యాబ్లెట్లు, ల్యాప్‌టాప్‌లను తమ వెంట తీసుకెళ్లవచ్చు.రిఫ్రెష్‌మెంట్స్: ప్రొసీడింగ్ సమయంలో నీరు, తేలికపాటి స్నాక్స్ అనుమతించబడతాయి.అసభ్యకరమైన లేదా అనుచితమైన అంశాలు: సభకు లేదా దాని కార్యకలాపాలకు అవమానకరంగా భావించే ఏదైనా ఖచ్చితంగా నిషేధించబడింది.నిరసన మెటీరియల్: నిరసన కోసం ఉపయోగించే ప్లకార్డులు, పోస్టర్లు లేదా బ్యానర్లు వంటి వస్తువులను పార్లమెంటు లోపలికి తీసుకెళ్లకూడదు.పెద్ద మొత్తంలో నగదు: నగదు కట్టలు, ముఖ్యంగా పెద్ద మొత్తంలో తీసుకెళ్లడం ఖచ్చితంగా నిషేధించబడింది.అనధికార ఎలక్ట్రానిక్ పరికరాలు: రికార్డింగ్ లేదా ఫోటోగ్రాఫ్ తీయడానికి ఉపయోగించే పరికరాలను అనుమతి లేకుండా పార్లమెంట్ లోపల తీయకూడదు.

## అనంతలో జేసీ జగడం

**అనంతపురం :** జేసీ ప్రభాకర రెడ్డి సొంత పార్టీ నేతలకే కాదు.. సొంత సామాజికవర్గం నేతలకు కూడా విలన్ గా మారారు. ఆయన పెట్టుకుంటున్న విభేదాలు ఆయనకు మరింత ఇబ్బందిని తెచ్చి పెడతాయంటున్నారు. అనంతపురం జిల్లాలో జేసీ కుటుంబానికి ఒక హిస్టరీ ఉంది. అదే సమయంలో జిల్లాలో అనేక నియోజకవర్గాల్లో జేసీ వేలు పెట్టడంతో అనేక మంది సొంత పార్టీ అంటే టీడీపీ నేతలే వ్యతిరేకమయ్యారు. జేసీ ప్రభాకర్ రెడ్డి తమ నియోజకవర్గాల్లో వేలు పెట్టడమేంటని పుటపర్తి, అనంతపురం, రాయదుర్గం, కల్యాణదుర్గం, శింగనమల నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ నేతలనే తన శత్రువులుగా మార్చుకున్నారు. అక్కడ తన అనుచరులకు అందం ఎక్కించాలన్న ఆశతో ఆయన అక్కడ ఉన్న అసలైన నేతలకు దూరమయ్యారు. అందుకే గత ఎన్నికల్లో జేసీ కుటుంబానికి కేవలం తాడిపత్రి నియోజకవర్గమే అధినాయకత్వం ఇచ్చింది. అనంతపురం పార్లమెంటు స్థానం కావాలని భావించినా చంద్రబాబు నాయుడు అంగీకరించనది జిల్లా నేతల నుంచి జేసీ పై వస్తున్న వ్యతిరేకతే కారణం. ఇలా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో శత్రువులను పెంచుకుని కత్తి లేకుండా జేసీ యుద్ధం చేస్తున్నారు. జేసీ దివాకర్ రెడ్డి కొంత రాజకీయంగా యాక్టివ్ గా ఉన్న సమయంలో ఇంతటి వ్యతిరేకత లేదు. అయితే జేసీ ప్రభాకర్ రెడ్డి నాయకత్వ బాధ్యతలను తీసుకున్న తర్వాతే ఎక్కువ విభేదాలు తలెత్తాయని అంటారు. జేసీ దివాకర్ రెడ్డి?తో పోలిస్తే ప్రభాకర్ రెడ్డి దూకుడుగా ఉండటమే కాకుండా, మాటలు కూడా కటువుగా ఉండటంతో పార్టీ నేతలే ఆయనకు దూరంగా ఉండటం ప్రారంభించారు. ఎవరూ ఆయన వద్దకు వెళ్లి పలకరించే సాహసాన్ని కూడా చేయరు. కనీసం ఆయనను పార్టీ నేతగా చూసే అవకాశాన్ని కూడా వారు ఇవ్వడం లేదు. ఏమాత్రం తాము తగ్గినట్లు కనిపిస్తే తమ నియోజకవర్గంలో ఎక్కడ వేలుపెడతారో? అన్న సందేహంతో జేసీ తో అంటీముట్టనట్లు వ్యవరిస్తున్నారు. పార్టీ అధినాయకత్వానికి లెక్కకు మించిన సార్లు ఫిర్యాదుకూడా చేశారు. అయితే తాడిపత్రిలో ఉన్న బలం, బలగాన్ని పార్టీ హైకమాండ్ ఆయనకు ఆ మాత్రం ప్రయారిటీ అయినా ఇస్తుందన్నది వాస్తవం. మరోవైపు తాజాగా బీజేపీకి చెందిన ఆదినారాయణరెడ్డి తో కూడా జేసీ ప్రభాకర్ రెడ్డి వైరానికి దిగారు. కడప ఆర్టీపీపీ విషయంలో నేరుగా కయ్యానికి దిగడంతో ఇప్పుడు ఆది వర్గం కూడా జేసీ పై గుర్రుమంటోంది. కడప జిల్లాలో జేసీ పెత్తనమేంటని ఆయన ప్రశ్నిస్తున్నారు. అయితే ఇందుకు జేసీ ససేమిరా అనడంతో ఇది చినికి చినికి గాలివానలా మారి ముఖ్యమంత్రి వద్దకు పంచాయతీ చేరింది. పంచాయతీకి కూడా రాకుండా జేసీ ప్రభాకర్ రెడ్డి దూరంగా ఉండి నేనింతే నని సంకేతాలను పంపడంతో ఫ్లై యాష్ విషయంలో చివరకు ఆదినారాయణ రెడ్డి వర్గానిదే పై చేయిగా మారింది. రాజీ దోరణి అనేది ఉండదు. అలాగే సంయమనంతో సమస్యను పరిష్కరించుకుందామన్న ధ్యాస ఉండదు. కేవలం దూకుడుగా వెళ్లి తనకు కావాల్సిన పనిని తాను చేసుకుందామని ఆయన భావించడమే ఇప్పుడు జేసీ వర్గానికి మింగుడు పడటం లేదు. కానీ ఆయన వద్ద నేరుగా ప్రస్తావించలేని కొందరు తమ వ్యాపారాల కోసం ఇతర మార్గాలన చూసుకుంటున్నారు. ఆదినారాయణ రెడ్డి పేరుకు బీజేపీలో ఉన్నా ఆయనకు టీడీపీలో ఉన్న నేతల మద్దతు పుష్కలంగా ఉండటంతో జేసీ బూడిద కాంట్రాక్టు విషయంలో ఒంటరియ్యారనే చెబుతున్నారు?. అందుకే పార్టీ అధినాయకత్వం కూడా ఆది నారాయణ రెడ్డి వెంట ఉండటంతో జేసీకి అర్థమయినా ఆయన దూకుడు మాత్రం ఆగడం లేదు. . ఇక తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని నియోజకవర్గంలోకి అడుగు పెట్టకుండా చేస్తున్నారు. సరే.. ఆయనంటే నియోజకవర్గంలో శత్రువుగా పరిగణించవచ్చు. కానీ అనంతపురం మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి తో కూడా జేసీ ప్రభాకర్ రెడ్డి గొడవకు దిగారు. అనంతపురంలో కళాశాల స్థలాన్ని అనంత వెంకట్రామిరెడ్డి ఆక్రమించకున్నారని, దానిని తిరిగి తాను ప్రభుత్వం స్వాధీనం చేస్తానని చెబుతున్నారు. దీంతో సొంత సామాజికవర్గం నేతలతో ఈ గొడవలేంటని పలువురు నచ్చ చెప్పే ప్రయత్నం చేస్తున్నప్పటికీ జేసీ ఆగడం లేదు.

తాను అనుకున్న దారిలోనే ఆయన వెళుతున్నారు తప్పించి ఎవరి సలహాలు స్వీకరించకపోతుండటం కూడా జేసీ ప్రభాకర్ రెడ్డిపై కొంత వ్యతిరేక రెడ్డి సామాజికవర్గంలో పెరగడానికి కారణమయిందని చెప్పాలి. జేసీ ప్రభాకర్ రెడ్డి తాను తాడిపత్రి వరకూ పరిమితమయి అక్కడే రాజకీయాలు చేసుకుంటే ఎవరికీ ఇబ్బంది ఉండదు. కానీ అదే తాను అన్ని నియోజకవర్గాల్లో వేలు పెట్టాలని చూస్తూ అందరూ ఏకమై జేసీని ఏకాకిని చేయడం ఖాయంగా కనిపిస్తుంది. ఇప్పటికే జేసీ ఏకాకి అయ్యారన్న వారు అనేక మంది ఉన్నారు. మరి జేసీ ఇప్పటికైనా తన పద్ధతి మార్చుకుంటారా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.

## జాతీయ రహదారిపై లారీ, వ్యాను ఢీ

### - క్లీనర్ సజీవ దహనం



**నెల్లూరు** జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న ఇసుక లారీ ని వెనుక నుంచి వ్యాన్ ఢీకొట్టిన సంఘటనలు మంటలు చెలరేగాయి. వ్యాను ముందు భాగంలో చిక్కుకున్న వ్యాన్ క్లీనర్ మంటల్లో చిక్కుకొని సజీవ దహనమయ్యాడు. హైవేపై భోగాపురం సమీపంలో నారు పేట పెట్రోల్ బంకు వద్ద సోమవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న వ్యాన్ వెళ్తోంది. నారు పేట వద్దకు వచ్చేసరికి ముందు వెళ్తున్న ఇసుక లారీ ని ఢీ కొట్టింది. దీంతో వ్యాన్లో ఒకసారిగా మంటలు చెలరేగాయి. ఢీకొట్టిన సమయంలో వ్యాన్లో చిక్కుకున్న క్లీనర్ బయటికి రాలేకపోవడంతో సజీవ దహనం అయ్యాడు. సిఐ ప్రభాకర్, ఎస్సై లు పాపారావు, సూర్య కుమారి, హైవే సిబ్బంది చేరుకొని జాతీయ రహదారిపై వెళ్తున్న మిగతా వాహనాలకు మనుషులు తగలకుండా చర్యలు తీసుకున్నారు. గాయపడిన వ్యాన్ డ్రైవర్ ను ఆసుపత్రికి తరలించారు. గంటన్నర ఆలస్యంగా చేరుకున్న ఫైర్ ఇంజన్ ప్రమాదం జరిగిన విషయాన్ని వెంటనే పోలీసులతో పాటు స్థానికులు ఫైర్ ఇంజన్ కు సమాచారం ఇచ్చారు. హైవేపై ఉన్న విశాఖ జిల్లా చిట్టవలస అగ్నిమాపక కేంద్రానికి అటు విజయనగరం అగ్నిమాపక కేంద్రానికి తెలియజేశారు. 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిట్టవలస నుంచి కానీ 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న విజయనగరం నుంచి గాని ఫైర్ ఇంజన్లు చేరుకోలేదు. చివరకు విజయనగరం నుంచి గంటన్నర ఆలస్యంగా ఫైర్ ఇంజన్ చేరుకుంది. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

## కొత్త ఎత్తులతో పాకిస్తాన్..

### - బలగాల అదుపులో 10 మంది

**శ్రీనగర్ :** నిరంతరం భారత్‌పై కుట్రలు చేస్తూ.. ఉగ్రవాదాన్ని ఎగదోస్తోన్న దాయాది మరో కొత్త పన్నాగానికి తెరతీసింది. భారత్ జైళ్లలోని కరుడుగట్టిన ఉగ్రవాదులతో సంప్రదింపులు, వారికి కీలక సమాచారాన్ని చేరవేసేందుకు ఆ దేశ గూఢచార సంస్థ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ చేసిన కుట్ర వెలుగులోకి వచ్చింది. డ్రగ్స్ బానిసలుగా లేదా మానసిక స్థితి సరిగ్గాలేని వ్యక్తుల్లా నటిస్తూ ఐఎస్ఐ ఏజెంట్లు కొందరు దేశంలోకి చొరబడుతున్నట్టు తెలుస్తోంది. గత జులై నుంచి దాదాపు పది మంది పాకిస్థానీలు పీవోకే నుంచి భారత్‌లోని ప్రవేశించినట్లు అధికారులు గుర్తించారు. సరిహద్దులు దాటి ప్రవేశించిన వీరు ప్రస్తుతం జమ్మూ, పంజాబ్, రాజస్థాన్‌లలోని జైళ్లలో ఉన్నట్లు చెప్పారు. వీరి చొరబాటు వెనుక భారీ ఎజెండానే ఉందని తెలిపారు.దేశంలోకి చొరబడిన పాక్ పౌరులను ఐఎస్ఐ ఏజెంట్లుగా భద్రతా దళాలు అనుమానిస్తున్నాయి. భారత్ జైళ్లలో ఉన్న పాక్ ఖైదీలకు కీలక సమాచారం చేరవేయడానికి వీరిని కొరియర్లుగా ఐఎస్ఐ వాడుకున్నట్టు సమాచారం. భద్రతా బలగాల ప్రశ్నలకు దీటుగా సమాధానమిచ్చి తప్పించుకునే పద్ధతుల్లోనూ వీరు శిక్షణ పొందినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని అధికారులు అంటున్నారు. వారి అనుమానాస్పద తీరు, తప్పించుకునే ధోరణి చూస్తే చొరబాటు వెనుక భారీ కుట్రకోణం ఉన్నట్లు అర్థమవుతోందని తెలిపారు. మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ వినియోగిస్తే వారి కుట్రలు బయటపడుతాయన్న ఆలోచనతోనే ఐఎస్ఐ కొత్త మార్గాలను అనుసరిస్తోందని చెప్పారు.ఈ వ్యూహంలో మహిళలు, మైనర్లను సైతం ఐఎస్ఐ ఉపయోగించుకుంటున్నట్లు సమాచారం. డ్రగ్స్ అక్రమ రవాణాకు సైతం వీరిని పాకిస్థాన్ వాడుకుంటోన్నట్టు బావిస్తున్నారు. ఇటీవల పంజాబ్ సరిహద్దులో పట్టుబడిన ఓ మైనర్‌ను పాకిస్థాన్ బాలుడిగా గుర్తించారు. అతడు ఉద్దేశపూర్వకంగానే దేశం దాటినట్లు తెలుస్తోంది. అలాగే, రాజస్థాన్‌లో ఇటీవల భద్రతా బలగాలకు చిక్కిన ఓ పాకిస్థానీ మతిస్థిమితం లేనట్లు కనిపించాడు. కానీ, అనుమానం వచ్చి.. తమదైన శైలిలో విచారించడంతో అసలు నిజం బయటపడింది. పాక్‌లోని ఇద్దరు డ్రగ్స్ స్మగ్లర్లు తనను ఏజెంట్‌గా పెట్టుకున్నట్టు వెల్లడించాడు.భారత్‌లోకి డ్రగ్స్ సరఫరాతో పాటు బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌కు (బీఎస్ఎఫ్) సంబంధించి కీలక సమాచారం కూడా అతడు సేకరిస్తున్నట్టు తేలింది. అలాగే, లాహోర్‌కు చెందిన మహమ్మద్ అసద్ అనే యువకుడు బైక్‌పై వచ్చి బోర్డర్ దాటేందుకు ప్రయత్నించి.. ఉద్దేశపూర్వకంగానే బీఎస్ఎఫ్ సిబ్బంది చేతిలో అరెస్టు అయ్యేందుకు వేచి చూసినట్లు తెలిసింది. విచారణలో అతడు ప్రియురాలి విషయంలో కుటుంబంతో గొడవపడి వచ్చినట్టు చెప్పాడు. అయితే, అతడి తీరు అనుమానాస్పందంగా ఉండటంతో అదుపులోకి తీసుకుని జైలుకు తరలించారు. అయితే, అతడి కదలికలపై నిఘా పెట్టగా ఐఎస్ఐ కొరియర్‌గానే అనుమానం కలుగుతోందని అధికారులు తెలిపారు. తదుపరి విచారణ కోసం కస్టడీని పొడిగించాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. అక్టోబరులో షాహిద్ ఇమ్రాన్ (31) మరో పాక్ జాతీయుడు జమ్మూ సెక్టార్‌లో చొరబాటుకు ప్రయత్నించాడు. తాను కాళీ మాత ఆలయాన్ని దర్శించుకోడానికి వచ్చినట్టు చెప్పాడు.అనేక మార్గాల ద్వారా భారత్‌లో కోవర్టు ఆపరేషన్ల కోసం దాయాది ప్రయత్నాలు చేస్తూనే ఉంది. 1990, 2000ల దశకాల్లో ఇరు దేశాల మధ్య నడిచే సంఝౌతా ఎక్స్‌ప్రెస్‌ను ఆధారంగా చేసుకొని ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడేది. సవారీ ఆపరేటర్ల పేరుతో డ్రగ్స్ స్మగ్లింగ్, జమ్మూ, పంజాబ్‌లలో ఉగ్ర కార్యకలాపాలకు నిధులు సమకూర్చడంలో వారే కీలక పాత్ర పోషించినట్లు నివేదికలు చెబుతున్నాయి. అయితే, అధికారుల చర్యలతోపాటు చాలా మందిని అరెస్టు చేయడం ద్వారా ఈ తరహా కార్యకలాపాలకు గణనీయంగా అడ్డుకట్టపడింది. దీంతో కొత్త మార్గాలు అన్వేషిస్తోన్న పాక్ గూఢచారులు... కొత్త వ్యూహాలు రచిస్తున్నట్లు తెలుస్తోంది.

## 17న మరో ముప్పు



**అమరావతి** ఏపీలో ఆగ్నేయ బంగాళాఖాతం, దానికి ఆనుకొని ఉన్న హిందూ మహాసముద్రంలో ఏర్పడిన అల్ప పీడనం స్థిరంగా కొనసాగుతున్నట్లు వాతావరణశాఖ తెలిపింది.ఈ నెల 11నాటికి నైరుతి బంగాళాఖాతానికి చేరుకొని తమిళనాడు-శ్రీలంక మధ్య తీరం దాటే అవకాశం ఉందని పేర్కొంది. దీని ప్రభావంతో రేపటి నుంచి నెల్లూరు,ప్రకాశం, చిత్తూరు జిల్లాల్లో వర్షాలు పడతాయంది. ఈ నెల 17న అరేబియా సముద్రంలో మరో అల్పపీడనం ఏర్పడటానికి అవకాశాలు ఉన్నట్లు వెల్లడించింది.

## మళ్లీ రైతుల ఆందోళనలు

**న్యూఢిల్లీ :** రైతులు మరోసారి పోరుబాట పట్టారు. గతంలో రైతు చట్టాలకు వ్యతిరేకంగా దాదాపు ఏడాదిపాటు పోరాటం చేశారు. తాజాగా పంజాబ్, హర్యానా రైతులు మరోమారు ఉద్యమానికి సిద్ధమయ్యారు. న్యాయమైన డిమాండ్ల సాధనే లక్ష్యంగా చలో ఢిల్లీ పేరుతో పాదయాత్రకు సిద్ధమయ్యారు.పంజాబ్, హర్యానా రైతులు మళ్లీ పోరుబాట పట్టారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం దేశ రాజధాని ఢిల్లీ బాట పట్టారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధతతోపాటు డిమాండ్లు నెరవేర్చాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించుకున్నారు.

ఈ నేపథ్యంలో ఇప్పటికే వేలాది మంది రైతులు ఢిల్లీ సరిహద్దులోని శంభుకు చేరుకున్నారు. తాజాగా శంభు, ఖనౌరీ సరిహద్దుల నుంచి రాజధాని ఢిల్లీకి పాదయాత్ర చేయాలని రైతు సంఘాలు పిలుపునిచ్చాయి. అయితే ఖనౌరి పాయింట్ వద్ద ఉన్న రైతులను ఢిల్లీకి అనుమతించే తేదీ ఇంకా నిర్ణయించలేదు. రైతుల మార్చ్ నేపథ్యంలో హర్యాన ప్రభుత్వం కూడా అప్రమత్తమైంది. సరిహద్దుల్లో కేంద్ర పారామిలటరీ బలగాలను మోహరించింది. అదనంగా మూడంచెల బారికేడ్లు ఏర్పాటు చేశారు.

ఐదుగురు అంతకన్నా ఎక్కువ మంది గుమి కూడకుండా నిషేధాజ్ఞలు విధించారు.రైతు నాయకుడు కిసాన్ మజ్దూర్ మోర్చా సమన్వయకర్త శర్వణ్‌సింగ్ పాంథేర్ మాట్లాడుతూ రైతులు ట్రాక్టర్లు, ట్రాలీలు తేకుండా కేవలం కాలినడకన ఢిల్లీకి వెళ్తారన్నారుజ శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంటకు శంభు సరిహద్దు నుంచి 101 మంది రైతులతో పాదయాత్ర ప్రారంభిస్తామని వెల్లడించారు. ఢిల్లీకి మార్చ్ సాగుతుందని తెలిపారు.ఇదిలా ఉంటే.. రైతుల ఉద్యమానికి ఖాప్ పంచాయతీలు, వ్యాపారులు మద్దతు తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో కేంద్రంలో నాలుగు రౌండ్ల చర్చలు జరిపామని, కానీ ఫిబ్రవరి 18 నుంచి ఎలాంటి చర్చలు జరగలేదన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసమే ఈ యాత్ర చేసైఉ?తన్నామన్నారు. పాదయాత్రను అడ్డుకుంటే.. అది తమ నైతిక విజయమన్నారు.

## ఢిల్లీలో పవన్ మ్యూజిక్ పనిచేస్తుందా

**న్యూఢిల్లీ :** బిజెపికి ఇన్నాళ్లకు స్టార్ క్యాంపైనర్ దొరికారు జనసేన అధినేత పవన్ రూపంలో. నిన్నటి మహారాష్ట్ర విజయంలో భాగం పంచుకున్నారు పవన్. అందుకే కీలకమైన దేశ రాజధానిలో జనసేన అధినేతను ప్రయోగించడానికి బిజెపి అగ్ర నేతలు సిద్ధమయ్యారు. మహారాష్ట్ర ఎన్నికల్లో బిజెపి నేతృత్వంలోని మహా యూటీ కూటమి ఘన విజయం సాధించింది.ఇక్కడ బిజెపి అతిపెద్ద పార్టీగా అవతరించింది. మహారాష్ట్రలో మొత్తం 288 అసెంబ్లీ సీట్లకు గాను 122 స్థానాల్లో విజయం సాధించింది.కమలం పార్టీ అభ్యర్థులు విజయభేరీ మోగించారు. 59 సీట్లతో ఏక్ నాథ్ షిండే శివసేన రెండో స్థానంలో నిలిచింది. మహారాష్ట్రను 15 నెలల పాటు పరిపాలించిన కాంగ్రెస్, ఎన్సీపీలు వరుసగా మూడు నాలుగు స్థానాలకు పరిమితం అయ్యాయి.

జార్ఖండ్లో మాత్రం బిజెపికి ఎదురు దెబ్బ తగిలింది. అయితే ఇప్పుడు మహారాష్ట్ర ఎన్నికల్లో గెలుపు ఉత్సాహంతో ఉన్న బిజెపి తదుపరి ఢిల్లీ అసెంబ్లీపై దృష్టి పెట్టనుంది.అయితే తొలిసారిగా మహారాష్ట్రలో జనసేన అధినేతతో ప్రచారం చేయించింది బిజెపి. పవన్ ప్రచారం చేసిన నియోజకవర్గాలతో పాటు ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో బిజెపి హవా నడిచింది. ఇప్పుడు అదే స్ఫూర్తితో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో సైతం పవన్ సేవలను ఉపయోగించుకోవాలని చూస్తోంది బిజెపి హై కమాండ్. అందుకు పవన్ సైతం సుముఖంగా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. అదే జరిగితే అమ్ ఆద్మీ పార్టీకి గట్టి ఎదురు దెబ్బ తగిలినట్లే. ఇప్పటికే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ఆప్ అన్ని విధాలా సిద్ధంగా ఉంది. తన అరెస్టుతో బిజెపికి ఎదురు దెబ్బ తగలడం ఖాయమని అరవింద్ కేజ్రీవాల్ భావిస్తున్నారు. ఆ ఉత్సాహంతోనే 11 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేశారు. మరోవైపు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై బిజెపి నేతలు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. అక్కడ కూడా పవన్ సేవలను ఉపయోగించుకోవాలని భావిస్తున్నారు.వచ్చే ఏడాది ప్రారంభంలోనే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో బిజెపితో పాటు ఆప్ కు కూడా ప్రతిష్టాత్మకం. మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు గాను ఎన్నికలు జరగనున్నాయి. 2015లో 67, 2020లో 62 స్థానాలతో ఆప్ తిరుగులేని విజయం సాధించింది.ఈసారి 60కి పైగా స్థానాలను గెలిచే లక్ష్యంతో ముందుకు సాగుతోంది.అయితే కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమిలో ఆప్ ఉంది. కానీ ఈ ఎన్నికల్లో కాంగ్రెస్తో పొత్తు పెట్టుకోవడం లేదు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో ఆప్ కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకుంది. ఆప్ నాలుగు చోట్ల,కాంగ్రెస్ మూడు చోట్ల కలిసి పోటీ చేశాయి. కానీ ఏడు స్థానాల్లో కూడా అభ్యర్థులు పరాజయం పాలయ్యారు. అందుకే ఇప్పుడు వేరువేరుగా ఆ రెండు పార్టీలు పోటీ చేస్తున్నాయి.ఢిల్లీ లిక్కర్ స్కాం లో సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టయ్యారు. డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాను సైతం అరెస్టు చేశారు. ఈ తరుణంలో సానుభూతిగా పనిచేస్తుందని బిజెపి భయపడుతుంది. మరోవైపు ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ వాగ్దాటికి నిలిచే నాయకుడు లేకుండా పోయాడు. ఇటువంటి తరుణంలో జనసేన అధినేత పవన్ అయితే గట్టిగా సమాధానం ఇవ్వగలరని బిజెపి పెద్దలు భావిస్తున్నారు. మహారాష్ట్రలో పవన్ సభలు సక్సెస్ అయిన తరుణంలో.. దేశ రాజధానిలో సైతం పవన్ ప్రభావం చూపుతారని ఆశిస్తున్నారు. అందుకే బిజెపి స్టార్ క్యాంపెయినర్గా పవన్ ను తీసుకొచ్చేందుకు బిజెపి పెద్దలు మానసికంగా సిద్ధపడినట్లు తెలుస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## మహారాష్ట్రలో రేవంత్‌కు మైనస్

### - జార్ఖాండలో మల్లుకు ప్లస్

**న్యూఢిల్లీ :** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోలాపూర్ సిటీ నార్త్, సౌత్ చంద్రపూర్, భోకార్, సోలాపూర్ సౌత్, నాయగావ్, నార్త్ నాందేడ్ ప్రాంతాలలో ప్రచారం నిర్వహించారు. ఈ ప్రాంతాలు వస్త్ర పరిశ్రమకు, ఆలుగడ్డల సేద్యానికి ప్రసిద్ధి చెందినవి. ఇవి తెలంగాణతో సరిహద్దును పంచుకుంటున్నాయి. ఇక్కడ తెలుగు వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుంది. తెలంగాణతో బంధుత్వం కలిగిన వారి సంఖ్య కూడా భారీగానే ఉంటుంది. అయితే తెలుగువారి ఓట్లను క్యాష్ చేసుకోవాలని ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా రేవంత్ రెడ్డితో ప్రచారం చేయించింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ప్రాంతాలకు సరిహద్దున ఉన్న తెలంగాణ జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించింది. భారత రాష్ట్ర సమితి అభ్యర్థులను మట్టికరిపించి భారీగా అసెంబ్లీ స్థానాలను సొంతం చేసుకుంది. ఇటీవలి పార్లమెంటు ఎన్నికల్లోనూ అదే స్థాయిలో ఫలితాలు రావడంతో కాంగ్రెస్ పార్టీ రేవంత్ పై ఆశలు పెంచుకుంది. అధిష్టానం ఆదేశాలతో రేవంత్ రెడ్డి ఈ నియోజకవర్గాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై విమర్శలు చేశారు. కేంద్రం చేస్తున్న తప్పిదాలను ఎండగట్టారు. అయితే ఈ నియోజకవర్గాలలో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయాన్ని చవిచూసింది.. ఏ ఒక్క నియోజకవర్గంలోనూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గట్టి పోటీ ఇవ్వలేకపోయారు. ఈ నియోజకవర్గాలలో బిజెపి అభ్యర్థులు ఘన విజయం సాధించారు. దీంతో సోషల్ మీడియాలో భారత రాష్ట్ర సమితి నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి విమర్శలు చేస్తున్నారు.తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఏఐసిసి సీనియర్ పరిశీలకుడిగా జార్ఖండ్ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ ఎన్నికల సరళిని పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పార్టీ నాయకులకు సూచనలు చేశారు. ఈ వివరాలను పార్టీ హైకమాండ్ కు వెల్లడించారు.

అధిష్టానం నిర్ణయాలను కిందిస్థాయిలో అమలు చేశారు. ఫలితంగా జార్ఖండ్ రాష్ట్రంలో ఇండియా కూటమి విజయం సాధించింది.. హేమంత్ సోరెన్ నేతృత్వంలోని ఝార్ఖండ్ ముక్తి మూర్చ స్పష్టమైన లీడ్ సాధించింది. భట్టి తో పాటు సీనియర్ నాయకులు తన్వీర్ అన్వర్, అల్లావూర్ కృష్ణ కూడా అబ్జర్వర్ పాత్రలను పోషించారు. జార్ఖండ్ రాష్ట్రంలో జార్ఖండ్ ముక్తి మూర్ఛ, కాంగ్రెస్ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయం కావడంతో.. భట్టి విక్రమార్క రాంచి చేరుకున్నారు. ఎన్నికల ఫలితాల సరళిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ.. నాయకులతో మంతనాలు జరుపుతున్నారు. ఇప్పటికే జార్ఖండ్ రాష్ట్రంలో మంత్రివర్గం కూర్పు కు సంబంధించి ఒక నివేదికను భట్టి విక్రమార్క అధిష్టానానికి చేరవేర్చారని తెలుస్తోంది. మొత్తంగా తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రచారం సాగించిన రాష్ట్రాలలో.. ముఖ్యమంత్రికి ప్రతికూల ఫలితాలు రాగా, ఉపముఖ్యమంత్రికి అనుకూల ఫలితాలు రావడం విశేషమని భారత రాష్ట్ర సమితి నాయకులు పేర్కొంటున్నారు. సోషల్ మీడియాలో రేవంత్ రెడ్డి పై విమర్శలు చేస్తూ.. భట్టి విక్రమార్కపై అభినందనలు కురిపిస్తున్నారు.

# హిరోషిమా, నాగాసాకి అణుబాంబు నేలను తాకినప్పుడు ఏం జరిగింది.?

1945 సంవత్సరం వస్తూ వస్తూనే జపాన్‌లో సామాన్యుల జీవితాలను నరకప్రాయం చేసింది. షాపుల్లో గుడ్లు, పాలు, టీ, కాఫీలు పూర్తిగా మాయమయ్యాయి. పాఠశాలల మైదానాల్లో, ఇంటి ఆవరణల్లో కూరగాయలు పెంచుకుని వాటినే తినేవారు. పెట్రోల్ సామాన్యులకు అందనంత ఖరీదైన వస్తువుగా మారిపోయింది. రోడ్లపై ఎక్కడా సొంత కార్లు పరుగులు తీస్తూ కనిపించేవి కావు. హిరోషిమా రహదారుల్లో ఎక్కడచూసినా సైకిళ్లలో, కాలినడకన వెళ్లే జనం, సైనికుల వాహనాలే కనిపించేవి. 1945 ఆగస్ట్ 6.. ఉదయం 7 గంటలకు దక్షిణం వైపు నుంచి వస్తున్న అమెరికా విమానాలను రాడార్లు పసిగట్టాయి. చెవులు చిల్లులు పడేలా హెచ్చరిక సైరన్ మోగింది. జపాన్ అంతటా రేడియో కార్యక్రమాలను నిలిపివేశారు. జపాన్‌లో అప్పటికే పెట్రోల్ నిల్వలు నిండుకున్నాయి. దాంతో ఆ విమానాలను అడ్డుకోడానికి జపాన్ తమ విమానాలను పంపించలేకపోయింది. 8 గంటలకు హెచ్చరిక సైరన్ ఆగింది. రేడియో కార్యక్రమాలు మళ్లీ మొదలయ్యాయి. 8 గంటల 9 నిమిషాలకు అమెరికా వైమానిక దళం కల్నల్ పాల్ టిబెట్స్ తన బీ-29 విమానం 'ఎనోలా గే' ఇంటర్ కమ్‌లో ఒక ప్రకటన చేశారు. 'మీ గాగుల్స్ తీసుకోండి, వాటిని మీ నుదుటిపై పెట్టుకోండి' అన్నాడు.

### కౌంట్ డౌన్ మొదలవగానే




'కౌంట్ డౌన్ మొదలవగానే, వాటిని మీ కళ్లకు పెట్టుకోండి. మీకు కింద భారీ వెలుగు కనిపించకుండా పోయేవరకూ వాటిని అలాగే ఉంచుకోండి'. విమానం పొట్టలో 3.5 మీటర్ల పొడవు, 4 టన్నుల బరువుతో బ్లూ-వైట్ రంగులతో ఉన్న 'లిటిల్ బాయ్' బాంబు ఉంది. దానిని టాప్ సీక్రెట్ మన్‌హాటన్ ప్రాజెక్ట్ కింద లాస్ అలామోస్, న్యూ మెక్సికోలో ఉన్న ప్రయోగశాలల్లో తయారు చేశారు. దాని తయారీని చాలా రహస్యంగా ఉంచారు. ఎంత రహస్యంగా అంటే, అధ్యక్షుడు రూజ్‌వెల్డ్ మరణించాక, ఉపాధ్యక్షుడు హారీ ట్రూమెన్ కొత్త అధ్యక్షుడి బాధ్యతలు తీసుకునే వరకూ ఆయనకు కూడా దాని గురించి తెలీదు. 'ఎనోలా గే' కుడి రెక్క నుంచి పది మీటర్ల దూరంలో ఒక కిలోమీటర్ వెనుక 'గెట్ ఆర్టిస్ట్' అనే ఇంకో బీ-29 విమానం ఎగురుతోంది. అక్కడ మూడో బాంబర్ కూడా వెళ్తోంది. దానిని జార్జ్ మార్క్‌వర్డ్ నడుపుతున్నారు. ఆయనకు ఫొటోలు తీసే బాధ్యత మాత్రమే అప్పగించారు. సరిగ్గా 8 గంటల 13 నిమిషాలకు 'ఎనోలా గే, బాంబార్డియర్ మేజర్ టామ్స్ ఫ్రేబీకి హెడ్ ఫోన్లో 'ఇటీజ్ ఆల్ యువర్స్' అని కల్నల్ పాల్ టిబెట్స్ సందేశం వినిపించింది.. తర్వాత ఆయన ఇంటర్‌కామ్‌లో 'మీ గాగుల్స్ పెట్టుకోండి' అన్నాడు. ఫ్రేబీకి తన గాగుల్స్ నుంచి టార్గెట్ ఏఓఐ బ్రిడ్జ్ కనిపించగానే, 'ఐ హావ్ గాటిట్' అని అరిచాడు.

### హిరోషిమాపై పడిన లిటిల్ బాయ్



సరిగ్గా 8 గంటల 15 నిమిషాలకు 'ఎనోలా గే' నుంచి బయటకు వచ్చిన లిటిల్ బాయ్ హిరోషిమా మీద పడడం మొదలైంది.. 'ఎనోలా గే' నుంచి లిటిల్ బాయ్ కిందకు రావడానికి 43 సెకన్లు పట్టింది. గాలులు వేగంగా వీస్తుండడంతో అది తన లక్ష్యం ఏఓఐ బ్రిడ్జికి 250 మీటర్ల దూరంలో ఉన్న షీమా సర్జికల్ క్లినిక్ పైన పడింది. అది పేలినపుడు ఆ శక్తి 12,500 టన్నుల టీఎంటీతో సమానంగా ఉంది. ఆ ఉష్ణోగ్రత హఠాత్తుగా 10 లక్షల సెంటీగ్రేడ్‌కు చేరింది. 'ద గ్రేట్ ఆర్టిస్ట్'లో ఉన్న పైలెట్ మేజర్ చార్లెస్ స్వీనీ పైనుంచి చూసినపుడు విశాలంగా ఉన్న ఒక అగ్నిగోళం ఏర్పడడం కనిపించింది. ఒకే ఒక్క క్షణంలో నగరంలోని కాంక్రీట్ భవనాలు తప్ప భూమిపై వస్తువులన్నీ మాయమైపోయాయి. విస్ఫోటనం తీవ్రతతో గ్రౌండ్ జీరో నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న అన్ని భవనాల కిటికీ అద్దాలూ ముక్కలైపోయాయి.

### ఆటం బాంబ్ వేసిన విమానం ఏమైంది?



హిరోషిమా నగరంలో రెండు వంతుల భవనాలు ఒక్క క్షణంలోనే ధ్వంసమయ్యాయి. కొన్ని కిలోమీటర్ల వరకూ మంటలు తుఫానులా వ్యాపించాయి. ఒక్క క్షణంలోనే నగరంలోని రెండున్నర లక్షల జనాభాలో 30 శాతం మంది అంటే 80 వేల మందిని మృత్యువు బలి తీసుకుంది. విస్ఫోటనం జరగగానే 'ఎనోలా గే' ముందు కేబిన్లోకి కూడా ఆ వెలుగు వ్యాపించింది. పైలెట్ పాల్ టిబెట్స్‌కు తన పళ్లు వణికినట్టు వింతగా అనిపించింది. విమానం వెనుక భాగంలో కూచున్న టెయిల్ గన్నర్ బాబ్ కేరన్, తన కొడాక్ కెమెరా తీశాడు. కింద కనిపిస్తున్న దృశ్యాలను ఫొటోలు తీయడం మొదలుపెట్టాడు. కింద ఎర్రటి మేఘాల మధ్య తెల్లటి పొగ 3 వేల అడుగుల వరకూ పైకి ఎగిసింది. అది ఒక పుట్టగొడుగు ఆకారంలో కనిపించింది. 'ఎనోలా గే' కో పైలెట్ కెప్టెన్ రాబర్ట్ లూయిస్ తన లాగ్ బుక్‌లో 'మై గాడ్ వాట్ హావ్ వియ్ డన్?' అని రాశాడు. 'ఎనోలా గే' వెపనియర్ విలియమ్ పార్సన్స్ 'ప్రయోగం విజయవంతమైంది, విమానంలో పరిస్థితి మామూలుగా ఉంది' అని ఒక కోడ్ సందేశం పంపించాడు.

### ఆటం బాంబ్ వేసిన విమానం ఏమైంది.?



హిరోషిమా నగరంలో రెండు వంతుల భవనాలు ఒక్క క్షణంలోనే ధ్వంసమయ్యాయి. కొన్ని కిలోమీటర్ల వరకూ మంటలు తుఫానులా వ్యాపించాయి. ఒక్క క్షణంలోనే నగరంలోని రెండున్నర లక్షల జనాభాలో 30 శాతం మంది అంటే 80 వేల మందిని మృత్యువు బలి తీసుకుంది. విస్ఫోటనం జరగగానే 'ఎనోలా గే' ముందు కేబిన్లోకి కూడా ఆ వెలుగు వ్యాపించింది. పైలెట్ పాల్ టిబెట్స్‌కు తన పళ్లు వణికినట్టు వింతగా అనిపించింది. విమానం వెనుక భాగంలో కూచున్న టెయిల్ గన్నర్



బాబ్ కేరన్, తన కొడాక్ కెమెరా తీశాడు. కింద కనిపిస్తున్న దృశ్యాలను ఫొటోలు తీయడం మొదలుపెట్టాడు. కింద ఎర్రటి మేఘాల మధ్య తెల్లటి పొగ 3 వేల అడుగుల వరకూ పైకి ఎగిసింది. అది ఒక పుట్టగొడుగు ఆకారంలో కనిపించింది. 'ఎనోలా గే' కో పైలెట్ కెప్టెన్ రాబర్ట్ లూయిస్ తన లాగ్ బుక్‌లో 'మై గాడ్ వాట్ హావ్ వియ్ డన్?' అని రాశాడు. 'ఎనోలా గే' వెపనియర్ విలియమ్ పార్సన్స్ 'ప్రయోగం విజయవంతమైంది, విమానంలో పరిస్థితి మామూలుగా ఉంది' అని ఒక కోడ్ సందేశం పంపించాడు.

### బాంబు నేలను తాకినప్పుడు ఏం జరిగింది.?

జపాన్ నౌకా దళం డ్రాఫ్ట్‌మెన్ సుతోమూ యామాగూచీ దృష్టి పైన ఎగిరే విమానంపై పడింది.




విమానం నుంచి ఒక చిన్న నల్లటి వస్తువు కింద పడుతుండడం కనిపించింది. తర్వాత క్షణంలోనే అతడికి కళ్ల ముందు చూపు పోయేంత వెలుగు వచ్చింది. అతడి అవయవాలన్నీ పనిచేయడం మానేశాయి. దాంతో చేతులతో కళ్లు మూసుకున్న అతడు నేలపై బోర్లా పడిపోయాడు. కింద భూమి కంపించడంతో యామాగూచీ సుమారు అర మీటరు ఎత్తుకు ఎగిరిపడ్డాడు. తను తిరిగి కళ్లు తెరిచినప్పుడు చుట్టూ అంధకారం అలుముకుని ఉంది. హఠాత్తుగా అతడికి తన ఎడమ వైపున, ఎడమ చేతి దగ్గర భరించలేనంత వేడిగా అనిపించింది. వాంతి చేసుకోవాలనిపిస్తోంది. కళ్లు తిరుగుతున్నాయి. స్పృహ తప్పుతోంది. అప్పుడే అతడికి కొంత దూరంలో ఒక చెట్టు కనిపించింది. దాని ఆకులన్నీ పూర్తిగా రాలిపోయి ఉన్నాయి. ఆ చెట్టు వరకూ వెళ్లడానికి అతడు తన బలమంతా ఉపయోగించాడు. ఎలాగోలా అక్కడికి చేరుకుని దాని మొదలు దగ్గర కూచున్నాడు. అప్పటికే అతడి గొంతు పూర్తిగా ఎండిపోయింది. దాహంతో తపించి పోతున్నాడు.

### బతికి బయటపడినా

హిరోషిమా తూర్పు ప్రాంతంలో ఒక రైలు నగరం వైపు వస్తోంది. సైనికులు హఠాత్తుగా వెళ్తున్న ఆ



రైలును ఆపేశారు. లోపల ఉన్న వాళ్లందర్నీ కిందకు దించేసి వెళ్లిపొమ్మన్నారు. డబ్బాలను ఇంజన్ నుంచి వేరు చేసి, అక్కడే ఆపేశారు. కానీ ఇంజన్ మాత్రం ముందుకెళ్లిపోయింది. కానీ అది ఎంతో దూరం వెళ్లలేకపోయింది. ఎందుకంటే కాలినడకన వెళ్లే వారితో ఆ రైల్వే లైన్ అంతా నిండిపోయి ఉంది.వారిలో కొంతమంది ముఖం నుంచి చర్మం ఊడిపోయింది. కొంతమంది చేతులు విరిగిపోయి శరీరానికి వేలాడుతున్నాయి. కొంతమంది చాలా నెమ్మదిగా నడుస్తున్నారు. వాళ్లందరి నోటి నుంచి ఒకే మాట వస్తోంది. 'నీళ్లు.. నీళ్లు కావాలి.'

### నేను చనిపోతానా.?


అణుబాంబు విస్ఫోటనంతో ఏర్పడిన మేఘాల వల్ల సుమారు 11 గంటలకు హిరోషిమాలో భారీ వర్షం కురవడం మొదలైంది. ఆ వర్షం నల్లగా పడుతోంది. దానిలో దుమ్ము, ధూళి, విస్ఫోటనంతో ఉత్పన్నమైన రేడియో ధార్మిక లక్షణాలు ఉన్నాయి. నిజానికి, ఆ వర్షం చిక్కగా ఉన్న నల్లటి రంగులా ఉంది. గ్రీజులా ఉన్న ఆ వర్షంతో గోడలపై, బట్టలపై మరకలు పడ్డాయి. అక్కడ ఆకులు లేని చెట్టు కింద కూచున్న యామాగూచీ మాత్రం రేడియో యాక్టివ్ వర్షంలో తడవకుండా ఉండగలిగాడు. కాస్త దూరంలోనే ఒక గుంత కనిపించిండంతో అక్కడికి పాక్కుంటూ వెళ్లాడు. అక్కడ ఒక మహిళ ఉంది. ఆమె బట్టలన్నీ కాలిపోయాయి. చర్మం కూడా కమిలి ఎర్రగా అయిపోయింది. ఆమె లేవాలని ప్రయత్నించింది. కానీ పడిపోయింది. లేవలేని స్థితిలో 'సాయం చేయండి, సాయం చేయండి' అంటోంది. యామాగూచీని చూడగానే గొంతు తెచ్చుకున్న ఆమె 'నేను చనిపోబోతున్నానా' అని అడిగింది. అప్పుడే అక్కడకు ఇద్దరు విద్యార్థులు వచ్చారు. వాళ్లకేం కాలేదు. వాళ్లు యామాగూచీతో 'మీరు బాగా కాలిపోయినట్టు కనిపిస్తున్నారు' అన్నారు. యామాగూచీ తన ముఖాన్ని మెల్లగా తడుముకున్నాడు. చర్మం ఊడి చేతికి వస్తున్నట్టు అనిపిస్తోంది. నల్లగా అయిపోయిన తన చేతులు అంతకంతకూ వాచిపోతున్నాయి. ఆ విద్యార్థులు యామాగూచీని తీసుకుని క్లినిక్ చేరారు. అక్కడ కాలిపోయిన శవాలు ఉన్నాయి. కొంతమంది చేతులు కాస్త కదులుతున్నాయి. కానీ ఎక్కువ మంది శరీరాలు ఎలాంటి చలనం లేకుండా ఉన్నాయి. అక్కడ ఒక కంపౌండర్ యామాగూచీ ముఖంపై తెల్లటి క్రీమ్ రాశాడు. చేతికి కట్టు కట్టాడు. అక్కడ రెండు బిస్కెట్లు, కొన్ని నీళ్లు ఇచ్చారు. బిస్కెట్ కొరకగానే అతడు వాంతి చేసుకున్నాడు.

### హిరోషిమా విధ్వంసం చూసిన మొదటి విలేఖరి



స్థానిక విలేకరి 37 ఏళ్ల సాతోషీ నాకామురా ఆరోజు హీరోషిమాకు కాస్త దూరంలో ఉన్న తన స్నేహితుడి ఇంటికి వెళ్లడం వల్ల ప్రమాదం తప్పించుకున్నారు. హీరోషిమాపై అణుబాంబు పడినప్పుడు, ఆ ప్రభావంతో ఆయన నేలమీద పడ్డారు. తన ముఖానికి పగిలిన అద్దాలు గుచ్చుకున్నాయి. తర్వాత నాకామురా తన సైకిల్ తీసుకుని హీరోషిమా వైపు బయల్దేరారు. నాకామురా హీరోషిమా విధ్వంసాన్ని చూసిన తొలి విలేకరి అయ్యారు. ఆయన డోమీ వార్తా ఏజెన్సీకి ఒకాయామా ఆఫీసు నుంచి మొదటి వార్త డిక్టేట్ చేశారు. '8 గంటల 16 నిమిషాలకు శత్రువులు రెండు విమానాల్లో హీరోషిమాపై ఒక ప్రత్యేక బాంబు వేశారు. హీరోషిమా మొత్తం నాశనం అయిపోయింది. సుమారు లక్షా 70 వేల మంది చనిపోయారు' అని చెప్పారు. ఈ వార్త విన్న డోమీ బ్యూరో చీఫ్, నాకామురాతో అది నిజం కాదేమో అన్నారు. ఒక్క బాంబు వల్ల హీరోషిమాలో అంత మంది చనిపోతారా? నీ రిపోర్టులో మృతుల సంఖ్య మార్చాలని చెప్పారు. ఎందుకంటే సైన్యం దాన్ని అంగీకరించడానికి సిద్ధంగా లేదు. దాంతో కోపం వచ్చిన నాకమూరా టెలిఫోన్లోనే 'సైనికులు మూరు?లు' అని గట్టిగా అరిచాడు.

### మూడు రోజుల తర్వాత నాగసాకి మీద పడిన 'ఫ్యాట్ మ్యాన్'



1945 ఆగస్టు 9 మధ్యాహ్నం. జపాన్‌లోని మరో నగరం నాగసాకిలో బీ-29 బాంబర్లు రెండో ఆటం బాంబు జారవిడిచాయి. అది కిందకు చేరడానికి 43 సెకన్లు పట్టింది. బాంబు విస్ఫోటనంతో కిలోమీటర్ పరిధిలో ప్రతి వస్తువూ ధ్వంసమైపోయింది. ఉష్ణ కిరణాలు మనుషుల శరీరంలోని ప్రతి నీటిబొట్టునూ ఆవిరి చేశాయి. క్షణంలోనే చాలా మంది చనిపోయారు, జంతువులు మాడిపోయాయి. పేలుడు తీవ్రతకు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇళ్ల అద్దాలు కూడా ముక్కలైపోయాయి. విస్ఫోటనంతో ఎగసిన వెలుగు కొన్ని సెకన్లే ఉన్నా, దానివల్ల ఏర్పడిన వేడి చర్మంపై థర్డ్ డిగ్రీ బర్న్స్ వచ్చేలా కాల్చేసింది. బాంబు పడిన ప్రాంతానికి 500 మీటర్ల దూరంలో షిరోయామా ప్రైమరీ స్కూల్లో కాంక్రీట్ స్తంభాలు తప్ప వేరే ఏం మిగల్లేదు. అక్కడే నిలబడ్డ చియోకో ఇగాషిరా భయంకరమైన పేలుడు శబ్దాన్ని విన్నాడు. అప్పుడు తన వీపు నుంచి కొంత భాగం ఎగిరిపోయినట్టు అతడికి అనిపించింది. ఇగాషిరా వెంటనే కూతురికి తన శరీరాన్ని అడ్డుపెట్టి కవర్ చేశాడు. ఆ సమయంలో ఆమె తలపై వెంట్రుకలన్నీ నిక్కబొడుచుకున్నాయి. కనుబొమల్లో ఒక్క వెంట్రుక కూడా మిగల్లేదు. ఇగాషిరా సాయం కోసం అరవాలని ప్రయత్నించాడు. కానీ తన నోటి నుంచి మాట రాలేదు.

### క్షణంలో నాగాసాకి నేలమట్టం



బాంబు పడిన కేంద్రానికి కిలోమీటర్ పరిధిలో ప్రతి వస్తువూ వేడికి ఆవిరైపోయింది. అన్నీ కాలి బూడిదైపోయాయి. మైక్రో సెకను లోపలే నాగాసాకీ జైలులోని మూడు భవనాలు నేలమట్టం అయ్యాయి. జైల్లో ఉన్న ఒక్కరు కూడా బతకలేదు. రూట్ నంబర్ 206లో కరెంటుతో నడిచే ట్రామ్ నామరూపాలు లేకుండా పోయింది. నాగసాకీ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో డాక్టర్ తకాషీ నగాయీ తన తరగతిలో ప్రాక్టీస్ చేయించడం కోసం కొన్ని ఎక్స్ రే ఫిల్ములు వెతుకుతున్నారు. అప్పుడే అతడికి చూపు పోగొట్టేంత వెలుగు కనిపించింది. ఆ పేలుడు తీవ్రతతో కిటికీ అద్దాలు పగిలి గది లోపలికొచ్చి పడ్డాయి. ఆ కిటికీల నుంచి గాలి వేగంగా లోపలికొచ్చింది. డాక్టర్ తకాషీ గాల్లో ఎగిరి పడ్డారు. ఆయన ముఖంపై కుడివైపు కోసుకుపోయింది. ముఖమంతా వేడిగా ఉన్న రక్తం కారుతోంది. అంతగా గాయపడ్డా తనకు ఎలాంటి నొప్పి లేకపోవడం ఆయనకు ఆశ్చర్యం కలిగించింది.

### ఒకటిన్నర కిలోమీటర్ దూరం వరకూ

ఆస్పత్రి బయట ఏ వస్తువూ గుర్తించేలా లేదు. అక్కడే ఉన్న సునియో తోమీతా కింద పడిన తన స్నేహితుడు కామోతోను తన భుజాలపై ఎత్తుకోడానికి ప్రయత్నించాడు. కానీ అతడి చేతులకు స్నేహితుడి మాంసం మాత్రమే వచ్చింది. కామోతో మళ్లీ కింద పడిపోయాడు. చనిపోతున్న వారికి,



చనిపోయిన వారికి నోటి నుంచి రక్తం వచ్చింది. తోమీతా వాళ్ల మధ్యకు వెళ్లి నీళ్లు అందించాడు. వారికి ఏం కాదని చెప్పే ప్రయత్నం చేశాడు. కానీ కాసేపటికి అతడు, ప్రొఫెసర్ సికీ మాత్రమే ప్రాణాలతో మిగిలారు. ఆయన చుట్టూ సుమారు 20 శవాలు పడున్నాయి. ఎక్కడ చూసినా మంటలు చెలరేగుతున్నాయి. విస్ఫోటనం జరిగిన స్థలం నుంచి సుమారు ఒకటిన్నర కిలోమీటరు దూరంలో ఉన్న ఒక టార్పెడో ఫ్యాక్టరీలో మిత్సుయీ తకీనో కూడా స్పృహతప్పి నేలపై పడిపోయింది. ఆమెకు స్పృహ వచ్చినపుడు చుట్టూ జనాల అరుపులు, కేకలు వినిపిస్తున్నాయి. ఆమె పైనంతా శిథిలాలు పడున్నాయి. ఆమె కష్టంగా తన కుడి చేతిని తప్పించగలిగింది, కానీ కింద నేలపై ఆమెకు తడిగా ఏదో తగిలింది. తడిమి చూసినపుడు, నేలపై తన రక్తమే ఉందని, తను రక్తపు మడుగులో ఉన్నానని ఆమెకు తెలిసింది.

**( క్రేక్ కోలీ పుస్తకం 'నాగాసాకీ', జేమ్స్ డెల్‌గా ర్డో పుస్తకం 'న్యూక్లియర్ డాన్', చికాసావు మోరాసామీ పుస్తకం 'ద వైట్ స్కై ఇన్ హిరోషిమా' ఆధారంగా )**

## ఆన్‌లైన్‌లో కాలు దువ్వుతున్న పందెం కోళ్లు

**ఏలూరు :** సంక్రాంతి.. ఈ పండగ ఏపీలో చాలా స్పెషల్. దానికి కారణం పందెం కోళ్లు. అవును.. కోడి పందేలు చూడాలంటే గోదావరి జిల్లాలకు వెళ్లాల్సిందే. ఈ సీజన్‌లో పందెం కోళ్లకు చాలా డిమాండ్ ఉంటుంది. ఇటు పందెం రాయుళ్ల అభిరుచికి తగ్గట్టు కోళ్ల పెంపకందారులు అప్‌డేట్ అయ్యారు. పండుగ వచ్చిందంటే చాలు.. ఏపీలో సందడి వాతావరణం ఉంటుంది. ముఖ్యంగా గోదావరి జిల్లాల్లో కోడి పందేలు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తాయి. ఈసారి కూడా పందేలు జోరుగా సాగే అవకాశం ఉంది.సంక్రాంతి పండగ సమీపిస్తున్న నేపథ్యంలో.. పందెం కోళ్లకు భారీగా డిమాండ్ పెరిగింది. ఇప్పటి నుంచే పందెం కోళ్ల కోసం పందెం రాయుళ్లు వెతుకుతున్నారు.పందెం రాయుళ్ల కోసం కోళ్ల పెంపకందారులు వెసులుబాటు కల్పిస్తున్నారు. కోళ్లను పెంచే చోటుకు రాకుండానే డోర్ డెలివరీ చేస్తున్నారు. అవును ఇప్పుడు పందెం కోళ్లను ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో ఉంచుతున్నారు.పెంపకందారులు కోళ్ల ఫొటోలను వివిధ సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. వాటిని చూసిన వారు తమకు కావాల్సిన వాటిని ఎంపిక చేసుకొని డబ్బులు చెల్లిస్తే.. కోళ్లను వారికి పంపిస్తున్నారు.ప్రస్తుతం పెరూ, ఇండియన్ బ్రీడ్ రన్నింగ్‌లో ఉంది. ఎక్కువ డిమాండ్ వీటికే ఉంది. ఒక్కో కోడి పుంజుకు రూ.50 వేల నుంచి లక్ష రూపాయల వరకు ధర ఉంటోంది.ఈ పెందెం కోళ్లకు ప్రత్యేకించి శిక్షణ ఇస్తారు. ఇందు కోసం కుర్రాళ్లను నియమిస్తారు. వీటిని ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు తీసుకెళ్తారు. వేడినీళ్లతో పోతలు (స్నానాలు) చేయిస్తారు.ఈ పందెం కోళ్లు స్ట్రాంగ్ అవ్వడానికి స్విమ్మింగ్ కూడా చేపిస్తారు. గ్యాస్ పోయ్యి మీద ఇత్తడి పళ్లెం పెట్టి శాకాలు తీస్తారు (వేడి గుడ్డతో అద్దుతారు)గోదావరి జిల్లాలో పందెం కోళ్లను ఎక్కువ పెంచుతున్నారు. ఏలూరు జిల్లా చింతలపూడి మండలం వెంకటాపురం గ్రామంలో పామాయిల్ తోటల్లో పెంచుతున్నారు. పందెం కోళ్ల పెంపకంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని కొప్పుల నాగు అనే పెంపకందారు వివరించారు. ఒక్కో కోడి పెంపకానికి దాదాపు రూ.25 వేలు ఖర్చు అవుతుందని చెబుతున్నారు.

## 4వ డిజైన్‌కు జనాలు మొగ్గు

**విజయవాడ :** అమరావతిలో ప్రభుత్వం సీఆర్డీఏ భవనాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుంది. ఈ భవనం డిజైన్లపై ప్రజాభిప్రాయ సేకరణకు అవకాశం ఇచ్చింది. తాజాగా.. ప్రజలు మొగ్గుచూపిన భవనం వివరాలను అధికారులు వెల్లడించారు. ఎక్కువ మంది 4వ డిజైన్ బాగుందని అభిప్రాయపడ్డారు.అమరావతిలో నిర్మించ తలపెట్టిన ఏపీ సీఆర్డీఏ భవనం ఎలా ఉండాలనే దానిపై.. అధికారులు అభిప్రాయ సేకరణ నిర్వహించారు. దీనికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. సీఆర్డీఏ వెబ్‌సైట్ ద్వారా ఓటింగ్ నిర్వహించగా.. వారం రోజుల్లో 9,756 మంది తమ అభిప్రాయాన్ని చెప్పారు. 4వ డిజైన్‌కు 3 వేల 354 మంది ఓటు వేశారు. ప్రజల అభిప్రాయాలను అధికారులు సీఆర్డీఏ వెబ్‌సైట్‌లో ఉంచారు.ఏపీ సీఆర్డీఏ ప్రాజెక్టు ఆఫీసు బిల్డింగ్ ఎలా ఉండాలనే దానిపై అధికారులు వెబ్‌సైట్ ద్వారా పోలింగ్ నిర్వహించారు. ఈ మేరకు ఏపీ సీఆర్డీఏ కమిషనర్ భాస్కర్ కాటమనేని వారం కిందట ప్రకటన విడుదల చేశారు. రాజధాని నిర్మాణంలో ప్రజలను భాగస్వాములు చేయాలనే మౌలిక అంశాన్ని అమలులో పెడుతున్నట్లు కమిషనర్ వివరించారు.ప్రతి అంశాన్ని ప్రజలకు నచ్చిన విధంగా.. వారి ఆమోదంతో చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామని సీఆర్డీఏ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రాజెక్టు కార్యాలయ నిర్మాణం సైతం ఎలా ఉండాలనే దానిపై ప్రజలను భాగస్వామ్యం చేయాలని నిర్ణయించారు?. అందు కోసం పది ఆకర్షణీయమైన డిజైన్లను రూపొందించి వెబ్‌సైట్‌లో ఉంచామని చెప్పారు.ప్రజలు తమకు నచ్చిన డిసైన్ మీద క్లిక్ చేసి ఓటు చేయాలని అధికారులు కోరారు. మెజార్టీ ఓట్ల ఆధారంగా ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. మెజార్టీ ప్రజాభిప్రాయానికి అనుగుణంగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని వివరించారు. వీటిపై ఓటింగ్‌ను డిసెంబర్ 6వ తేదీ వరకు నిర్వహించారు. ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని, రాజధాని నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని కోరారు. దీంతో ప్రజలు పెద్దఎత్తున తమ అభిప్రాయాన్ని చెప్పారు.ఓటింగ్‌ను అనుసరించి భవన డిజైన్లను ఖరారు చేసే అవకాశం ఉంది. ప్రజలు ఎక్కువ 4వ డిజైన్‌కు ఓటు వేశారు. దీంతో దీన్నే ఖరారు చేసే ఛాన్స్ ఉందని తెలుస్తోంది. అటు అమరావతి విషయంలో చంద్రబాబు దూకుడుగా ఉన్నారు. ఇటీవల అమరావతిలో చంద్రబాబు ఇంటిస్థలం కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. వెలగపూడి రెవెన్యూ పరిధిలో స్థలాన్ని ఎంపిక చేసినట్లు సమాచారం.

## ఆదిమూలపు మిస్సింగ్

**ఒంగోలు :** ఉమ్మడి ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గంలోని సీన్. 2019లో 151 సీట్లతో వైసీపీ విజయం సాధించాక.. ఐదేళ్లు పాటు మంత్రి పదవి అనుభవించిన ఆదిమూలపు సురేష్.. ఎక్కడంటూ వైసీపీ శ్రేణులు ప్రశ్నిస్తున్నారట. గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించటంతో పాటు విద్యాశాఖ, మున్సిపల్ శాఖల మంత్రిగా పనిచేసిన సురేష్.. కనిపించిన దాఖలాలు లేవంటూ సొంతనియోజకవర్గంలో చర్చ సాగుతోంది. గత ఎన్నికల్లో ఘోర ఓటమి చెందటంతో తన మూలాలను కాపాడుకునేందుకు పోటీ చేసిన చోట కాకుండా.. పక్క నియోజకవర్గంపై ఆయన దృష్టి సారించారనే వార్తలు గుప్పుమంటున్నాయి.గత ఎన్నికల్లో సురేష్‌ను.. జఅఖ అధిష్ఠానం యర్రగొండపాలెం నుంచి కొండపి నియోజకవర్గానికి బదిలీ చేసింది. ఆ నియోజకవర్గంలో ఓటర్లు ఆయన్ను ఆదరించలేదు. 2009లో యర్రగొండపాలెం నుంచి పోటీ చేసి కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆదిమూలపు స్థానం మార్చుకుని 2014లో సంతనూతలపాడు నుంచి జఅఖ టికెట్‌పై పోటీ చేసి గెలుపొందారు. 2019లో సంతనూతలపాడు సిట్టింగ్ స్థానం వదిలి తిరిగి యర్రగొండపాలెం నుంచి వైసీపీ తరుపున విన్ అయ్యారు. గత ఎన్నికల్లో మాత్రం కొండపి వైసీపీ అభ్యర్థిగా బరిలో నిలిచి.. ప్రస్తుత మంత్రి బాల వీరాంజనేయస్వామి చేతిలో ఘోర పరాజయం పాలయ్యారు. అక్కడ నుంచి సీన్ మొత్తం మారిందని టాక్ నడుస్తోంది.ఎన్నికల్లో ఓడిన నాటి నుంచీ మాజీమంత్రి.. నియోజకవర్గానికి చుట్టంచూపుగా పరిమితం అయ్యారు. ఈ మాట స్వయంగా వైసీపీ శ్రేణులే చర్చించుకుంటున్నారట. ఫుల్ టైమ్ కొండపి బాధ్యతలను ఆదిమూలపు సురేష్ చూడటం లేదని క్యాడర్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎన్నికల్లో ఓటమి తర్వాత సింగరాయకొండలోని వైసీపీ ఆఫీస్ ఎత్తేశారట. తాడేపల్లిలో జరిగే ప్రెస్ మీట్లు తప్ప.. జిల్లాలో జరిగే పార్టీ యాక్టివిటీస్‌లో ఎక్కడా సురేష్ కనిపించటం లేదని నియోజకవర్గంలో టాక్ నడుస్తోంది. మరోవైపు ఆయన హైదరాబాద్‌కే పూర్తిగా పరిమితం అయ్యారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. మరోవైపు కొండపి నియోజకవర్గం తనకు వర్కౌట్ కాదని.. తన సన్నిహితులతో సురేష్ చర్చించినట్లు తెలుస్తోంది. గతంలో కలిసొచ్చిన సంతనూతలపాడే బెస్ట్ అనే ఆలోచనలో మాజీమంత్రి ఉన్నట్లు సమాచారం. యర్రగొండపాలెంకు తిరిగి వెళ్లాలని ఆశ ఉన్నా.. అది తనకు సెట్ కాదనే యోచనలో సురేష్ ఉన్నట్లు టాక్ నడుస్తోంది.ఉమ్మడి ప్రకాశం జిల్లాలో దర్శి, యర్రగొండపాలెం.. రెండు నియోజకవర్గాల్లోనూ వైసీపీ జెండా రెపరెపలాడింది. దీంతో ఆ రెండు నియోజకవర్గాల్లో సురేష్‌కు నో ఛాన్స్. అందుకే మాజీమంత్రి.. సంతనూతలపాడుకు షిఫ్ట్ కావాలని యోచనలో ఉన్నట్లు పొలిటికల్ వర్గాల టాక్ . ప్రస్తుత సంతనూతలపాడు వైసీపీ ఇన్‌ఛార్జ్‌గా మాజీమంత్రి మెరుగు నాగార్జున కొనసాగుతున్నారు. గత ఎన్నికల్లో నాగార్జున.. వేమూరు నుంచి సంతనూతలపాడు షిఫ్ట్ అయ్యి.. ఓటమి చెందారు. తర్వాత ఆయన అటు కన్నెత్తి కూడా చూడలేదట. తాజాగా వైసీపీ అధిష్టానం ఆయన్ను బాపట్ల జిల్లా అధ్యక్షుడుగా నియమించింది. దీంతో ఆయన మళ్లీ సొంత నియోజకవర్గంలో పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారట. ప్రస్తుత వేమూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్‌గా వరికూటి అశోక్ బాబు ఉండగా.. ఆయన కూడా కొండపి వైపే చూస్తున్నారట. దీంతో ఆ నియోజకవర్గంలో మూడుముక్కలాట సాగుతోందనే వార్తలు గుప్పుమంటున్నాయి.

మరోవైపు.. వరికూటి కూడా కొండపి వస్తే మరోసారి గ్రూపు రాజకీయాలకు అవకాశం లేకపోలేదని సొంత పార్టీలో చర్చ సాగుతోందట.మరోవైపు..కొండపి నియోజకవర్గంలో నిలదొక్కుకునేందుకు వైసీపీ చేయని ప్రయత్నాలు లేవని రాజకీయ వర్గాల్లోనూ టాక్ నడుస్తోంది. అక్కడ ఎలాంటి ఫార్ములా ప్రవేశపెట్టినా.. ఫ్యాన్ పార్టీ సక్సెస్ కావటం లేదనే టాక్ ఉంది. నియోజకవర్గంలో ప్రస్తుతం టీడీపీ నుంచి మంత్రి బాలవీరాంజనేయ స్వామి స్ట్రాంగ్‌గా ఉన్నారు. ఓ రకంగా చెప్పాలంటే కొండపిలో ఆయన పాతుకుపోయారంటే అతిశయోక్తి కాదేమో. అక్కడ నుంచి మూడుసార్లు గెలిచిన ట్రాక్ రికార్డు కూడా ఆయన సొంతం. మరోవైపు.. స్వామికి.. దామచర్ల సత్య కుటుంబం అండగా ఉంది. ఆర్థికంగా, సామాజికంగా దామచర్ల కుటుంబం సపోర్ట్ ఉండటంతో.. వైసీపీలో ఏ నేతా.. కొండపి బాధ్యతలు చేపట్టినా ప్రత్యర్థిగా ఉంటున్న స్వామిని ఢీకొట్టలేకపోతున్నారనే వాదన ఉంది.అందుకే ఆ నియోజకవర్గంలో వైసీపీ బాధ్యతలను కొత్తవారికి ఇచ్చేందుకు అధిష్టానం వ్యూహాలు రచిస్తోందట.ఆదిమూలపు సురేష్.. సంతనూతలపాడు షిఫ్ట్ కావటం కన్ఫామ్ అయితే.. కొండపి వైసీపీ ఇన్‌ఛార్జ్ పదవి ఖాళీ అవుతుంది. ఆ స్థానం కోసం వైసీపీ నేతలు జూపూడి ప్రభాకరరావు, మాదాసి వెంకయ్య లైన్‌లో ఉన్నారు. వేమూరు ఇన్‌ఛార్జ్‌గా ఉన్న వరికూటి అశోక్ బాబు.. తనకు వేమూరు నుంచి టిక్కెట్ కావాలని పట్టు పడుతున్నట్లు సమాచారం. ఎన్నికలకు చాలా సమయం ఉండటంతో.. వైసీపీ అధిష్టానం నుంచి ఎలాంటి ఆదేశాలు వస్తాయోననే ఉత్కంఠ ఉంది.ఇప్పటికే నియోజకవర్గాల్లో నేతల మార్పిడి అంశం.. ఎన్నికల్లో స్పష్టంగా కనిపించిందని రాజకీయవర్గాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మాజీమంత్రి ఆదిమూలపు సురేష్ నియోజకవర్గం మారితే.. ఆ ఎఫెక్ట్ మిగతా నియోజకవర్గాల్లోనూ పడే అవకాశం లేకపోలేదనే టాక్ పొలిటికల్ వర్గాల్లో సాగుతోందట. ఈ నేపథ్యంలో అధినేత జగన్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోననే ఆసక్తి నెలకొంది.

# ఆస్తుల కోసం మంచు ఫ్యామిలీలో గొడవలు

**తిరుపతి :** టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో బడా ఫ్యామిలీ గా గుర్తింపు తెచ్చుకున్న కుటుంబాలలో మంచు మోహన్ బాబు కుటుంబం కూడా ఒకటి. క్రమశిక్షణకు మారుపేరైన ఈ కుటుంబంలో ఆస్తుల విషయంలో అన్నదమ్ముల మధ్య గొడవలు తారాస్థాయికి చేరుతున్నట్టు గత కొద్ది రోజులుగా వార్తలు వైరల్ అవుతున్న విషయం తెలిసిందే. దీనికి తోడు మంచుమనోజ్ )రెండో వివాహం చేసుకోవడం ఇష్టంలేని మంచు విష్ణుదంపతులు కూడా మనోజ్ పెళ్లిలో గెస్ట్ గానే వచ్చి వెళ్ళిపోయారు. దీనికి తోడు మంచు విష్ణు.. మనోజ్ అనుచరుడి పైన దాడి చేసినప్పుడు, ఆ వీడియోని మనోజ్ సోషల్ మీడియాలో షేర్ చేయడంతో ఇద్దరి మధ్య గొడవలు ఉన్నాయని అప్పుడు బహిర్గతం అయింది.అయితే ఇప్పుడు తాజాగా మరో వార్త తెరపైకి వచ్చిన విషయం తెలిసిందే. గతంలో మంచు మనోజ్ ని మోహన్ బాబు గత కొన్నేళ్లుగా దూరంగా ఉంచుతున్నారనే వార్తలు రాగా.. ఇప్పుడు ఏకంగా మనోజ్ పై దాడి చేశారట.గాయాలతోనే హైదరాబాదులోని పహాడి షరీఫ్ పోలీస్ స్టేషన్లో తన తండ్రి మోహన్ బాబు పై కంప్లైంట్ ఇచ్చారు మంచు మనోజ్. అంతే కాదు ఆయన భార్య భూమా మౌనిక రెడ్డిపై కూడా మోహన్ బాబు దాడి చేసినట్లు పోలీసుల ఫిర్యాదులో తెలిపారు. గత కొద్ది రోజులుగా మంచు ఫ్యామిలీలో ఆస్తి తగాదాలు ఎక్కువగా వినిపిస్తున్న నేపథ్యంలో మంచు మోహన్ బాబుకు సంబంధించిన విద్యానికేతన్ విద్యాసంస్థలతో పాటు ఇతర ఆస్తుల పంపకాల విషయంలోనే అవకతవకలు జరిగాయని, దీంతో మంచు మనోజ్ తన ఫ్యామిలీకి దూరంగా ఉంటున్నాడని వస్తున్న వార్తలకు ఇది మరింత బలాన్ని చేకూర్చింది. గత కొద్ది రోజులుగా మంచు కుటుంబంలో సభ్యుల మధ్య గొడవలు జరుగుతున్నాయంటూ వార్తలు బహిరంగంగా వైరల్ పైన విషయం తెలిసిందే. ముఖ్యంగా అన్నదమ్ములైన మంచు మనోజ్ మంచు విష్ణుమధ్య గొడవలు తారాస్థాయికి చేరినట్లు పెద్ద ఎత్తున వైరల్ అయిన విషయం తెలిసిందే. దీనికి తోడు మంచు మనోజ్ రెండో వివాహం చేసుకున్నప్పుడు కూడా మంచు విష్ణు దంపతులు బంధువుల లాగ వచ్చి వెళ్ళిపోయారు. ఇక తర్వాత తమ మధ్య ఎలాంటి గొడవలు లేవని కప్పిపుచ్చే ప్రయత్నం చేసినా ప్రజలు మాత్రం నమ్మలేదనే చెప్పాలి.అయితే ఇప్పుడు తాజాగా మళ్లీ మోహన్ బాబు కుటుంబంలో గొడవలు జరిగినట్లు ఒక వార్త వైరల్ అవుతోంది. అంతేకాదు నటుడు మోహన్ బాబు పై మంచు మనోజ్ ఫిర్యాదు చేశారు. తన తండ్రి తనను కొట్టాడని పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్లో మంచు మనోజ్ కంప్లైంట్ చేశారు. ముఖ్యంగా శరీరం మొత్తం గాయాలతో మంచు మనోజ్ పోలీస్ స్టేషన్ కి వచ్చి ఫిర్యాదు చేయడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అంతేకాదు తనతో పాటు తన భార్యపై కూడా దాడి చేశారని తన తండ్రి మోహన్ బాబు పై ఫిర్యాదు చేశారు మంచు మనోజ్.అయితే మంచు మనోజ్ పై మోహన్ బాబు కూడా పోలీస్ కంప్లైంట్ ఇవ్వడం జరిగింది. మనోజ్ తనపై దాడి చేశాడని తన కొడుకు పై కంప్లైంట్ ఇచ్చారు మోహన్ బాబు. మొత్తానికైతే పరస్పర ఫిర్యాదులు స్వీకరించిన పోలీసులు ఈ విషయంపై ఎలాంటి యాక్షన్ తీసుకుంటారో తెలియాల్సి ఉందిఏది ఏమైనా సినీ ఇండస్ట్రీలో బడా ఫ్యామిలీ గా గుర్తింపు తెచ్చుకున్న వీరు ఆస్తుల కోసమే పరస్పర దాడులు చేసుకున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఆస్తులు, స్కూల్ వ్యవహారంలోనే ఈ దాడులు జరిగినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ విషయం అటు సెలబ్రిటీలను ఇటు ఇండస్ట్రీని ఒక్కసారిగా ఉలిక్కిపాటుకు గురిచేసింది.ఇకపోతే గతంలో మంచు విష్ణు మనోజ్ అనుచరుడిపై దాడి చేయడాన్ని వీడియో తీసి, ఆ వీడియోను మనోజ్ సోషల్ మీడియాలో షేర్ చేయడంలో మంచు కుటుంబంలో గొడవలు మొదలయ్యాయని అందరూ అనుకున్నారు. ఆ తర్వాత మంచు మోహన్ బాబు చొరవ తీసుకొని ఆ వీడియోని డిలీట్ చేశారు. అయితే ఒకానొక సందర్భంలో అలీ షో లో పాల్గొన్న మంచు విష్ణు తో నీకు, నీ తమ్ముడికి మధ్య గొడవలు ఏంటి అంటూ అలీ ప్రశ్నించగా..మంచు విష్ణు కోపంగా.. రియాక్ట్ అయ్యాడు. వేసుకున్న కోట్ కూడా విప్పేస్తూ.. పర్సనల్ విషయాలు వాళ్లకెందుకు అంటూ నెటిజన్స్ ని ఉద్దేశించి ఆగ్రహం వ్యక్తం చేశాడు మంచు విష్ణు. మొత్తానికైతే గత కొద్ది రోజులుగా మంచు వారసుల మధ్య ఆస్తి గొడవలు జరుగుతున్నాయి అంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరగగా..ఇదే ప్రశ్నను ఆలీ అడిగాడు. దీనికి తోడు మంచు విష్ణు అలాంటి రియాక్షన్ ఇవ్వగా ఇప్పుడు మళ్లీ పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇవ్వడంతో సరికొత్త అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.అయితే ఇలా వార్తలు వైరల్ అయ్యాయో లేదో వెంటనే మోహన్ బాబు కుటుంబం స్పందించి, ఈ వార్తలకు చెక్ పెట్టింది. మోహన్ బాబు, మంచు మనోజ్ పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారనే వార్తల్లో నిజం లేదు.. మంచు మనోజ్ దెబ్బలతో వచ్చి మరీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తున్నట్లు కొంతమంది ఊహాజనితమైన కథనాలను ప్రచారం చేస్తున్నారు. ఎవిడెన్స్ లు లేకుండా అసత్య ప్రచారాలు చేయకండి అంటూ కొన్ని మీడియా ఛానల్స్ పై మంచి మోహన్ బాబు కుటుంబం ఫైర్ అయ్యిందికానీ ఈ విషయంపై తాజాగా డీసీపీ కన్ఫామ్ చేసినట్లు తెలుస్తోంది.

డయల్ 100 కి ఇద్దరు ఫోన్ చేసి ఒకరి మీద ఒకరు ఫిర్యాదు చేసుకున్నారట. మహేశ్వరం పోలీస్ స్టేషన్లో డయల్ 100 కి కాల్ చేసినట్లు డీసీపీ తెలిపినట్లు సమాచారం. మోహన్ బాబు కాలేజీ యూనివర్సిటీ వ్యవహారాలు చూసుకునే వినయ్ తనపై దాడి చేసి కొట్టాడని, తన తండ్రి ప్రమేయంతోనే వినయ్ వినయ్ రౌడీ మూకలతో కలిసి తనపై దాడి చేశారు అని మనోజ్ తన కంప్లైంట్ లో పేర్కొన్నట్లు తెలిపారని తెలిసింది. మొత్తానికైతే గొడవలను మోహన్ బాబు కుటుంబం కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నా.. తనకు జరిగిన అన్యాయాన్ని బయటపెడుతున్నారు మంచు మనోజ్. ఇక ప్రస్తుతం ఈ విషయాలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.

## చిన్నారులు ఏమౌతున్నారు...

**– ఎన్‌హెచ్‌ఆర్సీ సూటి ప్రశ్న**

**విజయవాడ :** ఏపీలో చిన్నారుల మిస్సింగ్ ఇష్యూపై ఎన్‌హెచ్‌ఆర్సీ సీరియస్ అయ్యింది. ఈ వ్యవహారంపై స్పష్టమైన నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఏపీ సీఎస్ వ్యక్తిగతంగా హాజరు కావాలని సమన్లు జారీ చేసింది. గతంలో కోరిన నివేదిక ఇవ్వని కారణంగా ఎన్‌హెచ్‌ఆర్సీ ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెలుస్తోంది.ఆంధ్రప్రదేశ్‌లో చిన్నారుల మిస్సింగ్‌పై జాతీయ మానవ హక్కుల కమిషన్ సీరియస్ అయ్యింది. 3 వేల మంది బాలికలు తప్పిపోయిన ఇష్యూకు సంబంధించి నివేదిక ఇవ్వాలని గతంలో ప్రభుత్వానికి (సీఎస్, డీజీపీ)కి ఆదేశాలు ఇచ్చినట్టు స్పష్టం చేసింది. అయినా అందుకు సంబంధించి నివేదికను ఇవ్వలేదని అసహనం వ్యక్తం చేసింది.అందుకే ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వ్యక్తిగతంగా హాజరవ్వాలని.. ఎన్‌హెచ్‌ఆర్సీ సమన్లు జారీ చేసింది. 20.01.2025న కమిషన్ ముందు అవసరమైన సమాచారం, వివరాలతో వ్యక్తిగతంగా హాజరవ్వాలని స్పష్టం చేసింది. అయితే.. 14.01.2025 లోపు సమగ్ర నివేదిక అందజేస్తే.. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఉంటుందని.. జాతీయ మానవ హక్కుల కమిషన్ వెల్లడించింది. న్యాయవాది, సామాజిక కార్యకర్త ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేశారు. ఓ పత్రికలో ప్రచురించిన వివరాలను ఫిర్యాదుకు జత చేశారు. ఫిర్యాదు ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లో 3 వేల మంది బాలికలు అదృశ్యమయ్యారని పేర్కొన్నారు. ప్రతిరోజూ 8 మంది కంటే ఎక్కువ మంది బాలికలు తప్పిపోయారని వివరించారు. 2022లో డేటా ప్రకారం.. వారిలో చాలామంది ఆచూకీ తెలియలేదన్నారు .దాదాపు 371 మంది తప్పిపోయిన బాలికల ఆచూకీ ఇంకా లభ్యం కాలేదని.. ఫిర్యాదుదారు ఆరోపించారు. రాష్ట్రంలో మొత్తం 3,592 మంది బాలికలు అదృశ్యమయ్యారు. వారిలో 3,221 మంది బాలికల ఆచూకీ లభించింది. ఈ ఫిర్యాదుపై ఎన్‌హెచ్‌ఆర్సీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. ఈ విషయంలో అవసరమైన ప్రతిస్పందనను పన్నెండు వారాల్లోగా సమర్పించాలని సీఎస్, డీజీపీని ఆదేశించింది.2022, 2023, 2024 సంవత్సరాల్లో తప్పిపోయిన పిల్లల సమగ్ర స్థితి నివేదికను 18-06-2024 తేదీన ఆంధ్రప్రదేశ్ అదనపు డీజీపీ వీడియో లెటర్ ద్వారా సమర్పించారు. కానీ.. సీఎస్ నుంచి ఎలాంటి నివేదిక రాలేదు. దీంతో సీఎస్ వ్యక్తిగతంగా హాజరవ్వాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ సమన్లు జారీ చేసింది.

## కొడాలిపై కేసులు తిరగదోడుతున్న పోలీసులు

**విజయవాడ :** వైసీపీ అధికారంలో ఉన్నంత కాలం బూతులతో విపక్ష నేతలపై చెలరేగిపోయిన మాజీ మంత్రి, గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని ఒక్కసారిగా సైలెంట్ అయిపోయారు. వైసీపీ అధ్యక్షుడు జగన్ ఆదేశాల మేరకు అప్పుడప్పుడూ బయటకు వచ్చి కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నా.. ఆయన మాటల్లో ఇది వరకటి ఫైర్ కనిపించడం లేదు. కేసుల భయంతోనే ఆయన సైలెంట్ అవుతున్నారన్నది ఓపెన్ సీక్రేట్టే. కొడాలి నాని సైలంట్ మోడ్లో ఉన్నంత మాత్రాన మంత్రి నారా లోకేష్ రెడ్‌బుక్ ఛాప్టర్లో ఆయన పేజీ చిరిగిపోలేదని తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. కొడాలి నాని అనుచరులను పోలీసులు వరుసగా అరెస్టులు చేస్తున్నారు. అధికారంలో ఉండగా ఆ మాజీ మంత్రి గ్యాంగ్ చేసిన అరాచకాలపై పోలీసులు చర్యలు చేపట్టారు. తాజాగా 9 మంది కొడాలి నాని అనుచరులను గుడివాడ పోలీసులు అరెస్ట్ చేశారు. 2022 డిసెంబర్‌లో వార టీడీపీ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు వస్త్ర దుకాణంపై పెట్రోల్ ప్యాకెట్లతో దాడి చేసి అరాచకం సృష్టించారు. అప్పట్లో దానిపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు.ఆ కేసుని తిరగదోడిన పోలీసులు వివిధ సెక్షన్ల కింద తిరిగి అభియోగాలు నమోదు చేసి కొడాలి నాని అనుచరులను అరెస్ట్ చేశారు. అప్పట్లో కొడాలి నాని అనుచరులకు గుడివాడ గడ్డం బ్యాచ్ అని పేరుండేది. ప్రస్తుత కేసులకు సంబంధించి .. ఆ గడ్డం బ్యాచ్‌లో కీ రోల్ పోషించిన కృష్ణాజిల్లా వైసీపీ అధ్యక్షుడు మెరుగుమాల కాళీ పరారీలో ఉన్నాడట. అతను అస్సాం రాష్ట్రానికి పరారైనట్లు గుర్తించిన పోలీసులు ప్రత్యేక బృందంతో గాలింపుచర్యలు చేపడుతున్నారంట.వైసీపీ అధికారంలో ఉండగా ఆ పార్టీ నేతల చేసినా అరాచకాలపై.. నమోదైన కేసులను పోలీసులు తిరగతోడుతున్నారు. వరుస అరెస్టులతో.. వైసీపీ అరాచక వాదుల వెన్నులో వణుకు మొదలైంది. వైసీపీ అధికారంలో ఉండగా ఆ పార్టీ నేతలు చేసిన ఓవరాక్షన్ అంతా ఇంతా కాదన్న ఆరోపణలున్నాయి. ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లుగా ఇష్టానుసారం వ్యవహరించారు. టీడీపీ కార్యకర్తలు మొదలుకుని నేతలు.. ఆఖరికి పార్టీ ఆఫీసులను కూడా ధ్వంసం చేసిన సందర్భాలు కోకొల్లలు. సీన్ కట్ చేస్తే.. ఐదంటే ఐదేళ్లలో టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో నాడు చెలరేగిపోయిన వారి భరతం పడుతున్నారు.ఇప్పటికే మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయం, గన్నవరం టీడీపీ ఆఫీస్‌పై జరిగిన దాడికి సంబంధించి వరుస అరెస్టులు జరుగుతుండగా.. కృష్ణా జిల్లా గుడివాడ టీడీపీ కార్యాలయంపై దాడి వ్యవహారం బయటి తీశారు. దీంతో గుడివాడ వైసీపీ నేతలకు ఉచ్చు బిగుస్తోంది. మాజీ మంత్రి కొడాలి నాని టార్గెట్‌గా ఏపీ పోలీసులు చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

వైసీపీ అధికారంలోకి ఉండగా కొడాలి నాని, ఆయన అనుచరులు గుడివాడ టీడీపీ నేతలు.. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరావును తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. వంగవీటి మోహనరంగా వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొనకూడదని రావి వెంకటేశ్వరరావుకు ఫోన్ చేసి మరీ వైసీపీ నేతలు బెదిరించారు. ఆఖరికి టీడీపీ కార్యాలయంలో ఉన్న రావి, ఇతర టీడీపీ నేతలపై కత్తులు, కర్రలు, ఇనుప రాడ్లు, పెట్రోల్ ప్యాకెట్లతో వైసీపీ నేతలు, కార్యకర్తలు దాడికి తెగబడ్డారు. అయితే ఇంత జరుగుతున్నా అప్పటి సీఐ ప్రోద్భలంతో పోలీసులంతా కొడాలి గ్యాంగుకే కొమ్మకాశారు.ఇప్పుడు సీన్ మారింది. దాడి తాలుకూ వీడియో ఫుటేజ్ ఆధారంగా నాటి దాడులపై కొడాలి నాని అనుచరులపై కేసులు నమోదు చేశారు. మరోవైపు గుడివాడ కే కన్వెన్షన్‌లో జరిగిన క్యాసినో వ్యవహారంపై నిజనిర్ధారణకు వచ్చిన టీడీపీ కమిటీపై జరిగిన దాడులకు సంబంధించి పోలీసులు తాజాగా విచారణ చేపట్టారు. కొడాలి నాని క్యాసినో వ్యవహారంపై గుడివాడ వచ్చిన నిజ నిర్ధారణ కమిటీ నేతలపై దాడులు జరిగిన అందరికీ తెలిసిందే. కార్లు ధ్వంసం, గుడివాడ టీడీపీ కార్యాలయంపై దాడి, ఫర్నిచర్ ధ్వంసం ఘటనలలో నాడు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని టీడీపీ నేతలపైనే పోలీసులు కేసులు నమోదు చేశారు.మొత్తానికి చూస్తే.. కొడాలి నాని టార్గెట్‌గా చర్యలకు ఏపీ పోలీసులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే నానిపై పలు కేసులు నమోదయ్యాయి. తాజాగా కొడాలి నాని అనుచరులను అరెస్ట్ చేయడంతో కొడాలి నానికి ముహూర్తం పెట్టేసిననట్లే అంటున్నారు. సంక్రాంతి పండుగ తర్వాత జగన్ ప్రజాక్షేత్రంలోకి వస్తానంటు?నారు. అప్పుడు ఆయన బయటకు వచ్చినప్పుడే కొడాలి నాని అరెస్టుకి ముహూర్తం పెడతారన్న టాక్ వినిపిస్తుంది.

## విక్రాంత్ రెడ్డి కోసం గూగుల్ సెర్చ్

**కాకినాడ :** విక్రాంత్‌రెడ్డి. గతంలో ఈ పేరు ఎక్కడా వినిపించలేదు కదా. అటు రాజకీయాల్లో కానీ.. ఇటు ఇతర రంగాల్లో కానీ కనిపించని ఆ వ్యక్తే? జూ ఫ్యామిలీకి ఆర్థికవనరు అంటే అతిశయోక్తి కాదేమో. ఎందుకంటే ప్రస్తుతానికి ఈ పేరు దేశవ్యాప్తంగా మార్మోగుతోంది. కాకినాడ పోర్టులో జరిగిన అవకతవకలపై అంశంపైనే ఈ పేరు బలంగా వినిపిస్తోంది. ఇన్నాళ్లూ ఎక్కడా వినిపించని పేరు కోసం.. కొందరు గూగుల్ సెర్చ్ చేశారట. మొత్తానికి విక్రాంత్ రెడ్డి ఎవరనే అంశంపై స్పష్టత వచ్చేసింది. ఆయన ఋఅ మాజీ ఛైర్మన్, వైసీపీ కీలక నేత వైవీ సుబ్బారెడ్డి తనయుడు.అసలు విక్రాంత్‌రెడ్డిపై ఉన్న అభియోగాలు ఏంటో ఓ సారి చూద్దాం. కాకినాడ పోర్టు వ్యవహారంలో కేవీ రావుని బెదిరించటమే కాకుండా? ఆయన్ను ఇబ్బందులు పాలు చేసి 41.12 శాతం వాటాని బలవంతంగా బదలాయించడంలో విక్రాంత్ రెడ్డి కీలకమట. ఆ కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న విక్రాంత్‌రెడ్డి?ఏపీ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ కూడా దాఖలు చేశారు. తీగ లాగితే డొంక కదిలిన చందంగా ఒక్కో విషయం బయటకు వస్తుంటే.. చాలా మందీ ఔరా అంటూ ముక్కున వేలేసుకుంటున్నారట. ఎందుకంటే ఇన్నాళ్లూ తాడేపల్లి ప్యాలెస్‌కు ఫైనాన్స్ సమకూర్చింది ఇతగాడేనని తెలుసుకున్న సొంత పార్టీ నేతలే.. ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారట. సుబ్బారెడ్డి ఫ్యామిలీ మొదటి నుంచీ రాజశేఖర్ రెడ్డికి నమ్మిన బంటుగా ఉన్నారు. ప్రకాశంజిల్లా అద్దంకి నియోజకవర్గ పరిధిలో మేదరమెట్ల గ్రామానికి చెందిన జ.ఎ.సుబ్బారెడ్డి 30 ఎకరాలు భూస్వామి. ఆయన ఏకైక సంతానమే ఈ విక్రాంత్ రెడ్డి. రాజశేఖర్‌రెడ్డి మరణం తర్వాత విజయమ్మ, షర్మిల వైపు సుబ్బారెడ్డి నిలబడ్డారట. ఇది తెలుసుకున్న జగన్? చిన్నాన్నను దూరం పెడుతూ వచ్చారు. తర్వాత కాలంలో జరిగిన పరిణామాలు, రాజకీయ కారణాలు నేపథ్యంలో విక్రాంత్ రెడ్డి కూడా జగన్ ఇంట్లో కీలక వ్యక్తిగా మారాడట. ఏ స్థాయిలో అంటే? తాడేపల్లికి చెందిన ప్రతి ఆర్థిక లావాదేవీలూ.. విక్రాంత్‌రెడ్డే చూసుకునే వారట. పార్టీకి సంబంధించిన అన్ని వ్యవహారాలూ చక్కబెడుతూ.. అనతి కాలంలోనే పేరు తెచ్చుకున్నాడట. 2020 నుంచి విక్రాంత్ రెడ్డి చేతుల మీదుగానే తాడేపల్లి ఆర్థిక వ్యవహారాలు సాగాయంటేనే తెలుస్తోంది. అతనికి ఉన్న పవర్ ఏంటోతాడేపల్లి ప్యాలెస్ నుంచి వచ్చే ప్రతి ఆదేశాలనూ విక్రాంత్ రెడ్డి తూచా తప్పకుండా పాటించేవారట. రాష్ట్రంలో పలు అంశాలకు సంబంధించిన ఆర్థిక సెటిల్‌మెంట్లు విక్రాంత్‌రెడ్డి నేతృత్వంలో జరిగేవంటేనే ఊహించుకోవచ్చు. అతను సామర్థం ఏంటో? 2021 నుంచి 2023 వరకూ? అనకాపల్లి, పార్వతీపురం మన్యం జిల్లాల్లో మైనింగ్ మాఫియాలో ఇతను కీలకంగా వ్యవహరించారనే వార్తలు గుప్పమన్నాయి. ఈ మాఫియాకు కొనసాగింపు కోసం? ఫారెస్ట్ ఏరియాలో సుమారు 40 కిలోమీటర్ల మేర సిమెంట్ రోడ్డు కూడా ఏర్పాటు చేసుకున్నారట. లేటరైట్ మైనింగ్ అంశం అప్పట్లో పెను దుమారాన్నే రేపింది. ఈ మైనింగ్ పౌడర్‌ను భారతి సిమెంట్ తయారీతో పాటు అల్యూమినియం తయారీలోనూ ఎక్కువగా వినియోగించేవారట. తద్వారా కోట్ల రూపాయల ఆర్థికలావాదేవీలు జరిగినట్లు తెలుస్తోంది.కాకినాడ పోర్టుకు సంబంధించి జగన్ సూచనలు, సలహాలు మేరకే?తనతో ? విక్రాంత్ రెడ్డి అనేక సందర్భాల్లో డైరెక్ట్‌గా? ఇన్‌డైరెక్ట్‌గా మాట్లాడినట్లు?ఐ.ఎ. రావు ఫిర్యాదులో పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని వైవీ నివాసంలో మూడుసార్లు పైగా? శరత్‌చంద్రారెడ్డి, కేవీ రావుతో కలసి విక్రాంత్‌రెడ్డి చర్చలు జరిపినట్లు సమాచారం. వీటిని బేస్ చేసుకుని ఆర్థిక బదలాయింపు కొనసాగినట్లు కేవీ రావు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఒక్కొక్కటిగా విక్రాంత్ అరాచాలు బయటకు వస్తున్నాయని పొలిటికల్ టాక్ నడుస్తోంది.ఎలాంటి రాజకీయ అనుభవం లేకపోయినా? తాడేపల్లి ప్యాలెస్ నుంచి ఆర్థిక వ్యవహారాలను విక్రాంత్‌రెడ్డే నడిపారనే విషయం.. ఇప్పటివరకూ చాలా మందికీ తెలియదట. పైకి అందరూ? సాయిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి పేర్లు మాత్రమే చెప్పినా?. ప్రతి ఆర్థికవ్యవహారాన్ని విక్రాంత్ రెడ్డి చక్కబెట్టినట్లు సమాచారం.

## వందే భారత్ స్లీపర్ .. రెడీ టూ స్టార్ట్

**చెన్నై :** వందేభారత్.. ఈ పేరు ఇప్పటికే భారతీయుల నోళ్లలో నానుతోంది. వేగంగా గమ్యస్థానాలకు ప్రయాణికులను చేర్చాలన్న లక్ష్యంతో రైల్వే వందేభారత్ రైళ్లను ప్రవేశపెట్టింది. ఇప్పటికే ఈ అత్యాధునిక రైళ్లు పట్టాలపై పరుగులు పెడుతున్నాయిఅత్యాధునిక సౌకర్యాలతో.. ప్రయాణికులను అత్యంత వేగంగా గమ్యస్థానాలకు చేర్చాలన్న లక్ష్యంతో మేకిన్ ఇండియాలో భాగంగా భారత ప్రభుత్వం వందే భారత్ రైళ్లను తయారు చేయించింది. మూడేళ్ల క్రితం ప్రారంభమైన ఈ రైళ్లు ఇప్పటికే దేశమంతా పట్టాలపై పరుగులు పెడుతున్నాయి. అత్యాధునిక సౌకర్యాలు ఉండడంతో చార్జీ కాస్త ఎక్కువైనా ప్రయాణికులు ఇబ్బంది పడడం లేదు. దీంతో వందే భారత్ సక్సెస్ అయింది. ఈ నేపథ్యంలో ఇండియన్ రైల్వే కొత్తగా వందే భారత్ స్లీపర్‌ను పట్టాలెక్కించబోతోంది. ఇప్పటి వరరకు వందే భారత్ రైళ్లు చైర్‌కార్‌లు మాత్రమే ఉన్నాయి. ఈ నేపథ్యంలో వీటిని ఉదయం పూట నడుపుతున్నారు.

అయితే స్లీపర్ సౌకర్యాలతో కూడిన రైళ్లను సిద్ధం చేస్తోంది. అందుకు అనుగుణంగా స్లీపర్ వెర్షన్‌ను అన్ని హంగులతో సిద్ధం చేస్తోంది. త్వరలో ట్రయల్ రన్ నిర్వహించి పట్టాలెక్కించబోతున్నారు.ప్రయాణికులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న వందేభారత్ స్లీపర్ వెర్షన్ త్వరలో పట్టాలెక్కబోతున్నాయి. ఇందుకు సంబంధించిన బోగీలు చెన్నై ఐసీఎఫ్(ఇండిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ)లో తుది మెరుగులు దిద్దుకుంటుఅన్నయి. ప్రయోగాత్మకంగా వీటిని ఇప్పటికే మీడియాకు ప్రదర్శించారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏకధాటిగా 1,200 కిలోమీటర్లు ప్రయాణించేందుకు అవసరమైన సౌకర్యలతో రూపొందించారు. ఇది గరిష్టంగా గంటకు 160 కిలోమీటర్ల వేగవంతో ప్రయాణిస్తుంది.ఇక బోగీల్లో అత్యధునిక సౌకర్యాలు కల్పించారు. మొబైల్ చార్జింగ్, మేగజైన్లు,. టేబుల్, ఇన్నపాటి లైట్, సామగ్రి కోసం విశాలమైన స్థలం, వేడినీరు, సీసీ కెమెరాలు, అత్యవసర సమయాల్లో డ్రైవర్‌తో మాట్లాడే సౌకర్యం, బయో వాక్యూమ్ టాయిలెట్‌లు ఏర్పాటు చేశారు. 2025, జనవరిలో వీటిని పట్టాలెక్కించేందుకు ఇండియన్ రైల్వే సన్నాహాలు చేస్తోంది.వందే భారత్ స్లీపర్ వెర్షన్ ట్రయల్ రన్ ఇప్పటికే ప్రారంభమైంది. నవంబర్ 15 నుంచి ట్రయల్‌రల్ చేస్తున్నారు. ట్రయల్స్ పూర్తి కాగానే జనవరి 15 నుంచి పట్టాలపై పరుగులు పెడుతుంది. ఇక వాణిజ్య రైళ్లను కూడా అందుబాటులోకి తెచ్చేందుకు భారత రైల్వే కసరత్తు చేస్తోంది. కేంద్రం అనుమతి ఇస్తే ఫిబ్రవరి నాటికి కమర్షియల్ రైళ్లను కూడా సిద్ధం చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

## తగ్గిన పుష్ప-2

# టికెట్ ధరలు



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కథానాయకుడిగా నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ ‘పుష్ప2: ది రూల్’. ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళం అని తేడా లేకుండా బాక్సాఫీస్ వద్ద కలెక్షన్స్ సునామీ సృష్టిస్తున్న విషయం తెలిసిందే. కేవలం 3 రోజుల్లో ఈ చిత్రం రూ.600 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అయితే ఈ సినిమా టికెట్ రేట్లకు సంబంధించి మూవీ ప్రేక్షకుల నుంచి నెగిటివ్ వచ్చిన విషయం తెలిసిందే. బెనిఫిట్ షో టికెట్‌నే రూ.1250గా పెట్టిన చిత్రబృందం విడుదలైన తర్వాత టికెట్ రేట్లను సింగిల్ స్క్రీన్‌లో రూ.350గా.. మల్టీప్లెక్స్‌లో రూ.550గా పెట్టింది. దీంతో సాధారణ ప్రేక్షకులు ఈ సినిమాకు చాలా దూరమయ్యారు. ముఖ్యంగా ఒక ఫ్యామిలీ నుంచి నలుగురు ఈ సినిమాకి వెళ్లాలి అంటే సింగిల్ స్క్రీన్‌లో రూ.1380 అవ్వనుండగా.. మల్టీప్లెక్స్‌లో రూ.2120లు కానుంది. దీంతో టికెట్ ధరలు మూవీపై చాలా ఎఫెక్ట్ పడ్డాయి. సోషల్ మీడియాలో అయితే టికెట్ ధరలపై సెటైర్లు , ట్రోలింగ్ ఓ రేంజ్‌లో జరిగింది. ఈ నేపథ్యంలో పుష్ప నిర్మాతలు దిగొచ్చారు. సోమవారం నుంచి ఈ సినిమా టికెట్ ధరలు తగ్గిస్తున్నట్లు వెల్లడించారు. ఇక తగ్గిన ధరల బట్టి చూసుకుంటే.. సింగిల్ స్క్రీన్‌లో రూ.200 ఉండగా.. మల్టీప్లెక్స్‌లో రూ.350గా ఉంది. దీంతో అల్లు అర్జున్ అభిమానులు సంబరపడుతున్నారు. ఇప్పటి వరకు టికెట్ ధరలు చూసి భయపడ్డ ప్రేక్షకులు ఇకపై థియేటర్‌కు వచ్చే అవకాశాలు

# అలాంటి ప్రేమ మరొకటి లేదు

## - వైరల్‌గా సమంత పోస్ట్




స్టార్ నటి సమంత తాజాగా తన పెంపుడు శునకం సాషాతో ఉన్న ఫొటోను ఇన్‌స్టా స్టోరీస్‌లో పంచుకుంది. ఈ ఫొటోకు ‘సాషా ప్రేమ లాంటి ప్రేమ మరొకటి లేదు’ అంటూ ఫొటోకు క్యాప్షన్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. స్టార్ నటి సమంతతో విడాకుల అనంతరం అక్కినేని నాగచైతన్య కొత్త బంధంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. మరోనటి శోభిత ధూళిపాళ్లతో ఏడడుగులు వేశారు. వీరి వివాహం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో వీరిద్దరూ వివాహ బంధంతో ఒక్కటయ్యారు. అయితే, వీరి వివాహం వేళ సమంత పెడుతున్న పోస్ట్‌లు ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారాయి. నాలుగు రోజుల క్రితం అమ్మాయి, అబ్బాయి కుస్తీ పోటీలకు సంబంధించిన వీడియో షేర్ చేసిన సమంత.. తాజాగా తన పెంపుడు శునకం సాషాతో ఉన్న ఫొటోను ఇన్‌స్టా స్టోరీస్‌లో పంచుకుంది. ఈ ఫొటోకు ‘సాషా ప్రేమ లాంటి ప్రేమ మరొకటి లేదు’ అంటూ ఫొటోకు క్యాప్షన్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. కాగా, సామ్ గత కొంతకాలంగా గడ్డుపరిస్థితుల్ని ఎదుర్కొంటోన్న విషయం తెలిసిందే. నాగ చైతన్యతో విడాకుల అనంతరం కొద్దిరోజులకే మయోసైటిస్ బారిన పడింది. దాన్నుంచి కోలుకునేందుకు సినిమాలకు కాస్త బ్రేక్ ఇచ్చింది. ఇప్పుడిప్పుడే.. మళ్లీ తిరిగి తన వర్క్‌లైఫ్‌లో బిజీగా మారుతుండగా ఇంతలో తన తండ్రి జోసెఫ్ ప్రభు హఠాత్తుగా మరణించారు. మరోవైపు మాజీ భర్త మరో అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో తీవ్ర



## ట్రిపుల్‌ఆర్‌పై

# డాక్యుమెంటరీ




దర్శకధీరుడు రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన బ్లాక్ బస్టర్ చిత్రం ఆర్‌ఆర్‌ఆర్. అగ్ర కథానాయకులు ఎన్టీఆర్, రామ్ చరణ్ ప్రధాన పాత్రలో నటించగా బాలీవుడ్ బ్యూటీ అలియా భట్ కథానాయికగా నటించింది. డీవీవీ ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌పై వచ్చిన ఈ చిత్రం ఈ సినిమా 2021లో విడుదలై బ్లాక్ బస్టర్ అందుకోవడమే కాకుండా ఆస్కార్ అవార్డును గెలుచుకుంది. అయితే ఈ సినిమా షూటింగ్ ప్రారంభించి నేటికి 6 ఏండ్లు అవుతున్న సందర్భంగా.. చిత్రయూనిట్ సాలిడ్ అప్‌డేట్ ఇచ్చింది. ఈ సినిమాపై డాక్యుమెంటరీ రాబోతున్నట్లు ప్రకటించింది. ప్రపంచం మొత్తం ఈ సినిమా కీర్తిని చూసింది. ఇప్పుడు లోతులను చూస్తారు అంటూ పేరిటా డాక్యుమెంటరీ చిత్రంను అనౌన్స్ చేసింది. ఇక ఈ డాక్యును డిసెంబర్‌లో స్ట్రీమింగ్ చేయనున్నట్లు సమాచారం. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ ఈ మూవీ డాక్యుమెంటరీ హాక్కులను దక్కించుకున్నట్లు తెలుస్తుంది. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## ఆ పాత్ర చేయడం

# ఎంతో అదృష్టం

బాలీవుడ్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం ‘రామాయణ’ నితీశ్ తివారీ దర్శకత్వంలో బాలీవుడ్ అగ్ర నిర్మాతలతో కలిసి భారీ బడ్జెట్‌తో అల్లు అరవింద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో రాముడిగా రణ్‌బీర్ కపూర్ నటిస్తుండగా.. సీతగా సాయిపల్లవి కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా షూటింగ్ అపడేట్‌ను రణ్‌బీర్ పంచుకున్నారు. “రామాయణ ప్రాజెక్ట్‌లో వర్క్ చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఇది ఎంతో గొప్ప కథ. చిన్నప్పటినుంచి వింటూ పెరిగాం. ఎంతోమంది ప్రతిభావంతులైన కళాకారులు ఇందులో వర్క్ చేస్తున్నారు. నితీశ్ తివారి అద్భుతంగా తెరకెక్కిస్తున్నారు. రెండు పార్టులుగా ఈ చిత్రం విడుదల కానుంది. పార్ట్1లో నా భాగం షూటింగ్ పూర్తి చేశాను. త్వరలోనే పార్ట్2 చిత్రీకరణ కూడా మొదలవుతుంది. ఇలాంటి పాత్రలో నటించడం నాకు కల. ఈ చిత్రంతో ఆ కల నిజమైంది. మన భారతీయ సంస్కృతి, గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పే గొప్ప సినిమా ‘రామాయణ” అని అన్నారు. ఇటీవలే ఈ సినిమా గురించి నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. విడుదల తేదీలను తెలుపుతూ పోస్టర్ విడుదల చేసింది. 2026 దీపావళికి మొదటి పార్ట్, 2027లో రెండో పార్ట్ విడుదల కానుంది. ఈ చిత్రం గురించి చాలా కాలంగా వార్తలు వస్తూనే ఉన్నాయి. ఫొటోలు షేర్ అవుతూనే ఉన్నాయి.

సైలెంట్‌గా చిత్రీకరణను పూర్తి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో తన పాత్ర కోసం రణ్‌బీర్ శిక్షణ తీసుకున్నారు. డైట్ ఫాలో అవుతున్నట్లు తెలిపారు. ఈ సినిమా పూర్తయ్యే వరకే మద్యం మామానేసినట్లు చెప్పారు. ఇక సీత పాత్రలో నటించడం తన అదృష్టమని సాయిపల్లవి చెప్పారు. ఇక ఇందులో రావణుడిగా యశ్ కనిపించనున్నారు. హనుమంతుడి పాత్రలో సన్నీ దేవోల్, కైకేయిగా లారా దత్తా, శూర్పణఖగా రకుల్ ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు సమాచారం.



## నా ఫిట్‌నెస్‌కు

# కారణం అదే...!

‘గడిచిన జీవితం అంతా చదువు, ఆటలతోనే సరిపోయింది. నిజానికి నా లైఫ్‌లో సరదాలు తక్కువే. చిన్నప్పట్నుంచీ క్రమశిక్షణతోనే పెరిగాను. నాన్న సోల్జర్ కావడంతో ఇల్లాంతా ఆర్మీ వాతావరణమే ఉండేది.’ అంటూ చెప్పుకొచ్చింది మీనాక్షి చౌదరి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత విషయాల గురించి ఆమె మాట్లాడింది. ‘నాన్నకు ఆరోగ్యంపై శ్రద్ధ ఎక్కువ. అందుకే చిన్నప్పట్నుంచీ నన్ను స్పోర్ట్స్ వైపు నడిపించారు. నేను స్విమ్మింగ్, బ్యాట్మింటన్‌లో స్టేట్ లెవల్ ప్లేయర్‌ని. నా ఫిజిక్ ఫిట్‌గా ఉండటానికి కారణం అదే. నాన్న ద్వారా అబ్బిన ప్రపంచజ్ఞానం నన్ను మిస్ ఇండియాగా నిలబెట్టింది. హీరోయిన్ అవుతానని మాత్రం అస్సలు అనుకోలేదు. ఓ విధంగా ఇదంతా మా నాన్న ఆశీర్వాదం’ అంటూ ఆనందం వెలిబుచ్చింది మీనాక్షి చౌదరి. వెంకటేశ్‌కి జోడీగా ఆమె నటించిన ‘సంక్రాంతికి వస్తున్నాం’ చిత్రం సంక్రాంతి కానుకగా విడుదల కానున్న విషయం తెలిసిందే.



## ది గర్ల్‌ఫ్రెండ్

# టీజర్ రిలీజ్

యానిమల్, పుష్ప 2 ది రూల్ సినిమాలతో వరుస బ్లాక్ బస్టర్‌లు అందుకుంది నేషనల్ క్రష్ రష్మిక మందన్నా. అయితే ఈ సినిమాలు ఇచ్చిన జోష్‌తో ప్రస్తుతం లేడీ ఓరియెంటెడ్ ప్రాజెక్ట్ చేస్తుంది ఈ భామ. రష్మిక ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం ‘ది గర్ల్‌ఫ్రెండ్’. ఈ సినిమాకు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటుండగా.. మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. నయనం నయనం కలిసే తరుణం.. ఎదనం పరుగై పెరిగే వేగం. నా కదిలే మనసుని అడిగా సాయం. ఇక మీదట నువ్వే దానికి గమ్యం అంటూ విజయ్ దేవరకొండ వాయిస్ ఓవర్‌తో టీజర్ ప్రారంభమవుతుంది. స్టోరీ ఏం రివీల్ చేయకుండా టీజర్‌ను కట్ చేశారు మేకర్స్. ఇందులో రష్మిక బాయ్ ?ఫ్రెండ్‌గా దీక్షిత్ శెట్టి నటించబోతున్నాడు. గీత ఆర్ట్స్ బ్యానర్‌పై ఈ సినిమాను అల్లు అరవింద్ నిర్మిస్తున్నాడు.



